వీక్షణం

Veekshanam Fortnightly

ఆర్థిక, సామాజిక పక్ష పత్రిక

సంపుటి:1 సంచిక:24 డిసెంబర్ 1-31, 2004

ప్రత్యేక సంచిక

ఆంధ్రప్రదేశ్‌లో నీటి పారుదల

డి. నరసింహారెడ్డి
టి. హనుమంతరావు
కె. ఆర్. చౌదరి
ఎం. కోదండరాం
అపర్ణ
ఎం. భరత్‌భూషణ్
ఇ. రేవతి
కె. ముత్యం రెడ్డి
సుందరయ్య
సారంపల్లి మల్లారెడ్డి
కొల్లి నాగేశ్వరరావు
ఎస్. వి. శేషగిరిరావు
గాదె దివాకర్
విద్యాభూషణ్
డి. వి. సుబ్బారావు
ఎన్. వేణుగోపాల్

'వీక్షణం' పక్ష పత్రిక

8-3-898/22, నాగార్జున నగర్, హైదరాబాద్-500 073

ఆంధ్రప్రదేశ్‌లో సాగుభూమి-సాగునీరు 2001-02 (లక్షల ఎకరాలలో)

[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
[illegible]	9.11	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	2.0	1162
[illegible]	8.59	[illegible]	20.02	1.58	[illegible]	[illegible]	[illegible]	0.61	1131
[illegible]	9.36	[illegible]	[illegible]	[illegible]	[illegible]	4.14	[illegible]	[illegible]	1202
[illegible]	27.08	[illegible]	[illegible]	[illegible]	2.50	11.86	43.78	[illegible]	1165
[illegible]	11.44	[illegible]	60.66	[illegible]	[illegible]	8.55	72.96	[illegible]	1216
[illegible]	12.45	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	1152
[illegible]	13.88	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	1034
[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
[illegible]	[illegible]	[illegible]	21.70	1.85	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	12.27	[illegible]	[illegible]	[illegible]	[illegible]
[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	2.19	[illegible]
[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	2.84	1.52	[illegible]	[illegible]	[illegible]
[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	11.48	[illegible]	[illegible]	[illegible]
[illegible]	[illegible]	5.48	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	2.78	[illegible]	19.97	[illegible]	[illegible]
[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	4.00	7.21	42.16	[illegible]	[illegible]
[illegible]	17.36	0.08	3.45	1.45	5.92	7.45	42.42	6.39	[illegible]
[illegible]	13.41	0.92	29.23	1.31	1.85	7.06	42.29	[illegible]	1124
[illegible]	75.87	7.14	9.05	5.34	17.58	30.06	38.11	17.67	1055
[illegible]	369.48	66.92	18.11	16.81	55.90	142.63	38.60	[illegible]	944

వీక్షణం

veekshanam fortnightly

ఆర్థిక , సామాజిక పక్షపత్రిక

సంపుటి: 1 సంచిక: 24 | సమతా పబ్లికేషన్స్ ప్రచురణ | డిసెంబర్ 1-31 , 2004

లోపలి పేజీల్లో...

నీటిపారుదల

విడి ప్రతి: రు॥ 12/-
వార్షిక చందా:రూ॥140/-లు

సంపాదకీయం:

ప్రచార ఆర్భాటమా? సాకారమయ్యే స్వప్నమా?

ముఖ్యమంత్రి డా. వై.ఎస్. రాజశేఖరరెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయరంగానికి ప్రాధాన్యత ఇస్తామనే తమ ఎన్నికల వాగ్దానానికి అనుగుణంగా నీటిపారుదల ప్రాజెక్టులను ప్రకటించింది. చాలా భారీగా రు.46,000 కోట్ల వ్యయంతో నిర్మించతలపెట్టిన 26 నీటిపారుదల ప్రాజెక్టులను ప్రకటించడం మాత్రమే కాక, దాదాపు అన్ని ప్రాజెక్టులకు హడావుడిగా శంకుస్థాపనలు చేసింది. దాదాపు ప్రతి జిల్లాలోను ఇటువంటి కార్యక్రమాలు జరిగాయి. ఆ నదులలో, ఏర్లలో నీళ్ళు ఉన్నాయా లేదా, ప్రాజెక్టులు నిజంగా ఉపయోగకరమైనవా కాదా, ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన అనుమతులన్నీ వచ్చాయా లేదా, ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన అపారమైన నిధులను ఎట్లా సమీకరిస్తారు వంటి ప్రశ్నల్లో ఏ ఒక్కదానికీ సంతృప్తికరమైన జవాబులు లేకుండానే ఈ ప్రాజెక్టుల ఆర్భాటం జరిగిపోతోంది.

నిజంగా పనుల గురించి, ప్రజా ప్రయోజనాల గురించి ఏ మాత్రం ఆలోచన లేకుండా, కేవలం ప్రచార ఆర్భాటంతో ప్రజాధనం వందలకోట్ల రూపాయలు దుర్వినియోగం చేశారని మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మీద రాజశేఖరరెడ్డి నిరంతరం విమర్శిస్తుండేవారు. ఆ విమర్శ చాలా వరకు యదార్థమే. కాని ప్రస్తుతం ప్రాజెక్టుల విషయంలో రాజశేఖర రెడ్డి ప్రభుత్వ పని తీరుకూడా ఆ దిశలోనే సాగుతున్నదనిపిస్తోంది.

ఈ ప్రాజెక్టుల నిర్మాణం పేరుమీద ఆశ్రితులకు కాంట్రాక్టులు ఇచ్చి, వందల కోట్ల రూపాయల అవినీతికి దారితీశారనే విమర్శ పెద్ద ఎత్తున చెలరేగి, కోర్టు వివాదాలకు కూడ దారితీసంది. ఆ అవినీతి వ్యవహారం నిజానిజాలు ఎట్లా ఉన్నా, ప్రాజెక్టుల గురించి వివరమైన, శాస్త్రీయమైన అంచనాలు లేకుండానే ప్రభుత్వం హడావుడిగా రంగంలోకి దిగిందని బైటపడింది.

నిజానికి రాష్ట్ర వ్యవసాయ రంగాన్ని బాగుపరచాలంటే, అవ్వవసరమైన నీటిపారుదల సౌకర్యాలు కల్పించాలంటే వేలకోట్ల రూపాయల భారీ పథకాల కన్న గ్రామీణ స్థాయిలో ప్రజల శ్రమతో, చొరవతో, తక్కువ ఖర్చుతో నిర్మించగలిగిన చిన్నతరహా, మధ్యతరహా నీటిపారుదల ప్రాజెక్టులవైపు దృష్టిసారించాలి. అటువంటి వాస్తవికమైన వైఖరి లేనంతకాలం వేసే ప్రతి పథకమూ నిజంగా ప్రజా ప్రయోజనాల కోసం కాక మరేవో రాజకీయ, ఆర్థిక, కమీషన్ల ప్రయోజనాల కోసమే జరిగినట్లు ప్రజలూ అనుమానిస్తారు. ఆ అనుమానాలలో నిజమూ ఉంటుంది.

వ్యవసాయ సంస్కరణలు- వ్యవసాయ వ్యవస్థలో మార్పులు

-ప్రొ॥ డి. నరసింహారెడ్డి
అర్థశాస్త్ర ఆచార్యులు, కేంద్ర విశ్వవిద్యాలయం

భారత వ్యవసాయరంగ సంక్షోభం లోకవిదితం. అది ఈ శతాబ్దం మధ్య కాలంనుంచి సంక్రమించిన వారసత్వం. అయినా, ఉత్పత్తిని ఉత్పత్తి సంబంధాలను ప్రభావితం చేస్తున్న ప్రధాన ధోరణులను పరిశీలించవలసి ఉంది.

స్వాతంత్ర్యానికి ముందు కాలంలోనూ, ఆ తర్వాతా భూసంస్కరణల కోసం జరిగిన అనేక రాజకీయ ఉద్యమాలు వ్యవసాయరంగంలో ఫ్యూడల్ దోపిడీ రద్దు చేయడానికి ఒక నాంది పలికాయి. 1950ల నాటికి భూస్వామ్య విధానం ముగింపుకు వచ్చింది. సంస్కరణల్లో భాగంగా కమతాల మదింపు, భూసంబంధాలలో కొద్దిపాటి మార్పులు జరిగాయి. చిన్న కమతాలను ఏకంచేయడం వల్ల ఉత్పాదకత కొంత మెరుగుపడినప్పటికి-ఆ పని కొన్ని రాష్ట్రాలకే పరిమితమయింది.

1950, 60ల్లో రాష్ట్ర శాసనసభల ద్వారా అమల్లోకి వచ్చిన రెండు ప్రధాన భూపంపకం సంస్కరణలను-అంటే కమతాలపై పరిమితి, కౌలు సంస్కరణలు-అమలు చేయడంలో రాజకీయ సంకల్పం లోపించడం గురించి, అధికార యంత్రాంగం వాటి ప్రభావాన్ని నీళ్ళుగార్చడం గురించి తీవ్రవిమర్శలు వచ్చాయి. అధికార యంత్రాంగం, రాజకీయ నాయకత్వం కూడా అగ్రకులాలకే చెందిన వైనందున, అవి ఆ వర్గాల రాజకీయ ప్రయోజనాలనే కాపాడేందుకు పూనుకొన్నాయన్న ఆరోపణలు వచ్చాయి. శ్రామికవర్గ, రైతాంగ మద్దతుగల రాజకీయ పార్టీలు ఉన్న రాష్ట్రాలలో మరోరకమైన అనుభవం ఉంది. పరిమితి చట్టాలు, కౌలుదారీ చట్టాలు-వాటి అమలు దేశంలోని వివిధ ప్రాంతాలలో, వివిధ స్థాయిల్లో ఉన్నాయి. అవి ప్రధానంగా నాలుగు రకాలుగా జరిగాయి.

1. బీహార్ వంటి అర్ధభూస్వామ్య ప్రాంతాల్లో-ప్రస్తుత సామాజిక స్వరూపాన్ని బట్టి భూసంస్కరణల చట్టాల తీవ్రతకు, వాటి అమలుకు అనేక బలమైన అవరోధాలున్నాయి.
2. కర్ణాటక వంటి ప్రాంతాలలో భూసంస్కరణల అమలుకు బలమైన ఆవశ్యకత ఉండడంతో, వాటికి అవరోధాలు కూడా విస్మరించతగ్గ స్థాయిలోనే ఉన్నాయి. అందువల్ల మంచి ఫలితాలే వచ్చాయి.
3. పశ్చిమ బెంగాల్, కేరళ వంటి బలమైన రాజకీయ సమీకరణ గల ప్రాంతాలలో సమర్ధవంతమైన భూసంస్కరణల అమలులోకి వచ్చినా-వృద్ధిరేటు చాలా బలహీనంగా ఉండడం వల్ల-సంస్కరణల ఫలితం-వ్యవస్థాగత మార్పు తెచ్చేంతగా ఉన్నదని చెప్పడానికి వీలు లేదు.
4. పంజాబ్ వంటి హరితవిప్లవ ప్రాంతాలలో పెట్టుబడిదారీ సంబంధాలు ప్రవేశించి, సంస్కరణలు కేవలం వేతనాల పెరుగుదల- పనిపరిస్థితులు-వ్యవసాయ కార్మికుల ఆర్థిక పరిస్థితులు వంటి వాటికే పరిమితమయ్యాయి.

ఈ అనుభవాలను బట్టి ఈ దిగువ నిర్ధారణలకు రావచ్చు:

1. పైన పేర్కొన్న నాలుగురకాల పరిస్థితుల్లోను, గ్రామీణ పేదలకు భూమి స్వాధీనం కావడం గాని, వారు దానిని నిలుపుకోవడం గాని లేదా వారికి భూమిపై సమానావకాశాలు ఏర్పడడం గాని జరగలేదు. భూమిపై అధిక జనాభా వత్తిడి ఏర్పడినందువల్ల భూమి నిర్వహణపై వివిధ గ్రామీణ వర్గాలమధ్య తీవ్ర పోటీ ఏర్పడింది.
2. ప్రాబల్య వర్గాలకు అంటే బీహార్‌లో జమిందారులు, కర్ణాటకలో భారీ కమతాలున్నవారు, పంజాబ్‌లో పెట్టుబడిదారీ రైతులు-భూసంస్కరణల చట్టాలను రూపొందించడంలో, వాటిని అమలు పరచడంలో నిర్ణయాత్మక ప్రభావం ఉంది. అందువల్ల వారు గ్రామీణ పేదలకు లభించవలసిన ప్రయోజనాలను కూడా తమకే చెందేలా మరల్చుకోగలుగుతున్నారు.
3. గ్రామీణ పేదలు రాజకీయంగా సుసంఘటితంగా ఉన్న బెంగాల్, కేరళలలో వారు నేరుగా లభించే లబ్ధిని మాత్రమే అందుకో గలిగారు తప్ప, తమ ఆర్థిక హోదాల్లో మాత్రం పూర్తి అభివృద్ధి సాధించలేక పోయారు.
4. విధాన నిర్ణేతలు సాధారణంగా ఎక్కువ సమయాన్ని, శక్తి

భూసంస్కరణల చట్టాలను మెరుగుపరచడం గురించి, వాటిని అమలు పరచడం గురించీ వినియోగిస్తారు. ఇవి ముఖ్యమైన అంశాలే అయినప్పటికీ, సమర్థవంతమైన భూసంస్కరణల ప్రమాణం మాత్రం-అవి అభివృద్ధి వ్యూహాలలో భాగంగా, దారిద్ర్య నిర్మూలనకు, సామాజిక న్యాయ సాధనకు ఎంతమేరకు దోహద పడ్డాయన్నదే!

అలాంటి వ్యూహం అంటూ లేకుండా కేవలం భూసంస్కరణలను రూపొందించడం వల్ల, అమలు పరచడం వల్ల తగినంత ఫలితం లభించదు.

అనుభవాన్ని బట్టి, పంజాబ్‌లో అత్యంత అభివృద్ధి చెందిన వ్యవసాయ పెట్టుబడిదారీ విధానాన్ని, ఈశాన్య రాష్ట్రాలలోని భూస్వామ్య పూర్వ , కులాధార వ్యవసాయాన్ని, బీహార్‌లో ధనికవర్గాల ప్రైవేట్ సైన్యాల ఆధిపత్యంలోని పాక్షిక భూస్వామ్య విధానాన్ని, దక్షిణాదిలో ప్రముఖంగా ఉన్న రైతాంగ సొంత వ్యవసాయాన్ని-ఎవరూ ఏకం చేయలేరు. వారి వ్యవసాయ రుగ్మతలన్నింటికి ఏకైక పరిష్కారం అంటూ ఏదీలేదు. భారతదేశంలోని విభిన్న ప్రాంతాలలో వ్యవసాయాభివృద్ధి-విభిన్న స్థాయిల్లో ఉంది. అందువల్ల విభిన్న యాజమాన్య-కౌలుదారీ ఒప్పందాలు అవసరమవుతాయి.

వ్యవసాయరంగంపై భూసంస్కరణల ప్రభావం, అనేకమంది మేధావులకు పరిశోధనాంశమయ్యింది. వ్యవసాయంపై ఆధారపడుతున్న చిన్న, పేదరైతుల కుటుంబాలలో, వారు సాగుచేస్తున్న భూమివిస్తీర్ణాలలో ఒక సాధారణ పెరుగుదల కనిపిస్తున్నది. పెద్ద రైతుల కుటుంబాలు, వారి భూమి విస్తీర్ణంలో తగ్గుదల కూడా కనిపిస్తున్నది. అలాగే అన్ని వర్గాల రైతులకు చెందిన కమతాల సగటు భూవిస్తీర్ణంలో క్షీణత కూడా కనిపిస్తోంది. ప్రత్యేక నిష్పత్తుల క్షీణతలో కూడా ఎంతో కొంత పెరుగుదల కనిపిస్తోంది. భూమి కాకుండా, వ్యవసాయయంత్ర సామాగ్రి, భవనాలు వంటి ఆస్తుల కేంద్రీకరణలో అత్యధిక పెరుగుదల ఉంది. అన్నింటికంటే, భూమి లేని కుటుంబాల విషయంలో తీవ్ర పెరుగుదల కనిపించడమే దారుణం. భూమి దాదాపుగా లేని గ్రామీణ పేద కుటుంబాల పెరుగుదల 1970-71లో కేవలం 10 శాతమే కాగా, 1991-92లో అది 11 శాతానికి పెరిగింది. భూమిలేని కుటుంబాలలో అర ఎకరంలోపు భూమి ఉన్న కుటుంబాలు-అంటే దాదాపుగా భూమిలేని కుటుంబాలను కూడా కలిపి చూస్తే-1970-71లో 30 శాతం దాకా, 1990-91లో 40 శాతం దాకా-అంటే దాదాపు గ్రామీణ కుటుంబాలలో సగం-పెరిగింది. వెనుకబడిన గ్రామీణ వర్గాలలో ఇలాంటి కుటుంబాలే అత్యధికం. వారిలో పది ఎకరాలు అంత కంటే ఎక్కువ (మధ్య తరగతి, భారీ కమతాలు) భూమిగల వారిని ధనికరైతులుగా పరిగణిస్తే, గ్రామీణ ప్రాంతాలలో ఆధిపత్యం వహిస్తున్నది వారే!

1970-71 దాకా ఈ ధనిక వర్గం పెరుగుదల కనిపిస్తోంది. అవి ఇప్పటికీ మొత్తం కుటుంబాలలో 15 నుంచి 20 శాతం దాకా ఉన్నాయి. అలాగే మొత్తం భూమి విస్తీర్ణంలో కూడా వారికి అరవై నుంచి 65 శాతం దాకా భూమి ఉంది.

కాని 1970-71 నాటికి ఈ ధనికరైతులు కేవలం గ్రామీణ ప్రాంతాలలోనే కాక, ప్రభుత్వ విధానాలను, అలాగే ప్రజలను కూడా ప్రభావితం చేయగలిగిన ప్రాబల్య వర్గాలుగా స్థిరపడ్డారు. అలాగే వారు భూసంస్కరణల చట్టాలను తమకు అనుకూలంగా మలచుకోగల ప్రాబల్యాన్ని కూడా సంతరించుకోగలిగారు. 1960 ల చివరిదాకా ఈ వర్గాలపై భూసంస్కరణల చట్టాల ప్రభావం ఎంతమాత్రం పడలేదనేది బాగా తెలిసిన విషయమే. భూసంస్కరణల చట్టాలకోసం, వాటి అనుమతులకోసం సమర్థవంతమైన రాజకీయ వత్తిడి ఏర్పడిన 1970ల నాటికల్లా ధనికరైతువర్గం సురక్షిత స్థానాన్ని పదిలపరచుకుంది. ప్రభుత్వ పెట్టుబడుల వల్ల, నూతన సాంకేతిక విధానాలవల్ల ఎక్కడైతే భూముల ఉత్పాదకత ఆస్తిగామారిందో అక్కడల్లా భూసంస్కరణల చట్టాలు నిష్ప్రయోజనమయ్యాయి. మిగులు భూమిగా వీలైనంత తక్కువే చూపడం, స్వాధీన పరచినవి కూడా నాసిరకం భూములే కావడం జరిగింది. భారతదేశంలో పేదరైతులకు పంపకం చేసిన మిగులు భూములు మొత్తం సాగుభూముల్లో 2 శాతానికి కూడా మించలేదు. అదే తూర్పు ఆసియా దేశాలలో అయితే, 25 నుంచి 40 శాతం దాకా ఉంది. ధనికరైతులు తమవద్ద మిగుల్చుకున్నవి, మంచి నాణ్యతగల భూములు ఒక్కటే కాదు, అవి ప్రభుత్వ పెట్టుబడులతో నీటిపారుదల, విద్యుత్ సౌకర్యాలను ఉపయోగించుకొనే ఉత్తమ ఉత్పాదకత కలిగిన ఆస్తులు కూడా! ఆ భూములు అభివృద్ధి చెందిన సాంకేతికతను, అత్యధిక ప్రభుత్వ సబ్సిడీలను కూడా అందుకోవడానికి సిద్ధంగా ఉన్నాయి.

ఆ విధంగా మనం గ్రామీణ కుటుంబాలలో మొదటి 15 శాతం కుటుంబాలను పరిశీలిస్తే-వారు యాభై శాతం భూముల్ని నిర్వహిస్తున్నట్టు తేలుతుంది. 1960ల చివరి ఈ భూముల్లో

అత్యధికభాగం అత్యధిక ఉత్పాదకత కలిగినవి. చిన్న, పేద రైతులకు చెందిన 80 శాతం కుటుంబాలు నిర్వహిస్తున్నది మొత్తం భూమిలో 30 శాతం మాత్రమే. వాటిలో కూడా అధికభాగం నాసిరకం భూములే!

కొన్ని రాష్ట్రాలలో దిగుబడి నిష్పత్తులను, భూకేంద్రీకరణలో దారుణ పరిస్థితులను-పేద, ధనిక రైతుల చేతుల్లో ఉన్న భూముల గుణాత్మక భేదాలతో కలిపి-పరిశీలించాలి.

భూసంస్కరణల చట్టాలను పునరుద్ధరించిన 1970ల దాకా, కుటుంబాల నిష్పత్తిలో, అలాగే పెద్ద రైతుల చేతుల్లో ఉన్న భూవిస్తీర్ణాలలో కూడా పెద్దగా కౌలు మార్పులు కనిపించలేదు. దున్నేవారికే భూమిని బదలాయించే లక్ష్యంతో ఉన్నట్టు కనిపిస్తున్న కౌలుచట్టం (1950ల్లో రద్దయిన జమీందారులు, ఇతర మధ్యవర్తుల పరిధిలోని కౌలుదారులను మినహాయించి) ఆ లక్ష్యానికి దరిదాపుల కయినా ఎన్నడూ చేరుకోలేదు.

మరోవైపు ఆంధ్రప్రదేశ్ వంటి కొన్ని రాష్ట్రాలలో కౌలుదారుల్ని అజ్ఞాతంలోకి నెట్టడం జరిగింది. ఆంధ్రప్రదేశ్‌లోని ధర్మాదాయ భూముల్లో రికార్డుల్లో లేని కౌలుదారీ విధానం వేగంగా పెరిగింది. ఈ విధానానికి ఎలాంటి రక్షణ లేకపోవడమే కాక, ఇంకా పెరుగుదలకోసం అన్వేషణ సాగుతోంది.

మద్దతు ధరలకోసం, సబ్సిడీలకోసం జరిగే రైతు ఉద్యమాలుగా చెప్పుకునేవాటిలో ఏవీ కూడా కౌలుదారుకు భూమి బదలాయించాలని గాని, లేదా భూపరిమితి చట్టాలను సమర్థవంతంగా అమలు జరపాలని గాని ఎన్నడూ కోరలేదు. వారివర్గ స్వభావాన్ని వెల్లడించేందుకు తగిన ఆధారం ఇదే! చిన్న రైతాంగంలో అధికభాగం కులతత్వం వల్ల లేదా ప్రభుత్వం నుంచి లభించే ప్రయోజనాలను ఆశించి-ధనిక రైతుల సమీకరణలోనే భాగమవుతున్నారు. చిన్న రైతాంగానికి చాలా దగ్గరగా ఉండే వ్యవసాయ కార్మికుల ప్రయోజనాలకు విరుద్ధంగానే వ్యవహరిస్తున్నారు.

సాంకేతికత-సమానత్వం

1980ల కల్లా చిన్న, పేదరైతులు సంఖ్యాపరంగా భారత వ్యవసాయరంగాన్ని ప్రభావితం చేయగలరని స్పష్టమయ్యింది. కాని సాంకేతిక మార్పులవల్ల, అలాగే విధానాలు తదితర ప్రధాన మార్పులవల్ల తమ ఆధిక్యతను నిలబెట్టుకోలేని అస్థిర పరిస్థితుల్లో చిక్కుకుపోయారు. 'హరిత విప్లవం' సాంకేతికత ఆరంభమయ్యింది. దాని మొదటిదశ 1960ల నుంచి 1970ల దాకా చిన్న, పేద రైతుల్ని-వారి విస్తృతి పరిమితమవడం వల్లనే కాక, ఉత్తరోత్తరా వనరులను అందుబాటులోకి తెచ్చుకునే సామర్థ్యం లేకపోవడం వల్ల కూడా-పక్కనే పెట్టడం జరిగింది. దిగుబడిని పెంచడంలో హరితవిప్లవం సాధించినదేమిటన్న విషయంలో పెద్దగా వివాదం లేదు. ఉత్పాదకత వృద్ధిలో, భూసారం పెంపుదలలో వాతావరణ ప్రభావం విషయంలో- హరితవిప్లవం పాత్ర ఏమిటన్న ప్రశ్న చిన్నది కాదు. హరిత విప్లవం మొదటిదశ (1967-68-1980-81) లో భారతదేశంలో వ్యవసాయ దిగుబడులు సంవత్సరానికి 2.38 శాతం పెరిగాయి. రెండవదశ (1980-81-1991-92) లో దిగుబడుల వృద్ధి రేటు విస్తృతమై 3.21 శాతానికి చేరింది. ఇది ఎలా ఉన్నప్పటికి ఉపాధి అవకాశాల విషయంలో అది సాధించినది ఏమిటన్నది అస్పష్టమే. అంతర్ ప్రాంత; అంతర్ వర్గాల విషయంలో దాని పంపకం ప్రభావాలు తీవ్రపరిశీలనకు వచ్చాయి. 1970ల చివరిదాకా సాంకేతిక విస్తరణ విషయంలో అది ప్రధానంగా ధాన్యం పంటలకు, పంజాబ్, హర్యానా, పశ్చిమ ఉత్తర ప్రదేశ్‌లోని నీటిపారుదల గల ప్రాంతాలకు మాత్రమే పరిమితమయ్యింది. ఆ తర్వాత అది ఈ ప్రాంతాలలో హెచ్చు దిగుబడి వంగడాల ధాన్యానికి కూడా పెరిగింది.

కొత్త పంటల విషయంలో, 1970ల్లో హైబ్రిడ్‌పత్తి, జొన్న మొదలైన పంటల్ని ప్రవేశపెట్ట గలిగింది. 1980ల నాటికి వ్యవసాయం ఆహారేతర పంటలకు మారింది.

భూమిని పునర్‌పంపకం చేయడంలో భూసంస్కరణలు విఫలం కాగా, నూతన సాంకేతికత ధనిక రైతాంగానికే మరింత లాభదాయక అవకాశాలను తెచ్చిపెట్టింది. వనరులు బాగా అందుబాటులో ఉండే వారికే నూతన సాంకేతికత ఆచరణలో ఉపయోగపడింది.

పేదరైతాంగం ముందున్న సవాళ్ళు

పేద, చిన్న రైతులు వ్యవసాయంలో అత్యధిక ఉత్పాదకత మార్గాలు కనుగొనవలసి వచ్చిన 1980ల నాటికి అనేక సాంకేతిక, వనరుల సంబంధమైన, సంస్థాగత మార్పులు చోటు చేసుకున్నాయి. వ్యవసాయ పద్ధతులు సంప్రదాయ పంటల స్థానంలో-అధిక దిగుబడులు ఇచ్చే హైబ్రిడ్ పంటలవైపు మారాయి. అందువల్ల విత్తనాలకోసం, అధిక ధరలు చెల్లించి, మార్కెట్‌పై ఆధారపడవలసిన పరిస్థితి ఏర్పడింది. పంటల సరళికూడా అత్యధిక విలువైన పంటలవైపు మొగ్గింది. రెండవది. ప్రతికూల ప్రభావం ఇచ్చేలా-

వనరులపై వత్తిడి అధికమయ్యింది. రసాయనాలు తదితరాల అత్యధిక వినియోగం వల్ల చిన్న కమతాల భూసారం క్షీణించడం, భూమి కోతకు గురవ్వడం వంటి సమస్యలు తెలిసినవే. తగినంత సంస్థాగత సహకారం లేకుండా పంటల మార్పిడివైపు మొగ్గడం ముఖ్యంగా చిన్న రైతులకు సులభం కాదు. మరీ ముఖ్యంగా జల వనరులపై పెరిగిన వత్తిడి, జలవనరుల అధిక వినియోగం భూగర్భ జలాల క్షీణతకు దారితీసింది. మెట్ట కరువు ప్రాంతాల విషయంలో ఇది మరీ విషమ సమస్యగా మారింది. భూగర్భ జల వినియోగంపై ఆధారపడడం వల్ల రైతులు ప్రైవేట్ పెట్టుబడులపై ఆధారపడవలసి వచ్చింది. వాటిని చిన్నరైతులు సంస్థల నుంచి కాక ఇతర మార్గాలలో సమకూర్చుకోడానికి అత్యధిక వడ్డీలు చెల్లించవలసి వచ్చింది. ఇక పంటలు దెబ్బతింటే పరిస్థితులు తీవ్రప్రమాదంలో పడి అనేకమంది రైతులు ఆత్మహత్యలు చేసుకోడానికి దారితీసాయి. మూడవది, సంస్థాగత పరపతి అవకాశాలు, ఎరువులు, పురుగుల మందులు విత్తనాల సరఫరా-ఏళ్ళ తరబడి క్షీణిస్తూ వచ్చాయి.

అనేక మంది పేదరైతులు నియంత్రణ, నీతి నియమాలు లేని వ్యవస్థలపై ఆధారపడవలసి వచ్చింది.

నాలుగవది-చిన్న కమతాల ద్వారా పరిమిత జీవనోపాధి మాత్రమే సాధ్యమని బాగా గుర్తించడంతో, ఆదాయవనరుల్లో కొంత భాగంగాని, సగంగాని వ్యవసాయేతర పనుల ద్వారా రాబట్టడం మొదలయ్యింది. గ్రామీణాభివృద్ధి వ్యూహాలకు ఈ వాస్తవం ఆధారంగా ఉందనడానికి సాక్ష్యాలు తక్కువే!

ఐదవది-ప్రభుత్వ సహకార విధానాలను విచక్షణారహితంగా పరిత్యజించాలని ప్రపంచ వాణిజ్య సంస్థ కోరకపోయినా వ్యవసాయం స్వేచ్ఛ వాణిజ్యంవైపు మరలడం ద్వారా ఎదురైన సవాళ్ళు-చిన్న రైతులు ఆధారపడిన వ్యవసాయం-పోటీ ఎదుర్కొనలేక పోవడం ఒక్కటే కాక, వరి ఉత్పత్తి ఎగుమతి స్థాయిని పెంచుకోడానికి అవసరమైన దృఢమైన పరిశోధన, విస్తరణ కార్యక్రమాలు కూడా చేపట్టలేకపోతారు.

ఉదారవాదేతర సంస్కరణలు- సంస్థాగత తిరోగమనం

భారత వ్యవసాయంలో ప్రస్తుత సంక్షోభానికి విత్తనాలు కారణమవడం 1980ల మధ్యలో చూపిన నిర్లక్ష్యంలోనే కనిపిస్తుంది. ఆసమయంలో-దేశం ఆహారధాన్యాల కొరత నుంచి బయట పడిందని, ఆహారధాన్యాల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించామని, మన వ్యవసాయం ప్రపంచ మార్కెట్ స్థాయిని అందుకోగలిగే అభివృద్ధి సాధించిందని-అందువల్ల మార్కెట్ పరిమితులను తొలగిస్తే చాలునని, వ్యవసాయానికి ప్రాధాన్యతా స్థానం కల్పించడానికి, సంస్థాగత సహకారానికి కాలదోషం పట్టాయని-భావించడం జరిగింది.

ఆ ఉత్సాహంతో వ్యవసాయాన్ని ప్రాధాన్యతారంగం నుంచి తొలగించడం జరిగింది. కాని 1990ల్లో సంస్కరణలు కేంద్ర ప్రభుత్వ స్థాయిలో వ్యవసాయంతో సహా ప్రభుత్వ విధానాల ప్రతి ప్రమాణాన్ని ఏకం చేశాయి. రాష్ట్రాలలో అవి వివిధ స్థాయిల్లో అమలయ్యాయి.

సంస్కరణల అసంపూర్తి పంపకాన్ని-ప్రోత్సాహకాలకు-సరళీకృత మార్కెట్లకు అవరోధాలుగా చూడడం జరిగింది. ఆ సాంకేతిక అవరోధాలను అధిగమించడం జరుగుతుందని భావించారు. ఫలితంగా, వ్యవసాయానికి సంస్థాగత మద్దతు వేగంగా క్షీణించింది. అందుకు సాక్ష్యం వ్యవసాయ మద్దతు విధానాల తిరోగమనమే. అవే ప్రస్తుతం వ్యవసాయరంగంలో నెలకొన్న సంక్షోభానికి దారితీసి ముఖ్యంగా పేద రైతాంగాన్ని దారుణంగా దెబ్బతీశాయి.

ఉదాహరణకి ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలలో వ్యవసాయం, దాని అనుబంధ రంగాలకు బడ్జెట్ కేటాయింపుల్లో ఒక పద్ధతి ప్రకారం తగ్గుదల కనిపిస్తోంది. ఉద్దేశపూర్వక విధానాలతో విస్తరణ కార్యక్రమాలు దారుణంగా దెబ్బతిన్నాయి. ఒక విధాన పత్రంలో రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ విస్తరణ అధికారుల్ని నియమించేందుకు వనరులు లేవని స్పష్టంగా పేర్కొంది. మొత్తం వ్యవసాయ విస్తరణ అధికారులందరినీ తొలగించాలని ప్రతిపాదించింది. విస్తరణ సేవల్ని లైసెన్స్ ఉన్న ఎరువులు, పురుగుల మందులు, విత్తనాల వ్యాపారులకు మార్చడాన్ని ప్రోత్సహించింది. విస్తరణ సేవలు లోపించడం, విత్తనాల-ఎరువుల కంపెనీలు పుట్టగొడుగుల్లా పుట్టుకు రావడం, వాటి కార్యకలాపాలను నియంత్రించే యంత్రాంగం లేక పోవడం, ఆం.ప్ర. విత్తనాభివృద్ధి సంస్థ పాత్ర-పరిశోధనా రంగంలో అప్రధానమైనదిగా మారడం మొదలైనవన్నీ రాష్ట్రంలో విధానాల మార్పువల్ల సంభవించిన పరిణామాలే! కీలక మౌలిక సౌకర్యమైన నీటిపారుదల రంగం కూడా దారుణంగా దెబ్బతిని, ప్రైవేట్ భూగర్భ జల వినియోగం ఒక్కటే ప్రధాన అవకాశంగా మిగిలింది.

పట్టిక-1

దేశ వ్యాప్తంగా కమతాల పంపిణీలో మార్పులు (ఒక్కొక్క తరగతి నిష్పత్తి)

సంవత్సరం	సన్నకారు కమతం < 1 హెక్టారు		చిన్న కమతం 1-2 హెక్టార్స్		దిగువ మధ్యతరగతి 2-4 హెక్టార్స్		మధ్యతరగతి 4-10 హెక్టార్స్		పెద్ద కమతం 10 హె. ఎక్కువ		సగటు కమతం
1950-51	38.4	6.0	21.7	10.2	19.2	18.2	15.3	31.6	5.4	34.0	N.A
1960-61	40.7	6.7	22.3	12.2	18.9	20.0	13.4	30.4	4.7	30.7	2.69
1970-71	50.6	9.0	19.1	11.9	15.2	18.5	11.2	29.7	3.9	30.9	2.30
1976-77	54.6	10.7	18.0	12.8	14.3	19.9	10.1	30.4	3.0	26.2	2.00
1980-81	56.4	12.1	18.1	14.1	14.0	21.2	19.1	29.6	2.4	23.0	1.84
1985-86	57.8	13.4	18.4	15.6	13.6	22.3	8.2	28.6	2.0	20.1	1.69
1990-91	59.0	14.9	19.0	17.3	13.2	23.2	7.2	27.2	1.6	17.4	1.57
1995-96	61.6	17.2	19.0	18.8	12.3	23.8	6.1	25.3	1.2	14.8/	1.41

ఆధారం: భారత వ్యవసాయ గణాంక నివేదికలు

పట్టిక-2

ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ, అనుబంధ రంగాలపై ప్రభుత్వ వ్యయం (స్థూల రాష్ట్ర ఉత్పత్తిలో వాటా శాతం)

సంవత్సరం	ప్రణాళికా వ్యయం	ప్రణాళికేతర వ్యయం	రెవెన్యూ వ్యయం	పెట్టుబడి వ్యయం	మొత్తం వ్యయం
1990-91	0.21	0.63	0.82	0.02	0.84
1991-92	0.28	0.7	0.96	0.02	0.98
1992-93	0.47	0.63	1.07	0.03	1.1
1993-94	0.23	0.52	0.73	0.03	0.76
1994-95	0.24	0.44	0.66	0.01	0.67
1995-96	0.19	0.41	0.58	0.01	0.59
1996-97	0.27	0.37	0.62	0.01	0.64
1997-98	0.26	0.38	0.62	0.02	0.64
1998-99	0.25	0.37	0.59	0.03	0.62
1999-00	0.16	0.38	0.53	0.01	0.54
2000-01	0.23	0.39	0.6	0.01	0.61
2001-02	0.16	0.36	0.5	0.01	0.51
2002-03	0.17	0.38	0.54	0.01	0.55

ఆధారం:రిజర్వ్‌బ్యాంక్ ప్రచురించిన రాష్ట్ర ప్రభుత్వ ద్రవ్యవ్యవహారాల నివేదిక, 2004

పట్టిక-3

ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ పరిశోధన, విద్య, విస్తరణలపై ప్రభుత్వ వ్యయం

	ఖర్చు		మొత్తం వ్యవసాయం వ్యయంలో శాతం	
సంవత్సరం	పరిశోధన, విద్య	విస్తరణ	పరిశోధన, విద్య	విస్తరణ
1980-81	17.18	2.1	0.18	0.022
1990-91	33.93	3	0.22	0.02
1994-95	39.81	2.83	0.23	0.017
పెరుగుదల రేటు(1980-90)	6.59	3.06		
పెరుగుదల రేటు(1990-95)	3.86	0.01		

ఆధారం:ఎస్ సుబ్రహ్మణ్యం, పి సత్యశేఖర్

తిరోగమనంలో నీటిపారుదల రంగం

-అపర్ణ

ఆంధ్రప్రదేశ్ ప్రధానంగా వ్యవసాయ రాష్ట్రం. నూటికి దాదాపు 70 మంది ప్రజలు పల్లెసీమల్లో నివసిస్తూ వ్యవసాయమే జీవనాధారంగా గడుపుతున్నారు. నిలకడ ధరల ప్రకారం స్థూల రాష్ట్ర ఆదాయంలో వ్యవసాయం దాని అనుబంధాల వాటా 1960-61 సంవత్సరంలో 53.4 శాతం వుండగా 2003-04 సంవత్సరం ముందస్తు అంచనాల ప్రకారం 21 శాతానికి పడిపోయింది. వ్యవసాయం ప్రధానంగా నీటిపారుదల మీద ఆధారపడి వుంటుంది. వర్షాలు కురిస్తేనే నదీ నదుల ద్వారా పంటలకు నీరు లభ్యమవుతుంది. మన రాష్ట్రం గోదావరి, కృష్ణా నదులతో పునీతమైంది. మన రాష్ట్రంలో ప్రవహించే గోదావరినది పొడవు 757 కి.మీ; కృష్ణానది పొడవు 356 కి.మీ. మిగతా నదులు అన్నీ కలసి పొడవు 1997 కి.మీ. గోదావరి, కృష్ణా నదులు ప్రవహించే కోస్తా ప్రాంతంలో డెల్టాగా ఏర్పడి ఆ ప్రాంతాలను పంటల సాగుబడికి అనుకూలంగా వున్నా కొన్ని ప్రాంతాల్లో వరదలు, మరికొన్ని ప్రదేశాల్లో అనావృష్టి తాండవిస్తూ పంటల నష్టం జరుగుతున్నది. రైతుల ఆత్మహత్యలు వినవస్తున్నాయి. వ్యవసాయం విజయవంతంగా కొనసాగాలంటే ఏదో ఒక విధంగా అన్ని ప్రాంతాల్లో సేద్యపు నీటిపారుదల వసతులు అవసరం. నీటిపారుదల వసతులు వున్నట్లయితే సంవత్సరం పొడుగునా భూమిని, శ్రామికులను లాభదాయకంగా ఉపయోగించుకోవచ్చు. అంతేకాక వ్యవసాయ ఉత్పాదకతను అధికం చేసి వ్యవసాయదారుడు ఎక్కువగా ఆదాయాన్ని సంపాదించ కలడు.

ప్రస్తుతం జరుగుతున్న శాసనసభా సమావేశాల్లో ప్రాజెక్టులు, టెండర్ల మీద రసాభాసా చర్చ జరుగుతున్న సమయంలో రాష్ట్రంలో నీటిపారుదల క్రింద వున్న భూ విస్తీర్ణం తగ్గిందని రాష్ట్ర శాసనసభా వ్యవహారాల మంత్రి రోశయ్య, ప్రతిపక్షనేత చంద్రబాబుల మధ్య రసవత్తర చర్చ జరిగిందని ఎల్లరకు విదితమే. ఈ సందర్భంలో అసలు రాష్ట్రంలో "నీటిపారుదల" రంగం తీరుతెన్నులు విశ్లేషించవలసిన ఆవశ్యకత ఎంతైనా వుంది అధికార గణాంకాల ప్రకారమే.

ప్రణాళికా వ్యయం:

నీటిపారుదల రంగం మీద చేసిన అసలు ప్రణాళికా వ్యయం 1956-57 సం.లో రు. 8.70కోట్లు. ఇది రాష్ట్ర మొత్తం ప్రణాళికా వ్యయంలో 33.6 శాతం. ఈ రంగం మీద చేసిన వ్యయం హెచ్చు తగ్గులతో 1995-96 సం.లో రు. 652.50 కోట్లు పెరిగి మొత్తం రాష్ట్ర ప్రణాళికా వ్యయంలో 22.7 శాతం వాటాగా నమోదయింది. 2001-02 సంవత్సరంలో ఎన్నడు భావించని విధంగా నీటిపారుదల రంగం వాటా 14.1 శాతానికి పడిపోయింది. తరువాత రెండు సంవత్సరాలలో ఈ రంగం వాటా స్వల్పంగా దాదాపు 18 శాతానికి మాత్రమే పెరిగింది. దీన్ని బట్టి తెలుగుదేశం పార్టీ ప్రభుత్వానికి రైతాంగం మీద ఏ మాత్రం శ్రద్ధ వున్నది అవగతమవుతోంది. ఇటీవల రాష్ట్రంలో కాంగ్రెసు పార్టీ అధికార పగ్గాలు చేపట్టి శాసనసభలో ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో నీటిపారుదల రంగానికి ప్రణాళిక 2004-05లో కేటాయించిన పతి వ్యయం రు. 4221.60 కోట్లు ఇది మొత్తం రాష్ట్ర ప్రణాళికా పతి వ్యయంలో 31.8 శాతం.

కాంపౌండ్ అభివృద్ధి రేటు:

రాష్ట్రం ఆవిర్భావం నుంచి నీటిపారుదల రంగం మీద చేసిన ప్రణాళికా వ్యయంలో అభివృద్ధి రేటు గణాంకాలు విశ్లేషించినట్లయితే 1956-57 నుంచి 1981-82 వరకు కాంగ్రెసు పాలనలో 10.78 శాతం అభివృద్ధి రేటు నమోదు కాగా, 1982-83 నుండి 1988-89 వరకు తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో 12.58 శాతం, 1989-90 నుండి 1994-95 వరకూ కాంగ్రెసు హయాంలో 24.56 శాతం అభివృద్ధిరేటు ఎన్నడు లేనంతగా సాధించగా చంద్రబాబు హయాంలో 1995-96 నుండి 2003-04 సంవత్సరం వరకు 12.69 శాతమే అభివృద్ధిరేటు నమోదయింది. దీన్నిబట్టి కూడా చంద్రబాబు హయాంలో "నీటిపారుదల" రంగం తిరోగమనంలో వున్నట్లుగా గోచరిస్తోంది.

రాష్ట్రంలో వివరంగా నీటిపారుదల క్రింద వున్న భూవిస్తీర్ణం నాలుగురకాలుగా విభజించవచ్చు.

అవి కాలువల ద్వారా, చెరువుల ద్వారా, బావుల ద్వారా, ఇతరములు. కాలువల ద్వారా సాగుబడి చేసే నికర భూవిస్తీర్ణం 1956-57 సం.లో 12.74 లక్షల హెక్టార్లు వుండగా 1988-89 సం.లో 18.70 లక్షల హెక్టార్లుకు పెరిగి 2003-04 సంవత్సరం కల్లా 11.36 లక్షల హెక్టార్లుకు పడిపోయింది. దీనికి ప్రధాన కారణం నదుల ద్వారా కాలువలకు తగినంత నీటిసరఫరా లేనట్లేకదా? తెలుగుదేశం పాలనలో నీటి జగడాలు ఎక్కువై మనరాష్ట్ర రైతులు పంటలకు కాలువలద్వారా నీటి సరఫరా లేక పంటలు నష్టపోవటం జరిగింది. చెరువుల ద్వారా నికర నీటిపారుదల క్రింద భూవిస్తీర్ణం 1956-57

సం.లో 11.80 లక్షల హెక్టార్లు వుండగా 2003-04 సం.లో 4.90 లక్షల హెక్టార్లుకు పడిపోయింది. నీరు-మీరు కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వం చంద్రబాబు హయాంలో ఆర్భాటంగా మొదలు పెట్టినా అది విఫలమై పోయింది బూడిదలో పోసిన పన్నీరు తరహాగా.

కాని నీటిపారుదల తీవ్రత గణాంకాలు చూస్తే (స్థూలంగా నీటిపారుదల క్రింద వున్న భూవిస్తీర్ణం-నికరంగా నీటిపారుదల క్రింద వున్న భూ విస్తీర్ణం దామాషానే నీటిపారుదల తీవ్రత అంటారు). ఇదీ 1956-57 సంపత్సరంలో 1.18 వుండగా 1994-95 సం.లో 1.31కి పెరిగి 2002-03 సంవత్సరంలో 1.26 శాతానికి పడిపోయినా 2003-04 సంవత్సరంలో 1.32 కు పెరిగింది. దాదాపు 1994-95 నుంచి ఇప్పటికీ వరకు ఇదే స్థాయిలో వుంది.

కాగా బావుల క్రింద నికరంగా వున్న భూవిస్తీర్ణం 1956-57 సం.లో 3.21 లక్షల హెక్టార్లు వుండగా 1990-97 సం.లో 17.28 లక్షల హెక్టార్లుకు పెరిగి 1997-98లో 16.77 లక్షల హెక్టార్లుకు తగ్గినా 2000-01 సం.లో 19.54 లక్షల హెక్లార్లుకు పెరిగింది. తరువాత మూడు సంవత్సరాలలో తగ్గినా మొత్తం దీనిలో 1995-96 నుండి 2003-04 వరకు బావుల క్రింద వున్న నికర భూవిస్తీర్ణం మొత్తం రాష్ట్రంలో నీటిపారుదల క్రింద వున్న భూవిస్తీర్ణంలో సింహభాగం ఆక్రమించింది. మొత్తం మీద రాష్ట్రంలో నీటిపారుదల క్రింద వున్న భూవిస్తీర్ణం 1956-57 సం.లో 28.60 లక్షల హెక్టార్లు వుండగా 1990-91 సం.లో 43.05 లక్షల హెక్టార్లుకు పెరిగి హెచ్చు తగ్గులతో 1998-99లో 45.39 లక్షల హెక్టార్లుకు పెరిగి 2003-04 సంవత్సరంలో 36.34 లక్షల హెక్టార్లుకు పడిపోయింది.

నీటిపారుదల సమర్థత వినియోగం:

(IRRIGATION POTENTIAL CREATED & UTILISED)

రెండవ పంచవర్ష ప్రణాళికలో రాష్ట్రంలో నీటిపారుదల సమర్థత (POTENTIAL CREATED) 1.972 లక్షల హెక్టార్లు వుండగా 1.452 లక్షల హెక్టార్లు వినియోగించటం (73.6శాతం) (POTENTIAL UTILISED) జరిగింది. మూడవ ప్రణాళికా కాలంలో 336 శాతం, నాలుగవ ప్రణాళికలో 111 శాతం వినియోగం చేయటం జరిగింది. రాష్ట్ర ఆర్థిక సర్వే ప్రకారం తొమ్మిదవ ప్రణాళికా కాలంలో 2.376 లక్షల హెక్టార్లకు నీటిపారుదల సమర్థత వుండగా వినియోగం కానట్లే గోచరిస్తోంది. 2002-03 సం.లో కూడా ఇదే తరహా వున్నట్లు. అధికార గణాంకాలే తేట తెల్లంగా చాటుతున్నాయి.

పై విశ్లేషణలలో తేలేదేమిటంటే రాష్ట్రం హరితాంధ్ర ప్రదేశ్‌గా మారాలన్నా, నీటిపారుదల రంగం అభివృద్ధి కేటాయింపులు అధికం చేయటమే కాకుండా అందుబాటులో వున్న నీటి వనరులను పూర్తిగా వినియోగించేందుకు శ్రద్ధ, తగిన చర్యలు తీసుకోవాలి. ప్రాజెక్టులకు శంఖుస్థాపనలు చేయటంతో ప్రజలను మభ్యపెట్టడం గత తెలుగుదేశం ప్రభుత్వం లాగా కాక ప్రాజెక్టుల నిర్మాణం రాజకీయాలకు తావివ్వకుండా చేబట్టి, అవినీతికి తావివ్వకుండా సత్వరం పూర్తయ్యేటట్లు చర్యలు చేపట్టాలి. అప్పుడే రాష్ట్రం నవ్యాంధ్రప్రదేశ్‌గా రూపుదిద్దుకొంటుంది, ఆంధ్రప్రదేశ్ దేశానికి "అన్నపూర్ణగా" మారుతుంది.

పట్టిక-1

నీటిపారుదల రంగం మీద చేసిన ప్రణాళికా వ్యయం

(రు.కోట్లు)

సం. (1)	నీటిపారుదల రంగం వ్యయం (2)	మొత్తం ప్రణాళికా వ్యయం (3)	మొత్తంప్రణాళికా వ్యయంలో నీటిపారుదలరంగం వాటా (శాతం) (4)
1956-57	8.70	25.91	33.6
1960-61	17.75	51.37	34.6
1970-71	28.22	91.70	30.8
1980-81	153.02	471.52	32.5
1982-83	152.56	555.98	27.4
1988-89	329.31	1398.53	24.2
1990-91	314.55	1465.53	21.5
1995-96	652.50	2869.38	22.7
1996-97	689.51	3052.26	22.6
1997-98	796.24	3604.20	22.1
1998-99	931.49	4971.97	18.7
1999-00	1075.23	4528.53	23.7
2000-01	1305.13	6717.12	19.4
2001-02	1125.68	7968.95	14.1
2002-03	1487.00	8314.87	17.9
2003-04	1701.10	9688.54	17.6
2004-05 (కుడివ్యయం)	4221.60	13291.20	31.8

ఆధారం: ఆంధ్రప్రదేశ్ వార్షిక ప్రణాళిక 2004-05

పట్టిక-2

నీటిపారుదలరంగం మీద చేసిన ప్రణాళికా వ్యయంలో కాంపౌండ్ అభివృద్ధిరేటు

(శాతం)

కాలవ్యవధి	కాంపౌండ్ అభివృద్ధిరేటు
1956-57 నుండి 1981-82	10.78
1982-83 నుండి 1988-89	12.58
1989-90 నుండి 1994-95	24.56
1995-96 నుండి 2003-04	12.69

ఆధారం: గణన (COMPUTED)

పట్టిక-3

రాష్ట్రంలో నికరంగా నీటిపారుదల క్రింద వున్న భూవిస్తీర్ణం

(లక్షల హెక్టార్లు)

సం.	కాలువలు	చెరువులు	బావులు	ఇతరములు	మొత్తం
1956-57	12.74	11.80	3.21	0.85	28.60
1960-61	13.31	11.51	3.28	0.99	29.09
1970-71	15.79	11.12	5.10	1.13	33.14
1980-81	16.93	9.00	7.76	0.94	34.63
1982-83	17.43	8.52	8.39	0.93	35.27
1988-89	18.70	11.04	11.33	1.50	42.57
1990-91	18.68	9.68	13.03	1.66	43.05
1994-95	16.06	6.92	14.79	1.82	39.59
1995-96	15.39	7.47	16.57	1.81	41.24
1996-97	16.29	8.44	17.28	1.94	43.95
1997-98	15.37	5.62	16.77	1.68	39.44
1998-99	16.34	8.10	18.97	1.98	45.39
1999-00	16.34	6.52	19.00	1.98	43.84
2000-01	16.49	7.27	19.54	1.98	45.28
2001-02	15.63	5.67	19.28	1.80	42.38
2002-03	12.09	4.25	18.43	1.37	36.14
2003-04	11.36	4.90	18.70	1.38	36.34

ఆధారం: అర్థగణాంకశాఖ, హైదరాబాదు

పట్టిక-4

ఆంధ్రప్రదేశ్‌లో నీటిపారుదల తీవ్రత (INTENSITY)

(లక్షల హెక్టార్లు)

సం.	స్థూలనీటిపారుదల క్రిందవున్న భూమి విస్తీర్ణం	నికరనీటిపారుదల కింద వున్న భూమి విస్తీర్ణం	నీటిపారుదల తీవ్రత(శాతం)
1956-57	33.88	28.60	1.18
1960-61	34.72	29.09	1.19
1970-72	42.22	33.14	1.27
1980-81	43.42	34.63	1.25
1982-83	45.18	35.27	1.28
1988-89	54.40	42.57	1.28
1990-91	53.70	43.05	1.25
1994-95	51.85	39.59	1.31
1995-96	53.04	41.24	1.29
1996-97	57.82	43.95	1.32
1997-98	51.58	39.44	1.31
1998-99	60.92	45.39	1.34
1999-00	57.46	43.84	1.31
2000-01	59.16	45.28	1.31
2001-02	55.49	42.38	1.31
2002-03	45.36	36.14	1.26
2003-04	47.81	36.34	1.32

ఆధారం: అర్థిక గణాంకశాఖ హైదరాబాదు

పట్టిక-5

ఆంధ్రప్రదేశ్‌లో నీటిపారుదల సమర్థత, వినియోగం

(లక్షల హెక్టార్లు)

ప్రణాళిక	సమర్థత	వినియోగం
1956-61	1.972	1.452
1961-66	4.178	1.408
1966-69	1.152	3.872
1969-74	2.530	2.800
1974-78	2.933	2.667
1978-80	2.100	2.050
1980-85	3.866	2.526
1985-90	1.560	1.421
1990-91	0.147	0.123
1991-92	0.167	0.186
1992-97	0.706	0.612
1997-2002	2.376	-
2002-03	1.014	-

ఆధారం: ఆంధ్రప్రదేశ్ అర్థిక సర్వే 2003-04

గోదావరి జలాల సద్వినియోగం

-టి.హనుమంతరావు

ఐక్యరాజ్యసమితి (ఒ.పి.ఎస్.) కన్సల్టెంటు:
మాజీ ఇంజనీర్-ఇన్-చీఫ్ (నీటిపారుదల)

1. గోదావరి నదిలో ఆంధ్రప్రదేశ్ ఇంకా ఉపయోగించుకొనవలసిన వాటా 793 శత కోటి ఘనపుటడుగుల (టి.యం.సి) లేదా యూనిట్లు) దాకా వున్నది. ఇందుకు గాను 113 యూనిట్ల వినియోగానికి పథకాలు నిర్మాణంలో ఉన్నాయి. మిగతా 680 యూనిట్ల వినియోగానికి పథకాలు ఇంకా అమలులో లేవు. రాష్ట్రానికిచ్చిన 1480 యూనిట్ల వాటాలో ఇప్పటిదాకా వాడుకున్నది 687 యూనిట్లు మాత్రమే. ఎగువ రాష్ట్రాలు, వాళ్ళకిచ్చిన వాటాలు పూర్తిగా వినియోగించే వీలులేనందువలన, ఆ నీరు కూడా, క్రింది రాష్ట్రమయిన ఆంధ్రప్రదేశ్‌కి లభ్యమవుతుంది. సగటు వర్షపాతము, మంచి వర్షపాతమున్న సంవత్సరాలలో 793 యూనిట్ల కంటే చాలా ఎక్కువగా మన రాష్ట్రములో నుండి సముద్రములోకి పారుతూంటుంది. కాబట్టి మనకు లభ్యమయ్యే నీరు 1000 యూనిట్ల దాకా ఉంటుందని అంచనా వేయవచ్చును. అయితే ప్రాజెక్టులను రూపకల్పన చేసేటప్పుడు 793 యూనిట్ల నికర జలాలకే చేసి, మరొక 300 టి.యం.సి. లను అదనపు స్టోరేజి (Carry over storage) గా పెట్టుకోవచ్చును. ఈ అదనపు స్టోరేజి, వరద ముప్పుల నుండి కాపాడడమే గాకుండా, మరునటి సంవత్సరము దుర్భిక్షమయినప్పుడు, అటువంటి సంవత్సరాల అవసరాలను కూడా తీరుస్తుంది. ఇదే పద్ధతిలో నైలునది (ఆఫ్రికా) మీద 'హై అస్వాన్' డాము కట్టినారు. ఆ నదిలో వుండే నీటివనరులు 2100 టి.యం.సి అయితే, రిజర్వాయరు స్టోరేజీ 6000 టి.యం.సి ల దాకా పెట్టుకున్నారు. కాని ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వము ఈ విధమైన ఆలోచనలలో లేదు. ఇంకా 1000 యూనిట్ల దాకా వాడుకుని అవకాశమున్నప్పుడు కేవలం 680 యూనిట్లకే పథకాలు రూపొందిస్తున్నారు.

2. గోదావరీ జలాలను ఆంధ్రప్రదేశ్ పూర్తిగా వినియోగించుకోవాలంటే 4 బ్యారేజీలను మూడు రిజర్వాయర్లను కట్టాలని నేను ఇంతకు ముందే సూచించాను. బ్యారేజీల వలన నీటి నిలువ అంతా నదీ ఫ్లడ్‌జోన్ (వరద ప్రాంతం) లోనే వుంటుంది. అనగా ప్రక్కన ఉండే గ్రామాలు కాని, పొలాలు కాని మునిగిపోవు. ఈ నాలుగు బ్యారేజీలలో నీటి నిలువ సామర్థ్యము రమారమి 80 టి.యం.సి. లు పెట్టుకుని, 150 టి.యం.సి ల దాకా ఖరీఫ్, రబీ కాలములలో సేద్యపునీరు అందించవచ్చును. ఈ బ్యారేజీల వివరాలు

ఎ. పెద్ద బెల్లాలదగ్గర, కడెంనది సంగమం దిగువన: అదిలాబాదు, నిజామాబాద్ జిల్లాలలోని వర్షపాతమున్న ప్రాంతాల నుండి ఈ బ్యారేజీకి నీరు చేరుతుంది. ఇందులో ముఖ్యమైనది కడెంనది. దీనిమీద కట్టిన డ్యాంమీద, నీరు ప్రతి సంవత్సరము బారీగా పొర్లుతుంటుంది. బాగా నీరు ఉండే రెండు 'పెద్ద వాగు'లు కూడా ఇక్కడ కలుస్తున్నవి.

బి.ఎల్లంపల్లి: ఇక్కడ ఇంతకుముందే ఇన్వెస్టిగేషన్ చేసి 45 టి.యం.సి ల నీరు నిలువ పెట్టాలనుకున్నారు. దీనిని 25 టి.యం.సి. లకు తగ్గించినట్లయితే ముంపు నదీ ప్రవాహ ప్రాంతానికి మాత్రమే పరిమితమై ఉంటుంది. మునుపటి ప్రణాళికలో కొన్ని గ్రామాలు సేద్యపునీటి భూములు ముంపుకు గురి అవుతున్నాయి. నీరంతా ఇక్కడే నిలువ చేసుకోకుండా కొంతమేరకు పెద్ద బెల్లాలదగ్గర కూడా నిలువ పెట్టుకుంటే, ఇక్కడ నీటి సామర్థ్యం తగ్గించుకోవడమే గాకుండా, నిర్వాసితులు పర్యావరణ సమస్యలు లేకుండా చేయవచ్చును. ఇటువంటి మార్పులతో డీటైల్డ్ ఇన్వెస్టిగేషన్ చేయాలి.

సి) 'ఎదిర' దగ్గర: ఇక్కడ కూడా 20 టి.యం.సి ల నీరు నిలువ చేయవచ్చును. దీనికి ఇంతవరకూ ఇన్వెస్టిగేషన్ చేయలేదు. కాబట్టి ఇది వెంటనే చేపట్టాలి.

డి) దుమ్ముగూడెం: దీనిలో కూడా 20 టి.యం.సి లు నిలువ చేయవచ్చును. దీనికి ఇప్పటికే కొంత ఇన్వెస్టిగేషన్ జరిగింది. గాని ఇది పూర్తిగా చేయాలి. పై చెప్పిన నాలుగు బ్యారేజీలకు పర్యావరణ, గ్రామాల ముంపు, ఇతర రాష్ట్రాలలో ముంపు నిర్వాసితుల సమస్యలేవీ ఉండవు. వీటిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వము ఏ ఇతర రాష్ట్రాల ప్రమేయం లేకుండా ఒకదాని తర్వాత ఒకటి నిర్మించవచ్చును. నిర్మాణ వ్యయము రమారమి రూ.8 వేలకోట్లు వుండవచ్చును. 6 లక్షల ఎకరాలకు ఖరీఫ్ వరి, మరియు నాలుగు లక్షల ఎకరాల రబీ ఆరుతడి పంటలకు నీరందించే వీలు కలిగించవచ్చును. ఈ బ్యారేజీలు ఇంకా రిజర్వాయర్ల ద్వారా జల రవాణా మార్గము సుగమము అవుతుంది. వీటి వలన నదిలో 3 మీటర్ల కంటే ఎక్కువ లోతు నీరు ఉంటుంది. కాబట్టి, 3 వేల టన్నుల కెపాసిటీ గల సముద్రపు పడవలు నదిలో పోయే వీలు కలుగుతుంది. దీనికిగాను ప్రతి బ్యారేజీ దగ్గర లాకులు నిర్మించాలి.

3. ఎత్తి పోతల పథకాలు: గోదావరి మీద రిజర్వాయర్లు కట్టినా నీటిమట్టం 130మీ. లోపే ఉంటుంది. నీటిని ఉపయోగించుకొనే భూములు విస్తారంగా 200 నుండి 400 మీ. ఎత్తులో ఉన్నాయి. ఈ ప్రదేశాలకి నీటిపారుదల కలుగజేయాలంటే ఎత్తిపోతల పథకాలు తప్ప వేరే మార్గాలు లేవు. ఈ ప్రాంతాలలో వాటర్‌షెడ్‌ల వలన కొంత మేలు సాధించవచ్చు. కాని పూర్తి మేలు సాధించాలంటే నీటిపారుదల సౌకర్యాలు కలిగించాలి. గోదావరి కాలువల ద్వారా నీరు మళ్ళించాలంటే ఈ సౌకర్యం చాలా తక్కువ ప్రాంతాలకు మాత్రమే వినియోగించుకొనే వీలుంది. గోదావరి పూర్తి జలాలు వినియోగించు కోవాలంటే ఎత్తిపోతల పథకాల ద్వారానే సాధించాలి.

పంపు చేయవలసిన సగటు ఎత్తు 150మీ. ఉంటుంది. 840 యూనిట్ల నీటి వినియోగానికి (అనగా 600 యూనిట్లు ఖరీఫ్ వరికి మరియు 240 యూనిట్లు రబీ ఆరుతడి పంటలకు) రూపకల్పం చేసుకొంటే 48 లక్షల ఎకరాలకు ఖరీఫ్ వరి, 2 లక్షల ఎకరాలకు రబీ ఆరుతడి పంటలు పెట్టుకోవచ్చును. దీనికి 2920 మె.వాట్ల విద్యుచ్ఛక్తి కావాలి. విద్యుత్ గ్రిడ్ నుంచి తీసుకొనే ఎకనామిక్ రేటు 1 యూనిట్‌గా రూ.3 అనుకొంటే, విద్యుత్ ఛార్జీలు బోలెడంత అవుతాయి. ఉదాహరణకు (ఖరీఫ్ వరికి ఎకరాకు కరెంటు ఛార్జీలు రూ.10700 అవుతాయి. (సేద్యపు నీరు 900 మి.మీ+ ఉయపోగపడే వర్షపాతము 500 మి.మీ. అనుకుంటే) థర్మల్‌పవర్ స్టేషన్‌ను నీటిపారుదల ప్రాజెక్టు ఖర్చుతో కట్టినట్లయితే యూనిట్ ఖరీదు రూ.1.50 పైసలుగా పరిగణించవచ్చును. (బొగ్గు, ముడిసరుకులు, యంత్రాలు, సిబ్బంది ఖర్చులు లెక్కఉ తీసుకోవాలి కాబట్టి) ఈ విధంగా చేస్తే ఒక ఎకరానికి విద్యుత్ ఖర్చులు మాత్రమే ఈ విధంగా ఉంటాయి: ఖరీఫ్ ఆరుతడి పంటలు (10 తడులు 500 మి.మీ. మొత్తం) రూ.2970 ఈ కరెంటు ఖర్చులు, పంట పంటకి రైతులు భరించలేరు. ఇప్పుడుండే ఇరిగేషన్ డవలెప్‌మెంట్ స్కీములలో పంపింగ్ ఎత్తు 30మీ. లోపే ఉంటుంది. కాని వీటి కరెంటు ఖర్చులు రైతులు ఏమాత్రము భరించలేరన్నది నిర్వివాదాంశం. కాబట్టి ఈ సమస్యకు వేరే ప్రత్యామ్నాయాలు కనుక్కోవాలి. అదేమిటంటే ఈ ప్రాజెక్టుకు కావలసిన విద్యుత్‌నంతా జలవిద్యుత్ ద్వారా సమకూర్చి ఉచిత విద్యుత్ సరఫరా చేయటమే గోదావరి ప్రాజెక్టుల ద్వారా 3400 మె.వాట్ల జలవిద్యుత్ ఉత్పత్తి చేయాలి. జలవిద్యుత్ నిర్మాణ వ్యయం ప్రాజెక్టులో ఒకభాగముగా పరిగణించినట్లయితే వీటి నిర్వహణ ఖర్చులు స్వల్పముగా ఉండే ఉచిత విద్యుత్‌ను సరఫరా చేసే వీలు కలుగుతుంది. ఈ కరెంటు నిర్వహణ ఖర్చులు కూడా నీటిపారుదల సాంవత్సరిక ఖర్చులతో కలపాలి. కరెంటు, డిస్ట్రిబ్యూషన్ (రవాణా) ఛార్జీలను మాత్రమే రైతులు భరిస్తే సరిపోతుంది. 3400 మె.వాట్ల జలవిద్యుత్ ఉత్పత్తి చేసేదానికిగాను 3 రిజర్వాయర్లు 4 బ్యారేజీలు కావాలి. బ్యారేజీల వివరాలు పైన చెప్పిన విధంగా ఉండి, 1000 మె.వాట్లు ఉత్పత్తి బ్యారేజీలలో చేయాలి. దేవాదుల వద్ద ఒక భారీ ఎత్తుపోతల పథకాన్ని రాష్ట్రప్రభుత్వము ఇప్పుడు ప్రారంభించినది. ఇది మంచిదే కాని ఉచిత విద్యుత్ లేకుండా ఈ ప్రాజెక్టు నడిపించేది అసాధ్యమని గ్రహించాలి. ఎత్తిపోతల పథకంతో పాటు దుమ్మగూడెం వద్ద జలవిద్యుత్ ప్రాజెక్టు నిర్మించాలి. ఇప్పుడు రిజర్వాయర్ల సంగతి పరిశీలిద్దాం.

4. రిజర్వాయర్లు: ఇవి లేకుండా కేవలం ఎత్తిపోతల ద్వారానే గోదావరి జలాలను పూర్తిగా వినియోగించుకోలేము. సాధారణంగా వరద సమయాలలో కొన్ని రోజులు 10-15 లక్షల క్యూసెక్కుల నీరు గోదావరిలో ప్రవహిస్తూ ఉంటుంది. ఎట్టి పరిస్థితులలోను వరదనీటిని మొత్తాన్ని పంపు చేయలేము. 40వేల క్యూసెక్కుల పంప్ చేసినా రమారమీ 97 శాతం నీరు వృధాగా క్రిందికి పోతుంది. కాబట్టి గోదావరి జలాలను పూర్తిగా ఉపయోగించుకోవాలంటే రిజర్వాయర్లు అవసరమని ఎటువంటి సందేహమూ లేకుండా చెప్పవచ్చు. ఈ రిజర్వాయర్లు ఎన్ని ఉండాలి, ఎక్కడ ఉండాలి అనే విషయాన్ని చర్చిద్దాం. ఎక్కువ నీరు ప్రాణహిత, ఇంద్రావతి, సెబరి ఉపనదుల ద్వారా లభ్యమవుతూ ఉంది. ఎగువ భాగంలో ప్రాణహిత, ఇంద్రావతి, సంగమాల మధ్యప్రాంతంలో అనగా సూరారం దగ్గర ఒక రిజర్వాయరు, ఇంద్రావతి సంగమం దిగువన, ఇచ్చంపల్లికి దిగువన, కాతాలపల్లి-ఏటూరి నాగారం దగ్గర రెండవ రిజర్వాయరు పోలవరం వద్ద మూడవ రిజర్వాయరు ఉండాలి. రిజర్వాయర్లకు పూర్తి ఇన్వస్టిగేషన్ జరగాలి. మొదటి రెండు రిజర్వాయర్లకు ఇంత వరకూ ఇన్వస్టిగేషన్ జరగలేదు. ఉజ్జాయింపు వివరాలు ఈ విధంగా ఉంటాయి. సూరారం రిజర్వాయర్ మట్టం 137మీ. దాకా పెట్టవచ్చు. మంచిర్యాల రైల్వే బ్రిడ్జి దగ్గర వరద నీటి మట్టం 138మీ. ఉంది. కాబట్టి బ్యాక్ వాటర్ ప్రభావం వస్తే కూడా, దీనికి లోపే ఉంటుంది.

కాంతాలపల్లె దిగువ రెండవ రిజర్వాయర్ నిర్మించాలి. దీని నీటిమట్టము 105 మీ. పెట్టుకోవచ్చు. ఈ రెండు రిజర్వాయర్ల వలన ఎగువ రాష్ట్రాలలో (మహారాష్ట్ర, చత్తీస్‌గడ్) 50 హెక్టార్లు ముంపుకు గురి అవుతాయి. ఇచ్చంపల్లి ప్రాజెక్టు (112.77మీ. ఎత్తు) వలన ఎగువ రాష్ట్రాలలో ముంపుకు ఉన్న (58 వేల హెక్టార్లు) ఇది తక్కువ. కాని ఆంధ్రప్రదేశ్‌లో ముంపు 1.3 లక్షల హెక్టార్లు ఉంటుంది. పూర్తి ప్రయోజనాలు మన రాష్ట్రము పొందుతున్నప్పుడు మన రాష్ట్రములోనే ఎక్కువ ముంపు ఉన్నట్లయితే అది ఇతర రాష్ట్రాలకు ఆమోద యోగ్యముగా ఉంటుంది. ఇచ్చంపల్లి ప్రాజెక్టులో (112.77మీ. ఎత్తు)

మన రాష్ట్రములో ముంపు 38,000 హెక్టార్లు అయితే పొరుగు రాష్ట్రాలలోని ముంపు 58,000 హెక్టార్లు. ఇచ్చంపల్లి డ్యాం సగము భాగము ఛత్తీస్‌గడ్‌లో ఉంటుంది. పైగా దీని విద్యుత్‌లో మన రాష్ట్రము వాటా 27 శాతం, (మొత్తం ఉత్పత్తి 975 మెగావాట్లు) మాత్రమే ఉన్నది. నీటిపారుదల కూడా మన రాష్ట్రానికి 80 యూనిట్లకే పరిమితమై వున్నది. కాబట్టి ఈ ప్రాజెక్టు రాష్ట్ర పూర్తి ప్రయోజనాలకి, అనగా 400 యూనిట్ల వినియోగానికి పనికిరాదు. పూర్తి విద్యుత్ పూర్తి నీరు మన రాష్ట్రానికే లభ్యమయ్యేలాగా రూపకల్పనలు చేయాలి. కాంతాలపల్లె దిగువన డ్యాం కట్టినట్లయితే ఏ ఇబ్బందులు లేకుండా పూర్తి జల వినియోగము, విద్యుత్ మన రాష్ట్రానికే లభ్యమయ్యేలాగు రూపకల్పనలు చేయవచ్చును. కాంతాలపల్లి దిగువన ఉండే డ్యాం రెండువైపులా ఉండేది మన రాష్ట్రమే. ఇక్కడ డ్యాం కట్టినట్లయితే ఏ ఇబ్బందులు లేకుండా, పూర్తి జలవినియోగము, విద్యుత్ మన రాష్ట్రానికే ఉంటుంది. అయితే నదిలో రాతిచట్టు ఇక్కడ లేనందువలన డ్యాం కట్టేదానికి వీలు కాదని కొందరు అనుకుంటారు. ఇది ఒక అపోహ మాత్రమే. నదీ ప్రాంతంలో ఎర్త్‌న్ డ్యాము (మట్టి కట్టు) పోలవరం మాదిరి రూపకల్పన చేసి సర్‌ప్లస్‌ను (అలుగు) రాయి వుండే నదిప్రక్కల కట్టవచ్చును. (ఉదాహరణ నైలునది మీద హై హాస్వాన్ డ్యాము: సోమశిల డ్యాము) ఇచ్చంపల్లి ప్రాజెక్టు మీద సరైన అవగాహన లేక చాలా మంది రాష్ట్ర ప్రభుత్వముతో సహా ఈ ప్రాజెక్టే కావాలని పదేపదే చెబుతున్నారు. దీనికంటే ఎక్కువ మేలు చేసే ప్రాజెక్టు కావాలనుకుంటే కాంతాలపల్లి దగ్గర కట్టాలి. ఇచ్చంపల్లి ప్రాజెక్టు వలన రాష్ట్రానికి ఖర్చు ఎక్కువ. ఫలితం తక్కువ. అని ఇప్పటికైనా గ్రహించాలి. మనకి కావలసిన జలవిద్యుత్‌ను సమకూర్చుకోవాలంటే, ఎగువ ప్రాంతములో ఒక రిజర్వాయరుకు బదులు రెండు కట్టాలి. (ఉదాహరణ శ్రీశైలం, నాగార్జునసాగర్) దిగువ భూములలో పోలవరం వద్ద ఒక రిజర్వాయరు నిర్మించి 301 యూనిట్లు వినియోగించుకొని (70 యూనిట్లు లైవు స్టోరేజీ) 7.2 లక్షల ఎకరాలకి సేద్యపునీటి వసతి కల్పించాలి. 45.7మీ. ఎత్తులో ఉండే నీటిమట్టం ద్వారా 750 మెగావాట్ల విద్యుత్‌ను సమకూర్చు కోవచ్చును. ఈ మూడు రిజర్వాయర్లు నాలుగు బ్యారేజీలలో ఉపయోగకర స్టోరేజీ (లైవ్ స్టోరేజి) 670 యూనిట్లు ఉంటుంది. 3400 మెగావాట్ల దాకా విద్యుదుత్పత్తి సాధించవచ్చును. పోలవరం ప్రాజెక్టు మీద ఇటీవల కొన్ని వార్తలు వస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వము నీటి నిలువ సామర్థ్యము తగ్గించి ముంపుకు గురి అయ్యే ఇతర రాష్ట్రాల ప్రాంతాలను రక్షించవలెననే ఆలోచనలో ఉన్నదనే వార్తలు పేపర్‌లో వచ్చినాయి. ఇది చివరి రిజర్వాయరు కాబట్టి ఇది ఎంత మాత్రము సరిఅయిన ఆలోచన కాదు.

5. పార్యావరణ సమస్యలు: మునిగిపోయే అటవీ ప్రాంతానికి గానూ 'బదులు' అడవిని ప్రభుత్వ వేనష్ట లాండులలో పెంపొందించాలి. నిర్వాసితులు సమస్యలను చైనాలో 3 గార్జి ప్రాజెక్టులో మాదిరి పరిష్కరించాలి. ఇప్పుడిచ్చే పారితోషకాలే కాకుండా అదనంగా వారి ఆర్థిక పురోగతికి దోహదం కలగచేయాలి. దీనికి కావలసిన శిక్షణ విద్య, ఆరోగ్య సౌకర్యాలు కలిగించి ఉపాధి మార్గాలను కూడా కలుగచేయాలి. ఆర్థిక పురోగతి ప్రతివ్యక్తీ ఏమాత్రం సాధిస్తున్నాడో, ప్రతీ సంవత్సరమూ పరిశీలించి, లోపాలు ఉన్నట్లయితే వాటిని ఎప్పటికప్పుడు సవరించి, తలపెట్టిన ప్రగతి సాధించేలా చేయాలి. కేంద్రం రాష్ట్ర అభివృద్ధి పథకాలన్నీ ఈ నిర్వాసితులకు అన్వయించేలా చేయాలి. ఒక్కమాటలో చెప్పాలంటే ఆయకట్టు దారులు ప్రాజెక్టు ద్వారా ఏవిధమైన లబ్ది పొందుతారో అంతకట్టే ఎక్కువగా నిర్వాసితులు లబ్ది పొందాలి. వరల్డ్ వాటర్ ఫోరము ఈ విధమైన సూచనను 2003 సంవత్సరములో క్యోటో (జపాన్) సమావేశములో చేయడం గమనార్హము.

6. నీటిరవాణా ఉపాధి: పూర్తి గోదావరీ నదిని నౌకల రవాణాకి వినియోగించుకొంటే చాలా ప్రయోజనకారిగా ఉంటుంది. 3 రిజర్వాయర్లు, 4 బ్యారేజీల ద్వారా ఇది సాధ్యమవుతుంది. 3 వేల టన్నుల ద్వారా ఫ్లాట్ బాటమ్ నౌకలు సముద్రం నుండి శ్రీరాం సాగర్ దాకా పోయే వీలు కలుగచేయాలి. ప్రతీ నదీ కట్టడం దగ్గర లాకులు, చేపనిచ్చెనలు ఏర్పాటుచేయాలి. గోదావరీ ప్రాంతంలో లభ్యమయ్యే బొగ్గు, ఇతర ఖనిజాలు చౌకగా బంగాళాఖాతపు ప్రాంతానికి రవాణా అవుతాయి. రోడ్లు, రైలు మీద భారం తగ్గుతుంది. పర్యావరణ కాలుష్యం వుండదు. నీటి రవాణా సౌకర్యం వలన ఎక్కడిక్కడే పరిశ్రమలు స్థాపించే వీలుంది. తయారయిన వస్తువులు రవాణా తక్కువ ఖర్చుతో కూడినది కాబట్టి ఎక్కువ పరిశ్రమలు వచ్చే అనుకూలాలు ఉన్నాయి. జలనౌకారంగంలో సంవత్సరం పొడవునా ఉపాధి ఉంటుంది. భూమిలేని పేద గ్రామీణులకు ఇది ఒక వరమవుతుంది. బీద వ్యవసాయదారులకు కూడా సంవత్సరం పొడవునా ఉపాధి ఉంటుంది. బీద వ్యవసాయదారులకు కూడా సంవత్సరం పొడవునా పని ఉండదు. కాబట్టి వారికి కూడా ఈ రంగంలో ఎంతో మేలు కలుగుతుంది. నది మొత్తం జలరవాణా సౌకర్యం కలిగి వుంటే ఈ ప్రాంతమంతా ఎంతో అభివృద్ధికి నోచుకుంటుంది. ఉత్తరోత్తర ఈ రవాణా సౌకర్యం ప్రాణహిత మీదుగా వార్దా దాకా కలుగజేసుకోవచ్చు. ఇవన్నీ ఒకప్పుడు సర్‌ఆర్థర్ కాటన్ మహాశయుడు కన్న కలలు. అవి నిజం చేయాలంటే 3 రిజర్వాయర్లు 4 బ్యారేజీలు అవసరమవుతాయి. ఈ విధంగా నీటి రవాణా

సౌకర్యాలు ఇప్పటికే యూరప్‌లోని 8 దేశాల ప్రభుత్వాలు రైను, డాన్యూబ్ నదుల మీదుగా, నల్ల సముద్రం-ఉత్తర సముద్రాలను కలుపుతూ సాధించినారు. చైనాలో యాంగ్ట్సీ నదిలో 2300కి.మీ దూరం అంతా నీటి రవాణాకి వీలు కలుగ చేసేదానికి 3 గార్జీల డ్యామును నిర్మిస్తున్నారు. దీనితో పోలిస్తే మన గోదావరీ నది రవాణా మార్గం 3వ వంతు పడవ మాత్రమే. ఇది పెద్ద ఎత్తులో ప్రపంచంలో పెద్ద పెద్ద నీటి రవాణా కార్యక్రమాలు జరుగుతూంటే, మనదేశంలో ఇప్పటికీ ఏ ప్రాధాన్యతా లేకుండా ఉంది. మార్చి నెల 2003న క్యూటో (జపాన్)లో జరిగిన ప్రపంచ నీటి సమాఖ్య (వరల్డ్ వాటర్ ఫోరమ్) లో ఇకమీదట తలపెట్టే అన్ని నీటి వనరుల ప్రాజెక్టులలో జల రవాణా సౌకర్యము విధిగా చేపట్టాలి అని తీర్మానించినారు. దీని వలన పర్యావరణ సమతుల్యము కాపాడడమే కాకుండా ఆర్థికాభివృద్ధి తక్కువ ఖర్చుతో సాధించేదానికి వీలవుతుందని నొక్కి వక్కాణించారు. నీటివనరుల ప్రాజెక్టుల వలన ఒక్క వ్యవసాయరంగమే కాక, విద్యుత్, జలరవాణా, పరిశ్రమలు, ఉపాధిసౌకర్యాలు పెరిగి ఆ ప్రదేశమంతా అన్ని వర్గాల ప్రజలకు అభివృద్ధి సాధించేలా ఉండాలి. ఇటువంటి ప్రగతికి గోదావరి జలాలు ఎంతైనా ఉపయోగపడతాయి. ఇక్కడ ఒక ముఖ్య విషయం గమనించాలి. నూరుశాతం భూములకు నీటిపారుదల సౌకర్యం కలిగించిన పేదరికం నిర్మూలము కాదు. ఎందుకంటే ఈ ప్రాంతములో 55 శాతం ప్రజలకు భూముల్లేవు. వ్యవసాయ కూలీలకు సన్నకారు (మార్జినల్) రైతులకు, సంవత్సరములో 90 రోజులు మాత్రమే (నీటిపారుదల సౌకర్యం ఉన్న) పని ఉంటుంది. మిగతా 275 రోజులలో ఉపాధి ఉండదు. ఈ గ్రామీణ ప్రజల ఆర్థిక స్థితి బాగుండాలంటే సంవత్సరం పొడవునా పని ఉండాలి. జలరవాణా, పరిశ్రమలలో ఇటువంటి ఉపాధి కల్పించే వీలు ఉంది.

7 నిధులు: 3 రిజర్వాయర్లు 4 బ్యారేజీల పథకాలను పూర్తిగా ఇన్వస్టిగేషన్ చేస్తే కాని నిధులు ఎంత కావాలెనో చెప్పలేము. రమారమీ అంచనాలు ఈ విధంగా ఉండవచ్చును. 4 బ్యారేజీలు వాటి కాలువలు, చిన్న పంపులకు 8వేల కోట్లు 3 రిజర్వాయర్లు పెద్ద నీటి పంపులు, కాలువలకు 37వేల కోట్లు, జల, జలవిద్యుత్ కేంద్రాలకు 15 వేలకోట్లు వెరసి రూ.60 వేలకోట్లు దాకా వుంటుంది. దీనిలో కొంతభాగం నీటిరవాణా రంగానికి కేటాయించవచ్చును. రాష్ట్ర ప్రభుత్వము బ్యారేజీలకు కావలసిన రూ.8 వేలకోట్లు భరించిన, మిగతా వాటికి కేంద్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత తీసుకోవాలి. చైనాలోని 3 గార్జీల ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వం పూర్తిగా భరిస్తున్నది. (సుమారు లక్ష కోట్లు) మనదేశంలో ఇంతకు ముందు భాక్రానంగల్ ప్రాజెక్టులను ఈ విధంగా కేంద్రమే భరించింది. రిజార్వాయర్ నుండి కొంతనీటిని (సుమారు 100 యూనిట్లను) కాలువల ద్వారా తమిళనాడు కర్నాటక రాష్ట్రాల ఉపయోగానికి మళ్ళించవచ్చును. ఆ రాష్ట్రాలు, వారికి కావలసిన ప్రదేశాలకు ఎత్తిపోతల ద్వారా వారి ఖర్చుతో నీటిని వినియోగించుకోవచ్చును. ఈ విధంగా 3 రాష్ట్రాల ప్రయోజనాలకు పథకాలను రూపకల్పన చేస్తే కేంద్ర నిధుల ద్వారా జాతీయ ప్రాజెక్టుగా గుర్తింపు పొందడము సులభమవుతుంది. జలవిద్యుత్‌లో కూడా ఎగువ రాష్ట్రాలకు కొంత వాటా ఇచ్చినట్లయితే ప్రాజెక్టు సుగమమవుతుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వము ఎట్టి పరిస్థితులలోను ఈ 3 రిజర్వాయర్లను స్వంతంగా భరించ జాలదన్నది ఇక్కడ ముఖ్యంగా గమనించవలసిన విషయం. రాష్ట్ర ప్రభుత్వం సత్వరంగా చేయవలసినది ఏమిటంటే ఈ 4 బ్యారేజీలను నిధుల మేరకు ఒకదాని తరువాత ఒకటి తీసుకొని పూర్తి చేయడం. కేంద్రం మీద ఒత్తిడి తెచ్చే రిజర్వాయర్ల పనులకు క్రమేణా చేపట్టేలాగు చేయాలి. ప్రాజెక్టు ఖర్చులలో 15 శాతం దాకా రైతుల భాగస్వామ్యానికి గానూ కృషి చేయాలి. ఈ విధంగా ఫిలిపెన్స్ దేశంలోని ప్రాజెక్టులు రైతుల భాగస్వామ్యంతో ఇప్పుడు అమలులో ఉన్నాయి.

8. ముఖ్యాంశములు: గోదావరినది జలాలద్వారా నీటిపారుదల రంగంలో అభివృద్ధి సాధించడమే కాకుండా వివిధ రంగాలలో ప్రగతి సాధించి, ఆర్థిక అభివృద్ధి, దారిద్ర నిర్మూలన కలిగేలా చూడాలి. పైన చెప్పిన విధంగా 4 బ్యారేజీలు, 3 రిజర్వాయర్లు చేపట్టినట్లయితే రమారమీ 48 లక్షల ఎకరాలకు 2 పంటలకు నీరు, కాలువల ద్వారా, ఎత్తిపోతల పథకాల ద్వారాను పారించవచ్చును. ఈ ఏడు ప్రదేశాలలో జలవిద్యుత్ కేంద్రాలు స్థాపించుకోవాలి. వరద కాలువలో జలవిద్యుత్‌ను, రెండవ పంట కాలంలో జలవిద్యుత్‌ను, ఎత్తిపోతల పథకాలకు ఉపయోగించుకోవాలి. మిగులు విద్యుత్‌ను గ్రిడ్‌కి సప్లై చేయాలి. గోదావరి పొడవునా, అనగా సముద్రమునుండి శ్రీరాం సాగర్ ప్రాజెక్టు దాకా సముద్ర నౌకలు (3 వేల టన్నుల సామర్థ్యం ఉండేది) పోయే విధంగా జలమార్గం కలుగచేయాలి. దీనివలన ముడి సరుకుల రవాణా కాలుష్యం లేకుండా దూర ప్రాంతాలకు తక్కువ ఖర్చుతో చేసే వీలుంది. జలరవాణా సౌకర్యంతో ఇక్కడే వుండే ఖనిజాలను ఉయోగించే పరిశ్రమలు ఈ ప్రాంతమంతా విస్తరించే అవకాశాలు ఉన్నాయి. తద్వారా ఆర్థిక పురోభివృద్ధి కలుగడమే కాకుండా, వ్యవసాయ కార్మికులకు, పేద రైతులకు సంవత్సరం పొడవునా ఉపాధి కలుగుతుంది. జల రవాణాలో కూడా ఉపాధి సౌకర్యాలు బాగా లభిస్తాయి. గోదావరి జలాల ద్వారా సర్వతోముఖంగా అభివృద్ధి సాధించాలంటే ఇటువంటి బృహత్ ప్రణాళికలు ఎంతైనా అవసరము.

ప్రభావం అంచనా అధ్యయనాలు పోలవరం ప్రాజెక్టు పరిశీలన

-ఎం. భరత్‌భూషణ్
ఇ. రేవతి

ఏదైనా ఒక అభివృద్ధి పథకం వల్ల రాగల లాభనష్టాల గురించిన అంచనాను నిజాయితీగా, వస్తుగతంగా జరపాలంటే దాని సాంఘిక, సాంస్కృతిక, పురావస్తు, పర్యావరణ అంశాల గురించిన అధ్యయనం మొట్టమొదట ఆ ప్రాజెక్టుకు అనుకూలంగా ఎటువంటి పూర్వ అభిప్రాయాలు లేకుండా ఉండాలి. అంటే ప్రతి అంశాన్నీ అధ్యయనం చేసేటప్పుడు అందులో ఇమిడి వున్న అన్ని కోణాలకు సమానమైన ప్రాధాన్యత ఇవ్వాలి. అటువంటి అధ్యయనాలన్నింటినీ సమ్మిళితం చేసి, సమగ్రంగా అంచనా వేసి ఆ ప్రాజెక్టు వల్ల రాగల అవకాశాలు, జరగగల నష్టాల గురించి బేరీజు వేయాలి. ఏ ప్రాజెక్టు సాధ్యా సాధ్యాల నిర్ణయాలకైనా కీలకమైన ఈ అధ్యయనాన్ని ఇప్పుడు, పర్యావరణ, ప్రభావ అంచనా, పేరిట పిలుస్తున్నారు.

పోలవరం ప్రాజెక్టు విషయంలో ఈ పర్యావరణ ప్రభావ అంచనా కేవలం మొక్కుబడి తంతులా జరిగిపోయింది. నిజానికి పర్యావరణ ప్రభావ అంచనాలు రెండు సార్లు 1985లో, 1990లో జరిగాయి. ఈ నివేదికలు సాంఘిక ప్రభావం గురించి, సాంస్కృతిక, వారసత్వ సంపద, పురావస్తు విశేషాలు, ప్రాజెక్టు గురించి అక్కడి ప్రజల దృక్పథం, సామూహిక అభివృద్ధి, పర్యావరణం, అక్కడి జంతు జాతులు మొదలయిన విషయాలు అధ్యయనం చేశాయి. అయితే ఈ రెండు నివేదికలు కూడా ప్రాథమిక సమాచారం మీద ఆధారపడలేదు. మొత్తానికి అటూ ఇటూగా రెండు నివేదికలూ ప్రాజెక్టువల్ల ప్రతికూల ఫలితాలేమీ ఉండబోవని ప్రకటించాయి. సంబంధిత ప్రభుత్వ సంస్థలు ప్రాజెక్టు అమలును అనుమతించాలని సిఫారసు చేశాయి. మొదటి నివేదిక నీటిపారుదల శాఖలోని ప్రాజెక్టుల ఏర్పాటు కమీషనర్ జె. రాజారావు అధ్యక్షతన తయారు కాగా, రెండవ నివేదిక ఆంధ్రవిశ్వవిద్యాలయ ప్రొ॥ వి.ఆర్.ఆర్.ఎమ్.బాబు నేతృత్వంలో మొదటి నివేదికకు పూర్తి అనుకరణగా సాగింది.

ఈ నివేదికలు ప్రాజెక్టు అధికారుల వైఖరిని ప్రతిబింబించడం మాత్రమే కాక నిర్వాసితులను వెళ్ళగొట్టడాన్ని సమర్థించే విధానాలను పద్ధతులను, విలువలను ప్రకటించాయి. ఇటువంటి విలువలు సాధారణంగా అధికారులలో మేధావులలో ఉన్నవే. అందువల్ల ఈ నివేదికలను పరిశీలించడం అవసరమవుతోంది. ప్రాజెక్టుల అభివృద్ధి వల్ల నిర్వాసితులయ్యే ప్రజల విషయంలో తీసుకోవాల్సిన చర్యలను నిర్ణయించడానికి ఈ పర్యావరణ ప్రభావ అంచనా, పర్యావరణ నిర్వహణా ప్రణాళిక, లాభనష్టాల వస్తుగత విశ్లేషణ తదితర పరిశోధనలు జరుగుతాయి గనుక ఇవి ఏవిధంగా జరుగుతాయో పరీక్షించడం అవసరం. గోదావరి నదిమీద నిర్మించతలపెట్టిన బహుళార్థ సాధక పోలవరం ఆనకట్ట విషయంలో ఈ అధ్యయనాలు ఏవిధంగా జరిగాయో పరీక్షించి ఆ పద్ధతిని విమర్శించడం ఈ వ్యాస లక్ష్యం.

ప్రాజెక్టు అధికారులు పర్యావరణ కమిటీని ఒకదానిని ఏర్పరిచారు. దానిలో పురావస్తుశాఖ, మత్స్యశాఖ, అటవీశాఖ, జంతుశాఖ, కాలుష్యనివారణశాఖ వంటి ప్రభుత్వ విభాగాల డైరెక్టర్లు, ప్రొ॥టి. శివాజీరావు వంటి కొందరు పర్యావరణ శాస్త్రవేత్తలు, మరికొందరు వున్నారు. ఈ కమిటీ రెండు మూడుసార్లకన్నా ఎక్కువ సమావేశం అయినట్టు లేదు. కమిటీ ఎన్నిసార్లు సమావేశమైందో కూడా కొందరు సభ్యులకు గుర్తులేదు. కమిటీ వాస్తవికంగా క్షేత్ర ప్రాథమిక సమాచారం ఏమీ సేకరించకుండానే నివేదిక తయారు చేసింది. ప్రధానంగా గిరిజనులతో కూడిన రెండు లక్షలమంది జనసంఖ్యగల ఒక ప్రాంతంమీద ప్రభావంవేసే ప్రాజెక్టును అధ్యయనం చేసే కమిటీలో సామాజిక శాస్త్రవేత్తలు, ఆంత్రోపాలజిస్టులు, ఇతర సాంఘిక శాస్త్రవేత్తలు లేకపోవడం కొట్టవచ్చినట్టుగా కనపడుతుంది.

ఈ నివేదికలు పోడు వ్యవసాయం, గిరిజనాభివృద్ధి, అటవీ, జంతు, పరిరక్షణ, అభివృద్ధి తదితర అంశాలపై ఎన్నో కొత్త

వ్యాఖ్యానాలు చేశాయి కనుక వాటిని పరీక్షించడం చాలా అవసరం. ఈ వ్యాఖ్యానాలు, సిఫారసులు నివేదిక రచయితల మనోభావాలకు అద్దం పడతాయి కనుక వాటిని అర్థరహితం అని పక్కకు నెట్టేబదులు ఓపికగా పరిశీలించవలసి ఉంది.

ప్రొ॥బాబు రచించిన పర్యావరణ ప్రభావ నివేదిక 1990 తన లక్ష్యాల గురించి ధృఢంగాను, సూటిగాను ప్రకటించింది. ఆయన ముందుమాట జలం మూలం ఇదం జగత్ అనే నినాదంతో ముగుస్తుంది. "అతి తక్కువ పర్యావరణ ప్రభావాల"తో కూడిన పోలవరం ప్రాజెక్టును అనుమతించడం "జాతీయాభివృద్ధి కొరకు, ప్రాంతీయాభివృద్ధి కొరకు"అవసరమని ఆయనంటారు.

పర్యావరణప్రభావ అంచనా-ఒకనాటకం

రాష్ట్ర మాజీ ప్రధాన ఛీఫ్‌కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్, పోలవరం ప్రాజెక్టు పర్యానరణ కమిటీ సభ్యుడు పుష్పకుమార్ ఇటువంటి కమిటీల పని తీరును, వైఖరులను వివరించి ఈ కమిటీలు రాసే నివేదికలు ప్రహసనాలుగా ముగుస్తాయని అన్నారు. "పర్యావరణ ప్రభావ అంచనా కేవలం కంటితుడుపు. మనను మనం సంతృప్తి పరచుకోవడానికి, ప్రతికూల పర్యావరణ ప్రభావమేదీ లేదని చెప్పుకోవడానికి ఈ అంచనాలు వేస్తాం. దాదాపు అన్ని అంచనాల స్థితి అదే. ఉదాహరణకు పశుగ్రాసపు సమస్యగురించి పశుగణాభివృద్ధి శాఖను అడుగుతాం. వాళ్ళు తప్పనిసరిగా ఛఛ ఏప్రభావమూ ఉండదు అంటారు. ఒకవేళ ఏదైనా ప్రభావమున్నా కొత్త గ్రాస క్షేత్రాలు పెంచుతాం, పశువులకు గ్రాసం అందిస్తాం అంటారు. అలా తమసొంత పథకాలను ముందుకుతెస్తారు. చేపల విషయానికొస్తే మత్స్యశాఖ ఛఛ చేపలమీద ఏప్రభావమూ ఉండదు. నిజానికి చేపలు ఎక్కువ దొరుకుతాయి అంటారు. మొత్తంగా ప్రభుత్వం జరిపే అంచనాలన్నీ ఇట్లాగే వుంటాయి. ఇటువంటి పరిశీలనను ఒకస్వతంత్ర సంస్థ ఏదైనా జరపాలి అన్నారు"

ఈ రెండు నివేదికలలో ఏమి వున్నదో పుష్పకుమార్ వివరించారు. అంతేకాదు ఇప్పటివరకూ అనేక సంస్థలు జరిపిన ఇటువంటి అధ్యయనాలు, నివేదికలు ఎలా వుంటాయో ఆయన వివరించారు. మరెన్నో సమస్యల గురించి ఈ నివేదికలు ఒకమాట తరచుగా వాడుతుంటాయి: "కాని ఈ పర్యావరణ సమస్యలను తగిన దూరదృష్టితో సులభంగా పరిష్కరించవచ్చును"

తప్పులు- వక్రీకరణలు

ఈ నివేదికలకు పోలవరం ఆనకట్ట పట్ల అనుకూల దృక్పథం వుంది కనుక నిరాధారంగానే తమ వైఖరికి అనుకూలమైన తప్పులకు వక్రీకరణలకు పాల్పడ్డాయి. తమ ప్రకటనలను సమర్థించే రుజువులను చూపెట్టవలసి వుంటుందని కూడా అవి భావించలేదు. 1990 నివేదిక పోలవరం ప్రాజెక్టు ఆయకట్టు ప్రజలు తరచుగా కరువులు ఎదుర్కొంటున్నారని అందువల్ల ప్రాజెక్టు అవసరమని కూడా రాసింది.

1985 నివేదిక ఈ ప్రాజెక్టువల్ల 250 గ్రామాలు, అడవులు ముంపుకు గురవుతాయని, అవి నిరుపయోగమయినవని ఏ ఆలోచనా లేకుండా వాటిని వదులుకోవచ్చునని రాసింది. అంతేకాదు ఈ ప్రాంతపు ముంపు, ఈ ప్రాంత పర్యావరణ అభివృద్ధికి దోహదం చేస్తుందని కూడా ఈ నివేదిక రాసింది. పరిసర ప్రాంతాల భూమి ప్రధానంగా మెట్ట లేదా పోరంబోకు కనుక ఏ సానుకూల జీవ పర్యావరణం లేదని, కాలువల తవ్వకం వల్ల అటువంటి పర్యావరణం ఏర్పడుతుందని కూడా నివేదిక వాసింది. ఎటువంటి పరిశోధనా లేకుండానే వృక్షజాతుల విషయంలో అంతరించిపోతున్న వృక్షజాతులేవీ నమోదుకాలేదు అని కూడా నివేదిక వాసింది.

ముంపుసౌందర్యం అంటున్నతప్పుడు నివేదికలు

ప్రాజెక్టువల్ల ప్రతికూల ప్రభావం ఏదీ వుండదని చెప్పడానికి ఈ నివేదికలు అన్ని రకాలుగా ప్రయత్నించాయి. ఒకవేళ ఎక్కడైనా సమస్య వుందని పించినా అది చిన్నదని, తాత్కాలికమైనదని సమర్థించడానికి ప్రయత్నించాయి. ముంపు, పునరావాసం, గిరిజనులు మరింతగా అడవిలోకి, కొండలమీదకి వెళ్ళడం, మరింత ఎక్కువ అడవిని కోల్పోవడం మొదలైనవన్నీ ముంపుకు గురయ్యే ప్రాంతపు అభివృద్ధికి ఉపయోగపడతాయని నివేదికలు రాసాయి.

అయితే పెద్ద సంఖ్యలో ప్రజలను నిర్వాసితులను చేసే ఈ ప్రాజెక్టు దుష్ఫలితాల గురించి ప్రాజెక్టు రూపకర్తలకు, ప్రభుత్వానికి, పర్యావరణ శాస్త్రవేత్తలకు తెలియకపోలేదు. తగిన దూరదృష్టితో పథకాలను అమలు జరిపితే ఆ సమస్యలను సవరించవచ్చునని వారు అంటారు.

సాంఘిక కోణం విస్మరణ

ప్రజలకు, పర్యావరణానికి తీవ్రమైన విఘాతం కలిగించే అంశంపై ఇంజనీర్లు రాసిన నివేదికలో ప్రజలు, ప్రజాసమస్యలు, గిరిజనులు, స్త్రీలు విస్మరణకు గురి కావడం ఆశ్చర్యంకాదు. ఈ సాంకేతిక నిపుణులు తమ నివేదికలోనుంచి కూడా ప్రజలను లేకుండా చేసారు. ఈ నివేదికలు ప్రజలపట్ల అపారమైన అజ్ఞానాన్ని ప్రకటిస్తాయి. మొత్తం నివేదికలో ప్రజల గురించి కొన్ని పేజీలు కూడా కేటాయించబడలేదు.

అసలు ముంపు ప్రాంతంలో లేని గిరిజన జాతులగురించి ఈ నివేదికలు ప్రస్తావిస్తాయి. తమ దగ్గర క్షేత్ర సమాచారం లేదుగనుక రచయితలు కల్పనకు పూనుకున్నారు. అందువల్లనే ఈ నివేదికలలో కోయలు ఇంకా వేట, మేకల పోషణ, పోడు వ్యవసాయం చేస్తున్నట్టుగా కనపడతారు. వారిభూమిని కేవలం మెట్ట, పోరంబోకు, బీడు భూమిగా అభివర్ణిస్తారు. పునరావాసం, పర్యావరణ విధ్వంసం ఫలితాల గురించి పూర్తిగా విస్మరించడం జరిగింది. అడవి మీద, సహజ వనరుల మీద ఆధారపడిన గిరిజనుల ఆర్థిక వ్యవస్థలో, సాంఘిక నిర్మాణంలో స్త్రీలకు ప్రముఖపాత్ర వుంటుంది. నిర్వాసితులు కావడం వల్ల స్త్రీలకు పర్యావరణ కాందిశీకులుగా మారడం మాత్రమే కాదు, స్త్రీలుగా ఎదురయ్యే ప్రత్యేక సమస్యలుంటాయి. తూర్పు కనుమలలో గిరిజనులను నిర్వాసితులను చేసిన అనేక అభివృద్ధి ప్రాజెక్టులు పురుషులకన్నా, స్త్రీల మీద ఎక్కువ దుష్ఫలితాలు చూపాయి. ఈ నివేదికలు ఇటువంటి ఎన్నో సమస్యలను పూర్తిగా విస్మరించాయి. ప్రజలను, ముఖ్యంగా గిరిజనులను విస్మరించడం అవసరమే అనుకున్న ఈ నివేదికలు వారి సమస్యలను విస్మరించడంలో ఆశ్చర్యం లేదు.

ఈ వైఖరికి మరొక కోణం కూడా వుంది. ఎన్నో అధ్యయనాలు జరిగినప్పటికీ ముంపు ప్రాంతంలోని ప్రజలమీద అధ్యయనాలు జరగలేదు. గనులశాఖ, భూగర్భశాఖ, మత్స్యశాఖలు మాత్రమే ఈ అధ్యయనాలు జరిపాయి. అధికారులు గాని, నివేదికలు గాని చివరికి ముంపుకు గురవుతున్న గ్రామాల జనసంఖ్యలను సవరించడానికి కూడా పూనుకోకుండా ఇరవైఏళ్ళకింది సంఖ్యలను వాడాయి. 1993లో మాత్రమే నిర్వాసితులకోణం గురించి అధ్యయనం చేసి, పునరావాస కార్యక్రమం సూచించవలసిందిగా సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్ (సెస్)ను అడగడం జరిగింది. ముంపు ప్రాంతంలో గిరిజనులు నిర్వాసితులు కావడం అనే సమస్య ఎంత విస్తృతమయినదో, అది ప్రభుత్వం అంచనా వేసినదాని కన్నా ఎంత పెద్ద సమస్యో సెస్ నివేదిక సూచించింది. ముంపు ప్రాంతంలో ఎన్ని గూడాలున్నాయో, వాటిలో జనసంఖ్య ఎంతో అనే విషయంలో కూడా ప్రభుత్వ నివేదికలు ఎంత తప్పుల తడకలో సెస్ నివేదిక చూపింది.

1985 నివేదికలోని ఒకభాగాన్ని పరిశీలిస్తే ప్రజాసమస్యలను అధ్యయనం చేయడానికి ఎంత శ్రద్ధ చూపారో అర్థమవుతుంది. ఈ అధ్యయనం జరపడానికి మార్గదర్శక సూత్రాలలో నాలుగు ప్రశ్నలు, వాటికి నాలుగు వాక్యాలలో జవాబులు ఇచ్చారు. ప్రణాళికా రచయితలందరూ సాంఘిక సమస్యలను అధ్యయనం చేయడంలో తీసుకొనే వైఖరికి ఇది నిదర్శనం.

"**ప్రశ్నలు:**

1. ప్రాజెక్టు ప్రాంతంలో ఆదివాసి ప్రజానీకపు పరిరక్షణ (ఎవరైనా వుంటే)
2. నిర్వాసిత ప్రజల పునరావాసం
3. ప్రాజెక్టు ప్రాంతంలో నీటి వాడకంపై ప్రజల ఒత్తిడి నిరోధం లేదా తగ్గింపు
4. అదనపు జనాభావల్ల ఏర్పడే కాలుష్య, వ్యర్థ పదార్థ సమస్యల నియంత్రణ

జవాబులు:

ఈ ప్రాంతంలో నివసిస్తున్న జనసంఖ్య నమోదుకాలేదు. ప్రాజెక్టువల్ల ప్రభావితులయ్యే ప్రజలకు తగిన నష్టపరిహారం చెల్లించడానికి ఏర్పాట్లు ప్రాజెక్టు వ్యయంలోనే జరిగాయి. వ్యర్థ పదార్థాల, కాలుష్యకారకాల నియంత్రణ విషయంలో రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు ఆదేశాలను పాటించడం జరుగుతుంది."

విశ్లేషణ

పోలవరం ప్రాజెక్టు అధ్యయనాలలోను, పర్యావరణ కమిటీలోను భాగస్వాములైన కొందరు నిపుణుల పరిశీలన ప్రకారం పర్యావరణ ప్రభావ అంచనా కేవలం కంటితుడుపుగా జరిగింది. ఎందుకంటే ప్రాజెక్టు నిర్మించాలని నిర్ణయం తీసుకున్న తరువాతనే ప్రభావ అంచనా పనులు మొదలైయ్యాయి. అందువల్ల ఒకవేళ

అవసరమైతే ప్రాజెక్టును ఆపి, ప్రత్యామ్నాయాలు అన్వేషించే అవకాశం ఈ అధ్యయనాలకు లేకపోయింది. తత్ఫలితంగా ప్రభావ అధ్యయనాల పని వున్న స్థితిని వివరించడం, సమస్యలను నమోదు చేయడం, వాటిని పరిష్కరించే చర్యలు సూచించడం అనే వాటికి పరిమితమైపోయింది. ప్రభుత్వంకాని, దాని శాఖలు కాని ఏమైనా సిఫారసులు చేసినప్పుడు వాటివల్ల ఆర్థిక, రాజకీయ ప్రయోజనాల గురించి మాత్రమే ఆలోచన వుంటుంది.

ప్రభుత్వం ప్రాజెక్టును నిర్మించాలని నిర్ణయించుకొని, దాని నుంచి రాజకీయ లాభాలను కూడా పొందడం మొదలయ్యాక ఇతర శాఖలనుంచి నిపుణులను పిలిచి సలహాలు అడగడం మొదలయింది. ఈ నిపుణులను నేరుగానో, పరోక్షంగానో ప్రభుత్వ అనుకూల నివేదికలు రాయమని ఒత్తిడి చేయడం జరిగింది. అనుకూల నివేదికలు పొందడానికి మరొక ఎత్తుగడ ప్రభుత్వ సర్వీసులో వున్న అధికారులనే నిపుణులుగా ఆహ్వానించడం. పురావస్తు సంగ్రహాలయాల డైరెక్టరు డాక్టర్ వి.వి. కృష్ణశాస్త్రి ప్రణాళికా స్థాయిలోనే తన సలహా అడిగి వున్నట్టయితే నాగార్జునసాగర్ ప్రాజెక్టును అనుమతించే వాడిని కాదని అన్నారు. ఆ ప్రాంతం దేశానికి మాత్రమే కాక యావత్తు మానవ జాతికే ముఖ్యమైన ఎన్నో బౌద్ధ పురావస్తు అవశేషాలను ముంచివేసింది. కాని ప్రాజెక్టు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించుకున్న తరువాత ఆయనను అడిగినందువల్ల ఆయనకు ఆ పురావస్తు అవశేషాలను తవ్వితీసి భద్రపరచడం మినహా మరొక గత్యంతరం లేకపోయింది. అదేవిధంగా పోలవరంలో కూడా ఆయన తవ్వితీసి భద్రపరిచే పనిమాత్రమే చేస్తున్నారు. ఈ వారసత్వ సంపద పట్ల ఆయన ఆసక్తికి ఎన్నో పరిమితులున్నాయి. పోలవరం తవ్వకాల విషయంలో ఎత్నో-ఆర్కియాలజీలో నిపుణులయిన శాస్త్రవేత్తల అవసరం వుందని, కాని వారిని నియమించుకొనే అవకాశం లేదని ఆయన అన్నారు. ఇదే విధంగా అన్ని శాఖల నిపుణులకు 'వీల్లేదు' అనడానికి వీల్లేని పరిస్థితి కల్పించి ప్రభుత్వం పర్యావరణ ప్రభావ నివేదికలు తయారుచేసింది. అంటే అనుమతి అనేది ప్రాజెక్టుకోసమే తప్ప పర్యావరణ ప్రభావాలపై కాదని పుష్పకుమార్ అన్నారు.

వస్తుగతమైన, నిష్పాక్షికమైన ప్రభావ నివేదికలు రాకపోవడానికి కారణం ఇటువంటి అధ్యయనాలలో స్వతంత్ర సంస్థలను భాగం చేయకపోవడమేనని కూడా పుష్పకుమార్ అన్నారు. ప్రభావ అధ్యయనాల గురించి వివరిస్తూ ప్రభుత్వేతర స్వచ్ఛందసంస్థల విషయంలో కూడా మనం చాలా విమర్శనాత్మకంగా వుండవలసిన అవసరం వుంటుందని ప్రొ॥శివాజీరావు అన్నారు. భూకంపాల గురించి, ఇతర అంశాలగురించి కొన్ని విశ్వవిద్యాలయాలు, కొందరు శాస్త్రవేత్తలు తప్పుడు నివేదికలు ఇచ్చిన ఉదాహరణలను ఆయన గుర్తుచేశారు. తెహ్రీ ఆనకట్ట విషయంలో సాంకేతిక అధ్యయనాలను ఆయన నిదర్శనంగా చూపారు. ప్రపంచం దృష్టిని ఆకర్షించిన ప్రాజెక్టుల విషయంలోనే ప్రభావ నివేదికల విశ్వసనీయత అనుమానాస్పదంగా వున్నప్పుడు అంత విమర్శ ఎదుర్కోని ప్రాజెక్టుల విషయంలో నిపుణులకు ఏమాత్రం స్వాతంత్ర్యం వుంటుందని ఆయన ప్రశ్నించారు.

చింతూరు, వి.ఆర్.పురం మండలాలలో స్త్రీల సాధికారత కోసం కృషిచేస్తున్న కోయ మహిళ కన్నమ్మ మాటలలో చెప్పాలంటే "ఎంత భూమిని ముంపుకు గురిచెయ్యాలో నిర్ణయించేశారు. ఇప్పుడు ఈ నివేదికలలో చేసే పనల్లా ఆనిర్ణయాన్ని సమర్థించుకోవడమే. చంపి వేయదలచుకున్న కుక్కను పిచ్చిదని పేరుపెడతాము కదా! ప్రాజెక్టు గురించి నిర్ణయించడం, పరిశోధనలు జరపడం, ప్రాజెక్టుకు సిఫారసులు చేయడం, ప్రజల అనుమతి, ప్రజలతో చర్చ, ముఖ్యంగా బలి అయిపోయే ప్రజలతో సంబంధం లేకుండా కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని ఖర్చు పెట్టడం వంటి ప్రభుత్వ చర్యలన్నీ చూస్తే ఈ మొత్తం వ్యవహారం అప్రజాస్వామికం మాత్రమే కాదు, ఒక పెద్ద ఖరీదైన కుట్ర అనిపిస్తుంది." పోలవరం ప్రాజెక్టు గురించి ముంపుకు గురయ్యే ప్రజల అభిప్రాయం ఇది. క్షేత్ర పరిశీలన ద్వారా బయట పడే సత్యం కూడా ఇదే. పోలవరం ప్రాజెక్టు సాంఘిక, సాంస్కృతిక, పర్యావరణ అంశాల ప్రభావం గురించి, ముంపు ప్రాంతాల ప్రజలమీద దిగువ ప్రాంతాల ప్రజలమీద స్వల్పకాలంలోను, దీర్ఘకాలంలోను వేసే ప్రభావాల గురించి ఒక వాస్తవికమైన, శాస్త్రీయమైన అధ్యయనం అవసరం అనడంలో సందేహం లేదు.

(ఇంగ్లీషు వ్యాసానికి సంక్షిప్తానువాదం)

భారీ ప్రాజెక్టుల నిర్మాణం అవసరమా?

-విద్యాభూషణ్

మన దేశంలో వ్యవసాయాభివృద్ధికి భారీ ప్రాజెక్టుల నిర్మాణం అవసరమా? అన్నదో 'చర్చ'గా సాగుతుంది. దీనికి కారణం సర్దార్ సరోవర్ రిజర్వాయర్ నిర్మాణ సందర్భంగా నర్మదా బచావ్ ఆందోళనే. ఈ ఆందోళన కారులు భారీ ప్రాజెక్టుల నిర్మాణం వలన ఆయా ప్రాంతాలను, ప్రకృతినీ నమ్ముకుంటూ జీవనం సాగిస్తున్న ఆదివాసుల పునరావసం మాటనే ఎక్కువగా ప్రస్తావిస్తున్నారు. అది నిజం కూడా. ఆందోళనకారులు చెప్తున్న వాస్తవాల దృష్ట్యా ఈ ప్రాజెక్టు నిర్మాణం వలన సుమారు 85 వేల కుటుంబాలు నిర్వాశిత మౌతున్నాయట. అంటే సుమారు ఐదు లక్షల మంది. వీరికి సరైన పునరావాసం కల్పించే ప్రణాళికలు గానీ, పథకాలు గానీ మన ప్రభుత్వం వద్ద లేవు. ఈ విషయాన్ని ప్రాజెక్టు నిర్మాణ పథకాన్ని పునః సమీక్షించిన "రివ్యూకమిటీ" తన నివేదికలో పేర్కొంది. ప్రాజెక్టు నిర్మాణం వలన తలెత్తే పర్యావరణ సమస్యలను సరిగ్గా అంచనా వేయలేదని, నిర్వాశితుల పునరావాసాన్ని పునః పరిశీలించాలనీ ఆ కమిటీ కోరింది. దీంతో సంతృప్తి చెందని ప్రపంచబ్యాంకు 'పామెల్లా కాక్స్' కమిటీని పంపించింది. ఈ కమిటీ అతి కొద్ది మరమ్మత్తుల్లాంటి సూచనలు చేసింది. అయితే ఆ సూచనలను సైతం భారత ప్రభుత్వం చేయలేక పోవడంతో, ఈ ప్రాజెక్టుకు రుణాన్నిచ్చే ఒప్పందం నుండి ప్రపంచబ్యాంకు తప్పుకుంది. అయినా ప్రాజెక్టు నిర్మాణం కొనసాగించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం వుంది. ప్రాజెక్టు నిర్మాణ అంచనా వ్యయం ఆరువేల కోట్ల రూ॥ల నుండి 40 వేల కోట్ల రూ॥లకు పెరిగింది.

ఈ ఆందోళనకారులు లేవనెత్తుతున్న మరో ప్రధానాంశం పర్యావరణం. ప్రాజెక్టుల ఆయకట్టు ప్రాంతాల్లో నేలలు జలమయం కావడం, నీటిలో ఉప్పుశాతం పెరగడం, మురిగినీరు వచ్చి చేరినందువలన జనజీవరాసుల ఆరోగ్యంపై ప్రభావం చూపడం తదితరాలు. వీటి నివారణా భద్రతా చర్యలనూ శాస్త్రీయంగా పరిశీలించి పరిష్కరించుకోవలసి వుంది. పోతే అతి ప్రధాన సమస్య పునరావాస కల్పనే. ఈ ప్రాజెక్టు కారణంగా సుమారుగా 226 గ్రామాలు (మూడు రాష్ట్రాలకు చెందిన) ముంపునకు గురవుతున్నాయట. అయితే ఇప్పటికే చేపట్టిన నిర్మాణం పనుల వలన గుజరాత్‌కు చెందిన 19 గ్రామాలకే సరైన పునరావాసం కల్పించలేక పోవడంతో ప్రాజెక్టు పూర్తయినందువలన నిర్వాసితులౌతున్న 226 గ్రామాలకు ప్రభుత్వం ఏం పునరావాసం కల్పించనుంది? కల్పించగలదు? అన్నది వీరి ప్రశ్న.

ఇంతటి ప్రధాన "పునరావాస" విషయానికొస్తే-మన ప్రభుత్వం దగ్గర నిర్దిష్ట జాతీయ పునరావాస విధానమేదీ లేదు. 1894 భూసేకరణ చట్టం (దీన్ని 1984లో సవరించారు) ప్రకారం, నిర్వాసితుడైన వ్యక్తికి ప్రభుత్వం నగదురూపంలో ఇచ్చిన "నష్టపరిహారం"తప్ప మరేమీ ఇవ్వనక్కర్లేదు అని. ఇది అటవిక న్యాయంగానే వుంది. పైగా నర్మదా నదీలోయ ఆదివాసీ జనాలకు నగదు చెల్లింపుల్లో ఎంతటి న్యాయం చేకూర గలదో మనం వూహించుకోగలం. పైగా హైదరాబాద్ లాంటి భాగ్యనగరం లోనే పబ్లిక్ రంగ సంస్థలను మూసేసి, వాటిల్లో పని చేసే కార్మికుల "పునరావాసం" కోసం ప్రభుత్వం ఏం చేయకున్నా, కిమ్మనలేని వాస్తవాలు మన ముందున్నాయి. న్యాయ స్థానాలు జోక్యం కల్పించుకున్నా చలించని ప్రభుత్వ ధోరణులు మనకు తెలుసు. అనుభవం కూడా. ఇదంతా నాణేనికి ఒకవైపు మాత్రమే అయితే రెండో వైపుగా అసలు మనలాంటి వ్యవసాయ ఆధారిత దేశాలకు, భారీ ప్రాజెక్టుల నిర్మాణం అవసరమా? అన్నది ముఖ్య విషయం.

ఇటీవల కొలంబోలో ముగిసిన డ్యాముల ప్రపంచకమీషన్ సమావేశంలో, భారత్, ఈజిప్టు, చైనా లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలకు భారీ ప్రాజెక్టుల అవసరం అనివార్యమని స్పష్టం చేసింది. ఇందుకు ప్రతిగా కొంతమంది పర్యావరణ శాస్త్రవేత్తలు భారీ ప్రాజెక్టుల నిర్మాణం స్థానంలో చిన్నతరహా నీటిపారుదల సౌకర్యాలను మెరుగుపర్చుకోవడం "శ్రేయస్కరం" అని చెప్తున్నారు. అయితే వీరు చెప్తున్న చన్న తరహా నీటిపారుదల సౌకర్యాలను గత శతాబ్దాలలోనే మనం దేశంలో చేపట్టడం జరిగిందనీ, ఇప్పటికే ఈ చిన్న నీటిపారుదల సౌకర్యాలను ప్రోత్సహించడం జరుగుతూ వుందనీ మన రాష్ట్ర మాజీ చీఫ్ ఇంజనీర్ టి. హనుమంతరావు చెప్పారు. ఆయన అంచనాల మేరకు దేశ వ్యాప్తంగా సుమారు ఐదు లక్షల చెరువులు పైగా యేటా వేలాది సంఖ్యలో కొత్త చెరువులు నిర్మితం అవుతున్నాయట.

వర్షపాతం అనుకూలంగా వున్నంతవరకూ చిన్న నీటిపారుదల వ్యవస్థతో పేచీ వుండదు. కానీ ఏ పది పదిహేనేళ్ళకో ఒక్కసారి ఒక్క సంవత్సరం వర్షాభావ పరిస్థితులెదురైతే, మొత్తం ఈ చిన్న నీటి వనరులన్నీ ఎండిపోయి, భూగర్భజల మట్టాలు ఒక్కసారి పాతాళం లోకి పోతాయన్నది హనుమంతరావుగారి సూచన. వ్యవసాయ బావుల్లో సైతం ఇదే ధోరణి. గత కొన్నేళ్ళుగా ఇది మనకు అనుభవంలోకి వస్తుంది కూడా. గతంలో 1833, 1879 సం॥రాలలో ఈ తరహా వర్షాభావ పరిస్థితులు ఎదురవగా, నేటి జనాభాలో ఇరవయ్యోవంతుగా వున్న నాటి జనాభాకే ఆహార ధాన్యాలను సరఫరా చేయలేని పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో వేలాది మంది జనం గయానా, దక్షిణాఫ్రికా, మార్షియస్, ఫ్యూజి వంటి దేశాలకు వలసపోయిన అనుభవాలు వున్నాయి. ఇరవయ్యో శతాబ్దపు తొలి నాళ్ళలో సైతం ఈ తరహా పరిస్థితుల కారణంగానే అనేక ఆకలి చావులను మనదేశం చవిచూడాల్సి వచ్చింది. దేశ స్వాతంత్ర్యం వచ్చిన తరువాతి కాలంలో అయితే అంతటి తీవ్రమైన ఆకలి చావుల పరిస్థితులను మనం ఎదుర్కోవలసి రాలేదు. కారణం 'స్వాతంత్ర్యం' వచ్చిన తరువాత కొద్దిపాటి స్థాయిలో నైనా భారీ డ్యాంలను మనం నిర్మించుకోగలగటమే. మరొనాటికి చిన్న తరహా నీటిపారుదల వసతులు వున్నాయిగా. అవి వున్నప్పటికీ మనం తీవ్ర దుర్భిక్ష పరిస్థితుల నెదుర్కోవలసి వచ్చింది.

భారీ ప్రాజెక్టుల ఆవశ్యకతను చెప్పేందుకై మాజీ ఛీఫ్ ఇంజనీర్ టి. హనుమంతరావు మరో ఉదంతాన్ని చెప్పుకొచ్చారు. అదేంటంటే?.. 'స్వాతంత్ర్యం' వచ్చిన తరువాత అత్యంత కరువు నెదుర్కొన్న సం॥రం 1987. ఆ సం॥రపు ఆహార ధాన్యాల ఉత్పాదన సుమారుగా 160 మిలియన్ టన్నులు. నాటి ఆహార అవసరాల నెదుర్కొనేందుకు సమృద్ధయిన అంచనాయే అది. అయితే ఆ సం॥రం ఆహార ఉత్పత్తి 135 మిలియన్ టన్నులకు పడిపోయింది. వర్షాభావ పరిస్థితుల వలనే. అంటే 25 మిలియన్ టన్నుల ఆహార ధాన్యాల ఉత్పత్తిలోటు. అదే భారీ ప్రాజెక్టులు వునికిలో లేని పరిస్థితుల్లో అయితే 1987 నాటి ఉత్పత్తి కేవలం 85 మిలియన్ టన్నులకే పరిమితయ్యేదనీ, తత్ఫలితంగా ఏర్పడనున్న 75 మిలియన్ టన్నుల ఆహార ధాన్యాల లోటు, ఏ దేశం కాని, దేశాల కూటమిగాని తీర్చగలిగేది కాదని అన్నారు. కానీ భారీ డ్యాంల వల్లనే నాడు ఉత్పత్తి 135 మిలియన్ టన్నులయిందనీ, గత కాలపు నిల్వలు, ఇతర స్వల్ప దిగుమతులతో నాటి పరిస్థితులను అధిగమించగలిగామనీ ఆయన వాదన.

గత పది పన్నెండేళ్ళుగా మనదేశ వర్షపాత పరిస్థితులు సజావుగా వున్నందున తీవ్ర కరువు పరిస్థితుల్లేక, భారీ డ్యాంల వల్ల ఒనగూడిన నీటిపారుదలా సామర్థ్యం సైతం గుర్తించలేని స్థితికి నెట్టివేయబడటం వలన ఈ తరహా ఆలోచనలకు అవకాశమేర్పడిందనిపిస్తుంది. ఒక్క సంవత్సరపు వర్షాభావ పరిస్థితులు చాలు, దేశాన్ని ఆకలి చావులకు గురిచేయడానికి. ఇటీవల తీవ్ర ఆహార సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న సోమాలియా, ఇథియోపియా దేశాల్లో పలు జలవనరులున్నప్పటికీ తీవ్రదుర్భిక్ష పరిస్థితులు తరచూ నెలకొంటూనే వున్నాయి. అదే ఈజిప్టుకి వస్తే, గత ముప్ఫై ఏళ్ళ నుండీ దుర్భిక్ష పరిస్థితులే లేవు. కారణం ఈజిప్టు నైల్, అరేబియా నదుల జలాలపై "అశ్వనీ" ఈనే భారీ ప్రాజెక్టు పథకాలను నిర్మించుకోగలగటమే.

కొలంబో సమితి చేసిన మరో ముఖ్యమైన సూచన ఏంటంటే, మన దేశంలాంటి వ్యవసాయాధారిత దేశాల్లో చిన్నతరహా, భారీ నీటిపారుదలా వనరులను సమన్వయంగా వినియోగించు కోగలగాలని. అలాగే భారీ ప్రాజెక్టుల నిర్మాణ విషయంలో మన దేశంలో తలెత్తుతున్న పర్యావరణ సమస్యలకు తగు ప్రత్యామ్నాయ మార్గాలను శాస్త్రీయంగా శోధించాల్సి వుందని. ఈ "ప్రత్యామ్నాయం" ఖరీదైనప్పటికీ, ప్రతికూల ప్రభావం పరిమితమైనదిగా చూసుకోవాలనీ కొలంబో సమితి సూచించింది.

ఇక నిర్వాసిత పునరావాసిత విషయానికొస్తే, ఇప్పటి పాలక వర్గాలు తాము చట్టాల్లో చెప్తున్న విషయాలను పునఃసమీక్షించుకోవాల్సి వుంది. నిర్వాసితుల ఆర్థిక అభివృద్ధి కుంటుపడని రీతిలో ఉత్తమ ఆదాయ ప్రత్యామ్నాయ మార్గాలను చూపాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. అదీ ఎంతటి స్థాయిలో, ఎంతటి బాధ్యతాయుతంగా అంటే, చైనాలో 'త్రీగార్జెస్ డ్యాం' నిర్మాణంలో పునరావాస కల్పనకు వారు తీసుకున్నంతటి తీవ్ర స్థాయిలో. ఈ డ్యాం నిర్మాణ కారణంగా సుమారు 12 లక్షలమంది ప్రజలు నిర్వాసితులవుతున్నారు. అయితే ఇక్కడ గమనించాల్సిన మరో ముఖ్యాంశం ఏంటంటే, ఈ డ్యాం నిర్మాణం వలన ప్రయోజనం పొందనున్న ఆయకట్టు ప్రాంత ప్రజల కన్నా "నిర్వాసితులే" అత్యంత ఉత్సాహంగా వున్నారట, వారు పొందనున్న పునరావాస చర్యల దృష్ట్యా చైనా ఈ పునరావాసానికి ఆ డ్యాం పరిసర ప్రాంతాల్లోనే చక్కని కాలనీలు-పాఠశాలలు, పర్యావరణ పరిరక్షణకై పలు పథకాల ఏర్పాటుకై ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారు. అదే మన ప్రభుత్వం చూపిన పునరావాస చర్యలకు అస్సలు పొంతనే లేని అంశం ఇది. సాధారణంగా మన పట్టణాల్లో మురికి వాడల్లో

వున్న పీడిత వర్గాల పునరావాసానికి ఈ జనాన్ని నగర శివార్లకు తరలించేయడం జరుగుతుంటుంది. దీంతో అంతవరకూ వారు పొందిన ఉపాధిని కోల్పోయే పరిస్థితులెదురవుతూ వుంటాయి. పైగా ఒక మురికి వాడ నిర్మూలన, మరో మురికి ఏర్పాటుకే దారి తీస్తుంది. ఈ కారణాల రీత్యానే ప్రజల నుండి తీవ్ర ప్రతిఘటన ఎదురవటం పరిపాటయింది. ఇదే నర్మదా సరోవర్ డ్యాం ప్రాంతంలో అక్కడి నిర్వాసితులకు ఉపాధి కల్పించే స్థానంలో పలు టూరిస్టు హోటళ్ళతో టూరిస్టు కేంద్రాల నిర్మాణానికి భిన్న పథకాలు సిద్ధం చేయడం ఇక్కడ మనం గమనించాల్సిన అంశం. దీంతో అక్కడి నిర్వాసితులు వారి జీవనోపాధి కోసం పరిసర పట్టణాలకు వలసలుగా వెళ్ళి కారు చౌక కార్మికులుగా జీవనాన్ని వెళ్ళదీయాల్సి వుంటుంది. అడవి తల్లి వొడిలో స్వేచ్ఛా జీవనానికి అలవాటు పడ్డ వీరు నగర జీవన పరిస్థితుల్లో ఇమడలేని ఇబ్బందీ ఎదురౌతుంది. అందుకే ఈ భారీ డ్యాం నిర్మాణ విషయంలో ఇంతటి తీవ్ర ప్రతిఘటన, అందుకు సమస్య పరిష్కారానికి సమస్య లోతుల్లోకి వెళ్ళి చర్చించడం, పరిష్కరించడం ప్రభుత్వం లక్ష్యంగా వుండాలే తప్ప, ప్రపంచబ్యాంకు లాంటి ఆర్థిక సంస్థల రుణాలతో, వారి సూచనల మేరకు పథకాలను చేపడుతూ, రుణ చెల్లింపులకే ప్రాధాన్యతనిస్తూ పర్యాటక కేంద్రాల ఏర్పాటు లాంటి వ్యాపార ఆలోచనలకు ప్రాధాన్యత నీయడం "సహేతుకం" కాదు.

సాధారణంగా ప్రతీ పది పన్నెండేళ్ళకు నెలకోబోతున్న వర్షాభావ పరిస్థితుల దృష్ట్యైనా ప్రభుత్వం ఇప్పటికి తల పెట్టిన భారీ డ్యాంల నిర్మాణాన్ని, జల విద్యుత్ కేంద్రాల నిర్మాణాన్ని యుద్ధ ప్రాతిపధికన పూర్తి చేయాల్సి వుంది. లేకుంటే వాటి నిర్మాణ వ్యయం అనూహ్యంగా పెరిగి వాటిని పూర్తి చేయడమే ఓ పెను సవాలుగా మారే ప్రమాదం వుంది. వుండటమే కాదు ప్రస్తుతం ఎదుర్కొంటున్నాం కూడా. అదే నర్మదా సరోవర్ డ్యాం నిర్మాణం ఆరువేల కోట్ల నుండి 40 వేల కోట్లకు పెరిగిందన్న విషయం మనకు తెలిసిందే. ఇలాగే ఇతర పథకాలు కూడా.

ఇదే సందర్భంగా మనం గుర్తెరగాల్సింది, మనకున్న జల వనరులను పూర్తి స్థాయిలో వినియోగించుకోవడం చిన్నతరహా నీటి పారుదలా విధానాల వల్ల సాధ్యం కాదని మాజీ ఛీఫ్ ఇంజనీర్ టి.హనుమంతరావు పేర్కొన్నారు. చెరువుల నిర్మాణంలో సాధ్యమైనంత ఎక్కువ జలాన్ని నిలువచేసే విధంగా చేపట్టడం వుపయుక్తంగా వుంటుందనీ ఆయన అన్నారు. భారీ డ్యాంల నిర్మాణం వలన, ఆయా రిజర్వాయర్‌ల విస్తీర్ణానికి సుమారు ఇరవై రెట్ల విస్తీర్ణ ప్రాంతానికి ఆయుకట్టు ఫలితాలను అందజేయగలుగుతామనీ, అదే చెరువుల ద్వారా నిలువ చేసిన నీటి ద్వారా-నీటి నిలువ చేసిన విస్తీర్ణ ప్రాంతానికి కేవలం రెండు రెట్ల ప్రాంతానికే నీటి సదుపాయాన్ని అందజేయగలుగుతామనీ ఆయన పేర్కొన్నారు. తద్వారా సదుపాయాన్ని అందజేయగలుగుతామనీ ఆయన పేర్కొన్నారు. తద్వారా నిలువచేయగలిగిన నీరు వృధాగా సముద్రం పాలయ్యే ప్రమాదముందనీ ఆయన తెలిపారు.

తగినన్ని 'వాటర్ షెడ్స్' నిర్మాణం ద్వారా భారీ డ్యాంల నిర్మాణాన్ని నిలిపివేయవచ్చని పర్యావరణ శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. కాని సాంకేతికంగా అది సరైంది కాదు. రిజర్వాయర్లలో ఇసుకమేట వేసే ప్రమాదాన్ని అధిగమించి, రిజర్వాయర్ల జీవన ప్రమాణాలు పెంచుకోగలిగే వెసులుబాటు కలుగుతుంది. తద్వారా వాటర్ షెడ్స్ ఏర్పాటు రిజర్వాయర్ల నిర్వహణకు 'అదనపు' వనరులుగానే ఉపయోగపడతాయన్న మాట. నదీ పరీవాహక ప్రాంతాల్లో వాటర్ షెడ్స్ ఏర్పాటు, భారీ డ్యాంల్లో అధిక జల వినియోగానికి దోహదపడి ఈ విధానాల సమన్వయం అధిక ఫలితాలను సాధించేందుకుపయోగపడుతుంది అంతిమంగా.

ఈ వాస్తవాల నేపథ్యంలో భవిష్యత్ నీటిపారుదలా వసతి ఏర్పాటు డ్యాంల పరీవాహక ప్రాంతాల్లో వాటర్ షెడ్ల నిర్మాణం, నిర్వాసితులకు పటిష్టమైన నిర్మాణయుత పునరావాస కల్పన, డ్యాం, కాలువల ఆయకట్టు అభివృద్ధి వంటి ప్రధాన అంశాల సమన్వయంతో సమగ్ర పథకాన్ని రూపొందించుకోవడం ఇప్పటి తక్షణ కర్తవ్యం.

అయితే ఈ ప్రతిపాదనలు నీటిపారుదల పథకాల నిర్మాన వ్యయం, తద్వారా పొందే ప్రయోజనాలకంటే అధికం కాగలవని కొంతమంది ఇంజనీర్లు, ప్రణాళికా వేత్తలు అంటున్నారన్న విషయాన్ని ప్రస్తావించగా, అది సత్యదూరమని టి. హనుమంతరావు పేర్కొన్నారు. ఇదే సందర్భంగా ప్రాజెక్టుల లబ్ధిదారుల ప్రయోజనాలకు సరిసమాన స్థాయిలోనే నిర్వాసితుల పునరావాస వుపాధి కల్పనకు ప్రాధాన్యత నివ్వడం అవసరమనీ ఆయన స్పష్టం చేశారు.

రానున్న వర్షాభావ పరిస్థితుల్లో వాటర్ షెడ్స్, చిన్న తరహా నీటి పారుదల వనరులు దేశాన్ని కరువు కాటకాల నుండి ఎంతమాత్రం రక్షించలేవు. సానుకూల వర్షాలు లేకుంటే ఈ చిన్న నీటి పారుదల వనరులు నిరుపయోగం అయ్యే ప్రమాదం వుంది. తద్వారా భారీ డ్యాంల నిర్మాణానికి పోటీగా కానీ, ప్రత్యామ్నాయంగా కానీ ఈ చిన్న నీటి పారుదలా వనరుల ఏర్పాటు నిలువలేమన్నది సుస్పష్టం.

సాగునీటి సమస్యకు గోదావరి జలాలతోనే పరిష్కారం

-ప్రొ॥యస్.వి.శేషగిరిరావు
రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షులు

సాగునీటికి త్రాగునీటికి ఏర్పడిన కటకటే నేడు ఆంధ్రప్రదేశ్ ఎదుర్కొంటున్న అతి ప్రధాన సమస్య. గ్రామీణ ఉపాధి, ఉత్పత్తి రంగాలు సాగునీటితో ముడిపడి వున్నాయి. వ్యవసాయంలో అనిశ్చిత స్థితి తొలగిపోవడం, పంటల దిగుబడిలో గణనీయమైన పెరుగుదల, కూలిదినాలు పెరగడం, భూముల విలువ పెరగడం, అనుబంధ వృత్తుల కుటుంబాల ఆదాయంలో వృద్ధి, ప్రభుత్వ ఆదాయం కూడా పెరగడం, సాగునీటి వ్యవస్థ ఏర్పడినచోట చూస్తూనే వున్నాం. మన రాష్ట్రానికి సంబంధించినంత వరకు గ్రామీణ పేదరిక నిర్మూలనకు దృష్టి పెట్టాల్సింది ముఖ్యంగా నీటిపారుదల వ్యవస్థ మీదనే అనేది నిర్వివాదాంశం.

ఒకవైపు క్రొత్త ప్రాజెక్టుల నిర్మాణం రకరకాల సమస్యలను ఎదుర్కొంటుండగా, పాతనీటి పారుదల వ్యవస్థ-ముఖ్యంగా కృష్ణ జలాల మీద ఆధారపడిన 44 లక్షల ఎకరాల ఆయకట్టు సంక్షోభంలో పడింది.

కృష్ణానది నికర జలాల్లో (2060 టి.యం.సిలు) మన వాటాకు వచ్చిన 800 టి.యం.సి. లకు, పునరుక్తి జలాల క్రింద కేటాయించ బడిన 11 టి.యం.సి. లకు సరిపడ రిజర్వాయర్లు ఇప్పటికే నిర్మించుకొన్నాం. అయితే ఎగువ రాష్ట్రాలు వాటి వాటాను పూర్తిగా వాడుకోక ముందు మనకు ఎలాంటి సమస్యలు ఎదురు కాలేదు. 1976-95 మధ్య సరాసరిన ఏటా 910 టి.యం.సి. లు వాడుకొన్నామని కేంద్ర జలసంఘం గణాంకాలు చెపుతున్నాయి. కర్నాటక తమ వాటాకు మించి (734 టి.యం.సి.లు) అనేక మీడియం, మైనర్ ప్రాజెక్టులు నిర్మించుకొంది. ఎగువతుంగ సామర్ధ్యాన్ని 27.65 టి.యం.సి. లకు అదనంగా పెంచుతుంది. దానివల్ల తుంగభద్ర ఉభయ కాలువల ఆయకట్టుకు నీళ్లందడం లేదు. కే.సి.కెనాల్‌కు కూడా నీరందడం లేదు.

ఆల్మట్టి ఎత్తును తాత్కాలికంగా 519 మీ. వద్ద సుప్రీంకోర్టు ఆపుదల చేసినా మరో కోణం నుంచి సమస్యను ఎదుర్కొంటున్నాం. ఆల్మట్టి పూర్తిగా నిండిన తర్వాతనే కర్నాటక మనకు నీటిని వదులుతున్నది. జూన్-జూలైలలో అందవలసిన నీరు సెప్టెంబరులో కాని లభ్యం కావడం లేదు. జూలై-ఆగష్టులలో కళకళలాడవలసిన శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాలు వెలవెలబోతున్నాయి. వర్షపాతం సాధారణ స్థాయికన్నా తక్కువైనా, ఆలస్యమైనా, పూర్తి నష్టాన్ని మన రాష్ట్రమే భరించాల్సి వస్తున్నది. బచావత్ తీర్పులో ప్రోరేటా (వారాల వారి) పంపకం లేక పోవడంతో ఈ దుస్థితి ఏర్పడింది. కర్నాటక వైఖరి కారణంగా, తక్కువగా అందుతున్న నీటికోసం రాయలసీమ, తెలంగాణా, కోస్తా గొడవలు పడుతున్నాయి. మరొక ట్రిబ్యునలే దానికి పరిష్కారం. ట్రిబ్యునల్ నియామకాన్ని కేంద్ర ప్రభుత్వం ఏప్రిల్‌లో ఆమోదించింది. సభ్యులు జూలైలో నియమించ బడినారు. కాని ఇంతవరకు ట్రిబ్యునల్ పని ప్రారంభించినట్లు దాఖలాలు లేవు. అందువల్ల ప్రోరేటా నీటి విడుదల కొరకు రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించాలి. లేకపోతే రానున్న సంవత్సరాలలో కృష్ణ ఆయకట్టు రైతాంగం అష్టకష్టాలు పడక తప్పదు.

గంగ బ్రహ్మపుత్రల తర్వాత దేశంలో గోదావరి పెద్దది. వరద ప్రవాహం 20 లక్షల క్యూసెక్కులు (ఒక్కరోజులో 175 టి.యం.సి.లు) ఉండటం సాధారణమే. 75 శాతం విశ్వాసనీయత ఆధారంగా గోదావరి జలాల లభ్యత 3000 టి.యం.సి.లుగా అంచనా వేశారు. 50 శాతం విశ్వసనీయతతో లభ్యత 4075 టి.యం.సి.లు. ఇది అపార జలరాశి. మహారాష్ట్ర, చత్తీస్‌గడ్, ఒరిస్సాల వాటాపోను, బచావత్ ట్రిబ్యునల్ మనకు కేటాయించింది 1480 టి.యం.సి.లు. దీనిలో సగం మాత్రమే ఉపయోగించుకొంటున్నాం. మిగత సగం నికరజలాలతో పాటు, 1000 టి.యం.సి.లు అదనపు జలాలు కూడా సముద్రం పాలవుతున్నాయి.

అయితే గోదావరి జలాలను వినియోగించుకొనడంలో కొన్ని క్లిష్టమైన మస్యలు ఎదురౌతున్నాయి. కృష్ణ, గోదావరులు ఒకే ఎత్తున (330మీ.) రాష్ట్రంలో ప్రవేశిస్తున్నా, కృష్ణా జలాలు లభిస్తున్న పరిమాణంలో గోదావరి జలాలు లభించడం లేదు. ఆ ఎత్తున లభించే నీటిని పూర్తిగా వినియోగించుకొనే విధంగా శ్రీరాంసాగర్ 300మీ. ఎత్తున నిర్మించబడింది. శ్రీరాంసాగర్ దిగువన ప్రాణహిత వచ్చి కలిసే దాకా గోదావరిలో లభించే నికర జలాలు 50 టి.యం.సి.లు మాత్రమే.

ప్రాణహిత సంగమం చీలేసరికి ఎత్తు 300మీ. నుంచి 95 మీ. కు పడిపోయింది. మరొక వైపు గోదావరి జలాల కొరకు ఎదురు చూస్తున్న తెలంగాణా మెట్టప్రాంతాలు 150-500 మీటర్ల ఎత్తున వున్నాయి.

దిగువన మాత్రమే పుష్కలంగా లభించే గోదావరి జలాలను, కరీంనగర్, వరంగల్, మెదక్, నల్గొండ జిల్లాలలోని ఎత్తైన ప్రాంతాలకు అందించడమెలా అనేది నేడు సాంకేతిక నిపుణుల ముందు, ప్రభుత్వ నేతల ముందు ఉన్న జటిల సమస్య. ఎత్తిపోతల విధానం ఖర్చుతో కూడినదనేది వాస్తవమే. కాని నిపుణులు ప్రత్యామ్నాయ మార్గాన్ని సూచించడంలేదు. ఇచ్చంపల్లి ఎత్తు 112మీ. కూడా చత్తీస్‌గడ్ ఒప్పుకోవడం లేదు. ఈ ఎత్తు వల్లకూడా దిగువ ప్రాంతాలకే లాభం కాని, అసలు సమస్య పరిష్కారం కాదు.

అందువల్ల, తెలంగాణా మెట్ట ప్రాంతాలకు గోదావరి జలాలను అందించాలంటే లిఫ్ట్ చెయ్యడమొక్కటే మార్గం. అందుకు అవసరమైన విద్యుత్‌ను గోదావరిలోనే ఉత్పత్తి చెయ్యాలి. అనగా ఏక కాలంలో విద్యుత్‌ను అందించే ప్రాజెక్టులు, లిఫ్ట్ పథకాలు చేపట్టాలి. ఎల్లంపల్లి, ఇచ్చంపల్లి, దేవాదుల, దుమ్ముగూడెం, పోలవరం ఏకకాలంలో చేపట్టాలి. వీటిని ప్రాధాన్యతా క్రమంలో ఇరికించగూడదు. పోలవరం సమాంతరంగా నిర్మించకపోతే, ఇచ్చంపల్లి, దేవాదుల ఎత్తిపోతలకు అవసరమైన విద్యుత్తు లభించదు.

గోదావరి ప్రవాహం 94.6 శాతం జూన్-అక్టోబర్‌లలో వుంటుంది. ఆ నెలల్లో లిఫ్ట్ చేసి ఎగువనున్న బ్యాలన్సింగ్ రిజర్వాయర్లను నింపుకోవాలి. తెలంగాణాలో కాకతీయులు నిర్మించిన చెరువులు చాలా వున్నాయి. ఘనపూర్, భీమఘనపూర్, రామప్ప, లక్నవరం, పాఖాల, శింగభూపాలెం, శనిగరం, ధర్మసాగర్, వంటి ఎన్నో చెరువులున్నాయి. ఇవన్నీ బ్యాలన్సింగ్ రిజర్వాయుర్లుగా వాడుకోవచ్చు.

ఇంకో సమస్య కూడా పరిష్కారానికి ఎదురు చూస్తున్నది. అది కూడా పై ప్రాజెక్టుల ద్వారా పరిష్కరించుకోవాచ్చు. ఎగువ గోదావరి, ప్రవర, పూర్ణ, మంజీర బేసిన్‌లలో మహారాష్ట్ర అనేక మీడియం, మైనర్ ప్రాజెక్టులు నిర్మించినందువల్ల, శ్రీరాంసాగర్‌లోకి అంచనా వేసుకొన్న దానికన్నా 40 టి.యం.సి.లు తక్కువ నీరు వస్తున్నది. యస్.ఆర్.యస్.పి రెండవ దశకు నీరు లభించదు. నిజాంసాగర్ మేట వెయ్యడం వల్ల, దాని సామర్థ్యం బాగా పడిపోయింది. వరద కాలువలోకి, కాకతీయ కాలువలోకి, ఎల్లంపల్లి, ఇచ్చంపల్లి నుంచి నీటిని అందించడం ద్వారా ఈ సమస్యలు పరిష్కరించుకోవచ్చు.

దుర్భిక్ష ప్రాంతాలైన నల్గొండ, మహబూబ్‌నగర్, ప్రకాశం పశ్చిమ భాగం, రాయలసీమ రైతాంగం ఎంత కాలంగానో ఎదురు చూస్తున్న ప్రాజెక్టులు-యస్‌యల్‌బిసి, టెయిల్ పాండ్, కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, వెలుగొండ, తెలుగుగంగ, గాలేరునగరి, హంద్రినీవా. ఇవన్నీ జూరాల, శ్రీశైలం జలాశయాల మీద ఆధారపడి వున్నాయి. వీటికి కావలసిన 230 టి.యం.సి.లు ఎలా సమకూర్చుకోవాలన్నది మరో సమస్య. కృష్ణ అదనపు జలాల మీద కొంతమేరకు మాత్రమే ఆధారపడవచ్చు. పులిచింత ద్వారా 4 టి.యం.సి. ఆధాచెయ్యవచ్చు. అందువల్ల 100-150 టి.యం.సి.లు గోదావరి జలాలను కృష్ణా బేసిన్‌కు తరలించడం తప్ప, ఈ కరువు పీడిత ప్రాంతాలను ఆదుకొనటానికి మరోమార్గం లేదు. అందరూ సుహృద్భావంతో, జాతీయతా స్ఫూర్తితో ఈ పరిస్థితిని అర్థం చేసుకోవాలి. 150 టి.యం.సి.లు గోదావరి జలాలు కృష్ణ బేసిన్‌కు తరలించినా, గోదావరి బేసిన్ ప్రయోజనాలకు ఎలాంటి ఇబ్బందీ వుండదు.

పోలవరం కుడి కాలువ ద్వారా డెల్టాకు, దుమ్ముగూడెం నుంచి ఎంకురు వద్ద సాగర్ ఎడమ కాలువకు, దేవాదుల ఇచ్చంపల్లి నుంచి నాగార్జునసాగర్‌కు గోదావరి జలాలను తరలించడం ద్వారా శ్రీశైలం జలాశయం నుంచి మెట్ట ప్రాంతాలను ఆదుకోవచ్చు. అయితే విద్యుత్ ఉత్పాదనతో కొంత కోల్పోతాం. కాని విద్యుత్ ఉత్పాదన కన్నా సాగునీటికే ప్రాధాన్యత నివ్వాలి.

ఉత్తరాంధ్రలోని చిన్న నదులను కూడా పూర్తిగా ఉపయోగించుకోవాలి. ఈ ప్రణాళికను పూర్తిగా అమలు చేసినా, రాష్ట్రంలోని ప్రతిచేనుకు నీరందించలేము. అందువల్ల చెరువులను కూడా పూర్తిగా వుపయోగంలోకి తీసుకరావాలి. రాష్ట్రంలో 77 వేల చెరువులున్నాయని, సర్వే ఆఫ్ ఇండియా మ్యాపులు సూచిస్తున్నాయి. వీటిలో సగానికి పైగా శిథిలమైనాయి. ఆక్రమణలకు గురైనాయి. వీటిలో కనీసం మూడోవంతునైనా పునరుద్ధరించాలి. భూగర్భజలాల దృష్ట్యా కూడా ఇది చలా ముఖ్యం. ఏఏ చెరువులకు జీవం పొయ్యొచ్చో నిర్ణయించడానికి ఒక సాంకేతిక కమీషన్ ఏర్పాటు కావాలి. ఆ కమీషన్ ఎంపిక చేసిన చెరువులను పునరుద్ధరించాలి. గోదావరి జలాల వినియోగాలతో సమాన ప్రాధాన్యతను చెరువుల పునరుద్ధరణకివ్వాలి.

సాగునీటి సమస్య ఆవేశాలతో కూడినటువంటిది. దీన్ని రాజకీయాల కతీతంగా, సంయమనంతో పరిష్కరించుకోవాలి. వేరే మార్గాల్లోకి పోతే నీరు సముద్రంపాలవుతూనే వుంటుంది. గ్రామీణ పేదరికం మాత్రం మనలను వదలిపెట్టదు.

నీటి పంపిణీ-అనుసరించవలసిన సూత్రాలు

-పుచ్చలపల్లి సుందరయ్య

ఈనాడు గల వాస్తవాల దృష్ట్యా, సాధ్యమైనంత న్యాయమైన, అవసరాలకు అనుగుణ్యంగా సమానమైన పరిష్కారాన్ని కనుగొనే ప్రయత్నానికి పూనుకునే ముందు మనము గమనించాల్సిన సూత్రాలేమిటి?

1. ఒక తాలుకా లేదా జిల్లా వివిధ జిల్లాలలో విభజింపబడి వున్నా ప్రధానంగా పంటల తరుణం ప్రాతిపదికగా ఒకే ప్రాంతంగా పరిగణింపదగిన ప్రాంతములో కురిసే వర్షపాతపు మొత్తానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంటుంది. ఒకానొక ప్రాంతం కరువు ప్రాంతమా కాదా అని నిర్ణయించాలన్నా, దానికి ఆ పరీవాహక ప్రాంతం నుండి లేదా ఇతర నీటి వనరుల నుండి ఎంత నీరు ఇవ్వవలసి వుంటుంది? ప్రాజెక్టులను చేపట్టేటప్పుడు దేనికి ఎంత ప్రాధాన్యత ఇవ్వాలి? అనే విషయాలు అక్కడక్కడే వర్షపాతం దృష్ట్యానే నిర్ణయించవలసి ఉంటుంది.

2. ఒకానొక తాలూకా లేదా నదీ పరీవాహక ప్రాంతం లేదా ఒక ఉపనదీ పరివాహక ప్రాంతం ఎంత నీటిని ఇస్తున్నది అనే విషయం మీద కాక ఆయాప్రాంతాల కనీస అవసరాలను తీర్చేందుకు ఎంత ఎక్కువ నీరును వానికి అందించగలం అనేది దృష్టిలో వుంచుకోవాలి. అలా అందజేయడానికి పూనుకొనేటప్పుడు, ఏయే పరీవాహక ప్రాంతాలలో నుండి నీరు తరలిస్తామో వారి కనీస అవసరాలకు నష్టం కలగకుండా ముందు చూసుకోవాలి.

ఈ సందర్భంలో అందుబాటులో వున్న నీటిని ఈ క్రింది ప్రాధాన్యతతో వాడుకోవాలి. 1. త్రాగేందుకు, కుటుంబ అవసరాలకు (మనుషులకు, పశువులకు), 2. సాధ్యమైనంత ఎక్కువ విస్తీర్ణానికి మూడు నుండి నాలుగు నెలలపాటు ఒక్క ఆరు తడి మెట్ట పంటకైనా నీరు గ్యారంటీ ఇవ్వాలి. 3. అంతకు మించి నీరు లభ్యమయ్యేలా గుంటే 6 నెలల కాలపు మాగాణి పంటకుగాని, దానికి బదులు ఒక తక్కువ కాలపు మాగాణి పంట, ఒక ఆరుతడి మెట్ట పంటకు సరిపడ నీరు 4. పారిశ్రామిక అవసరాలకు 5. పైన పేర్కొన్న ప్రాధాన్యాతలకు భంగం కలగకుండా విద్యుచ్ఛక్తి ఉత్పత్తికి గల ఇతర వనరులకు పూర్తిగా వినియోగించుకొన్న తర్వాత విద్యుచ్ఛక్తి ఉత్పత్తికి 6. పైన పేర్కొన్న ప్రాధాన్యతలను నీరు ఉపయోగించుకోలేక నీరు మడుగు కట్టకుండా, ఉప్పు తేలకుండాను నివారించేందుకు రెండవ మాగాణి పంటకు ప్రవాహ నీరు లేనప్పుడు ట్యూబ్, లేదా బోర్ వెల్స్ ద్వారా భూగర్భ జలాలను వాడుకోవలసి వుంటుంది. అలా భూగర్భ జలాలను వాడుకొని సంవత్సరం పొడుగునా నీరు కావలసిన చెరకు వంటి పంటలను పండించే రైతులకు పెరిగే సేద్యపు ఖర్చులకు గాను అదనపు గిట్టుబాటు ధరను దృష్టిలో గ్యారంటీ చేయాలి.

3. ఈ నాటి సాగుభూమిని మాత్రమే దృష్టిలో వుంచుకొని నీటి వనరుల కేటాయింపు జరగరాదు. ఎందువల్లనంటే, వివిధ జిల్లాల్లో బంజర్లతో సహా సాగుకు లాయకైన భూములలో సాగైన భూమి 50 నుండి 80 శాతం వరకు తేడాలతో వున్నాయి. ప్రతి జిల్లా తాలూకాల్లో సాగుకు లాయకైన భూమి, సాగుభూమి రెంటినీ కలిపి సగభాగం తీసుకుంటే అది మరింత న్యాయమైనదిగా వుంటుంది. ఎందువల్లనంటే, అలా సరాసరి తీసుకున్నప్పుడు ప్రస్తుత సాగుభూమికి, ప్రస్తుతం బీడుగా వున్న-భవిష్యత్‌లో సాగుకు అవకాశం గల భూమికి అవసరమైన నీటి వనరులను స్పష్టం చేస్తుంది.

4. భూవిస్తీర్ణంతోపాటు ఆ తాలూకా లేక జిల్లా లేక ప్రాంతంలో గల జనాభాను కూడా పరిగణనలోనికి తీసుకోవాలి. అలా చేయకపోతే ప్రజలు త్రాగేందుకు, ఇతర అవసరాలను మనం విస్మరిస్తున్నామన్న మాట. అలాగే పరిశ్రమలు, ఇతర కార్యకలపాలకు, అత్యవసర ప్రయోజనాలకు అవసరమైన, న్యాయమైన నీటి కేటాయింపు మరచి పోతాము. అందువల్ల పరిశీలించాల్సిన ముఖ్యమైన, అత్యావశ్యకమైన అంశాలలో జనాభా కూడా ఒకటి.

అయితే జనాభాను, సాగుకు లాయకైన భూమిని అనుసంధానిస్తూ ఒక సంతృప్తికరమైన సూత్రాన్ని రూపొందించడం అంత తేలిక కాదు. ప్రతి తాలూకాకు తలసరి ఏడాదికి కావలసిన నీటినే నిర్ణయించి, మిగిలిన నీటిని ఆరు తడి మెట్ట పంటకు సాగుకు లాయకైన-సాగైన భూముల సరాసరి ప్రాతిపదికగా నీరు కేటాయించవలసి వుంటుంది.

ప్రస్తుత నీటి పంపకంలో అసమానత

ఆయా జిల్లాలకు రావలసిన నీరు పూర్తి భాగం వారికి వచ్చినా, ఆ నీటితో సాగుచేయగల భూమిలో జిల్లాజిల్లాకు చాలా ఎక్కువ తేడా వుంటుంది. ఒక్కొక్క జిల్లాలోని వర్షపాతం అనుసరించి ఆరుతడి మెట్ట పంటగాని, మాగాణి పంటలు గాని, సంవత్సరమంతా నీరు కావలసిన పంటలకు గాని నీటి సరఫరా లుండవలసి వుంటుంది. దాని వలన సాగుకాగల భూమిలో తేడాలుంటాయి. (1) 800 మి.మీ. కన్నా వర్షపాతం తక్కువగా వుండేవి కరువు ప్రాంతాలు. ఇచ్చట కన్నా (20800-1000 మి.మీ మధ్య (3) 1000 మి.మీ లకు మించి వర్షపాతం వుండే ప్రాంతాలలో ఒక టి.యం.సి. నీటితో సాగయ్యే భూమి ఎక్కువగా వుంటుంది. వర్షపాతం తగ్గేకొద్దీ వర్షపాతపు తగ్గుదల కన్నా మించి ఈ సాగుచేయదగు భూమి నిష్పత్తి మరింత తగ్గుతుంది.

అంతేగాక పంట కాలంలో వర్షాలు కురవకపోతే ఎంతో నష్టకరంగా పరిణమిస్తుంది. భూసారం, ఒక్కొక్క రకం పంటలకు అవసరమైన నీరు, ఇతర అంశాలలో తేడాలు వున్నా విభిన్న వర్షపాతాలు వుండే ప్రాంతాలలో ఒక టి.యం.సి నీటితో ఎన్ని ఎకరాలు సాగు చేయవచ్చునే విషయాన్ని మన నిపుణులు లెక్క చెప్పగలరు.

2. సూత్ర ప్రాయంగా పైన వివరించినట్లు న్యాయమైన నీటి కేటాయింపు దృష్ట్యా ప్రస్తుతమున్న నీటిపారుదల ప్రాజెక్టుల ద్వారాగాని, నిర్మాణంలో వున్న ప్రాజెక్టుల ద్వారాగాని ఒక్కొక్క జిల్లాకు ఎంత నీరు లభ్యమౌతున్నదో పరిశీలించాలి. అలాగే న్యాయంగా ఆయా జిల్లాలకు కేటాయించవలసిన నీటిని ఎలా, ఎంత ఎక్కువ నీటిని ఆయా జిల్లాలకు, ప్రాంతాలకు ఇవ్వడం సాధ్యమౌతుందో కూడా పరిశీలించాలి. నేడు ఇంకా వినియోగించుకోకుండా వున్న నీటినయినా నేడు తక్కువ వాటా పొందుతున్న ప్రాంతాలకు ఎలా ప్రత్యేకించాలో చూడాలి. అలా ఈ ప్రాంతాలకు నీరు ఇచ్చేందుకు ఏయే ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇవ్వవలసి వుంటుంది? ఒక దీర్ఘకాలిక మాగాణి పైరుకు మించి నీరు పొందుతూ, అనుకూల పరిస్థితులలో వున్న ప్రాంతాల నుండి క్రమేపి పంటల పద్ధతిని మార్చడం ద్వారాను, నీటిపై మరింత సక్రమ అజమాయిషీ ద్వారాను, ఆ నీటిని ఎంత మేరకు, నేడు తక్కువ వాటా పొందుతున్న ప్రాంతాలకు ఎలా, ఎంత మేరకు మళ్ళించగలము? అనే ఈ విషయాలను కూడా మనం పరిశీలించాలి.

ప్రాజెక్టుల నిర్మాణ జాప్యం-రాష్ట్రంలో కరువుల తాండవం

-సారంపల్లి మల్లారెడ్డి
రాష్ట్ర కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం

"పులిచింతల నిర్మాణానికి హైకోర్టు బ్రేకు". 17-11-2004 న తీర్పు వెలువడింది. పర్యావరణ అనుమతి లేనిదే నిర్మాణం చేపట్టరాదని చెప్పింది. మరుసటి రోజున ఒకసారి పిలిచిన ఒకటవ కేటగిరీ టెండర్లను హైకోర్టు రద్దు చేసింది. ప్రీ-క్వాలిఫైడ్ విధానం క్రింద రాష్ట్ర ప్రభుత్వం తొమ్మిది కంపెనీలను కాంట్రాక్టులు చేపట్టటానికి గుర్తించింది. వీరికి రు. 5000 కోట్ల విలువైన 21 టెండర్లు కట్టబెడ్తున్నారని కోర్టులో వ్యాజ్యం వేసారు. ప్రాజెక్టులను హడావుడిగా పూర్తి చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం షార్ట్‌లిస్టు చేసిన తొమ్మిది కంపెనీలనే ఎన్నికచేయడం, ఐ.యస్.ఓ సర్టిఫికేటుతో పాటు రాష్ట్ర ప్రభుత్వం వద్ద నమోదు చేసుకోవాలనే నిబంధనలను సడలించినందుకు ప్రభుత్వం ఆధికార దుర్వినియోగం చేసినట్లు కోర్టు ప్రకటించింది. మొదటి కేసును రిటైర్డ్ విద్యుత్ ఇంజనీరు వేయగా, రెండవ కేసును నెల్లూరు జమీన్ రైతు పత్రికా సంపాదకుడు ఎన్. డోలేంద్రప్రసాద్ వేసారు. ఒక తీర్పు కేంద్ర అనుమతులకు సంబంధించిన అంశం కాగా, మరో తీర్పు కాంట్రాక్టర్ల నిబంధనలకు సంబంధించినది. మొత్తం మీద ప్రాజెక్టుల నిర్మాణ దశ మళ్ళీ మొదటికి వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం 26 ప్రాజెక్టులను 46 వేలకోట్లతో చేపట్టి 56 లక్షల ఎకరాలకు సాగునీటి సౌకర్యం కల్పించాలన్న లక్ష్యంకు ఎడా, పెడా అడ్డంకులు వస్తూనే వున్నాయి. దీనికి తోడు ముంపు గ్రామాల ప్రజలకు పరిహారానికి ఆందోళనలు సాగుతున్నాయి. ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టాలని కొందరు, ఆపాలని కొందరు ప్రభుత్వంపై తెచ్చిన ఒత్తిడి ఫలించకపోవడంతో కోర్టుల నాశ్రయించి నిలుపుదలకనుకూలంగా తీర్పులు పొందారు. పారదర్శకత కల్గించాల్సిన ప్రభుత్వం అన్ని విషయాలు ప్రజలకు స్పష్టపరచకుండా, ఏకపక్షంగా చేస్తూ పోవడం వలననే ఈ పరిస్థితి ఏర్పడిందని కొందరు విజ్ఞులు వాదిస్తున్నారు. ఏదేమైనా ఈ రాష్ట్రంలో ప్రాజెక్టుల నిర్మాణం అంత తేలిక కాదన్న విషయం మాత్రం వాస్తవం. ప్రాజెక్టుల నిర్మాణం పూర్తయితేనే కరువు నివారణ సాధ్యం తప్ప మరో మార్గం లేదు.

ఈ మధ్య ప్రాజెక్టుల నిర్మాణాల విషయంలో కుంభకోణాలు జరిగిపోతున్నాయంటూ తెలుగుదేశం పార్టీ ఆరోపణలు చేయడం, దానికి కాంగ్రెసు ప్రతి సవాలు చేసి బహిరంగ విచారణకు సమయం, స్థలం ప్రకటించుకోవడం జరిగింది. గతంలో అనేకసార్లు జరిగినట్లే బహిరంగ విచారణకు తెరదించుతూ శాసనసభ సమావేశాల్లో తేల్చుకుంటామని రంగం మార్చారు.

వీటివలన రాష్ట్రంలో నిర్ణీత కాలంలో వృధాగా సముద్రం పాలవుతున్న నదుల జలాలు వినియోగంలోకి వస్తాయా? ఇది సామాన్య రైతును వేధించే ప్రశ్న. గత ప్రాజెక్టుల నిర్మాణాల అనుభవాన్ని పరిశీలించిన వారెవరికైనా ఈ రాష్ట్రంలో ప్రాజెక్టుల నిర్మాణం అంత త్వరగా తేలే సమస్య కాదని అర్థమవుతుంది. 1956కు పూర్వం ప్రాజెక్టుల ద్వారా కల్పించబడిన సాగునీటి వసతి ఆంగ్లేయుల పుణ్యాన జరిగింది. ఆంధ్రప్రదేశ్ ఏర్పడినాక నిరంతరం పాలకులు ఎన్నికల వాగ్దానాలుగాను, సభల్లో ప్రచారం ద్వారాను ప్రాజెక్టుల గురించి చెప్పడమే తప్ప అయిదు దశాబ్దాల కాలంలో ప్రారంభించిన ఏ ఒక్క ప్రాజెక్టు నేటికీ పూర్తి కాలేదు. పదహారు వేలకోట్లు వ్యయం చేసి మేజరు, మీడియం, మైనరు ఇరిగేషన్ వనరుల నిర్మాణం చేపట్టినట్లు బడ్జెట్ దృష్టాంతరంగా ఉంది. డబ్బు ఖర్చయిపోయింది కాని దానికి తగ్గ ఫలితం మాత్రం రాలేదు. కాంట్రాక్టర్లు, రాజకీయ నాయకుల జోక్యంతో ప్రాజెక్టు నిర్మాణంలో మార్పులు, నాణ్యత లేని నిర్మాణాలు చోటు చేసుకున్నాయి. నేడు ప్రాజెక్టులు సాగునీటికి అంతగా ఉపయోగపడని స్థితిలో ఉన్నాయి.

ప్రాజెక్టుల నిర్మాణానికి కేంద్రం నుండి అనుమతులు పొందిన తరువాతనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలి. 1. కేంద్ర జల వనరుల సంఘం నీటి నిల్వలున్నట్లు ధృవీకరిస్తూ అనుమతివ్వాలి. 2. ప్రాజెక్టుల నిర్మాణం వలన గాని, కాలువ త్రవ్వకాల వలన గాని అటవీ భూములకు నష్టం లేదని అటవీశాఖ అనుమతి కావాలి. 3. పర్యావరణానికి ప్రమాదం లేదని ఆశాఖ అనుమతి కావాలి. 4. సాంకేతికంగా నిర్మాణం లాభదాయకమని కేంద్రం అనుమతివ్వాలి. ఈ నాలుగు అనుమతులు పొందడానికి కేంద్రంవద్ద

దశాబ్దాల తరబడి అనేక పైళ్ళు పెండింగులో వున్నాయి. రాష్ట్రం నుండి పంపడం, కేంద్ర సంస్థలు ఏదో ఒక అభ్యంతరం లేవదీసి వివరణ అడగటం, మరల రాష్ట్ర, ప్రభుత్వం పంపటం చాలా కాలంగా సాగుతున్నది. ఒక్కోసారి ప్రాజెక్టుకు 80 సార్లు వివరణలు పంపిన ఘటనలున్నాయి. ప్రాజెక్టు నిర్మాణం చేపట్టదలచినప్పుడు రాష్ట్ర-కేంద్ర పరిపాలనా బాధ్యులు ఒక చోట చేరినప్పుడు పరిష్కరించడం కష్టమేమి కాదు- ఇక్కడున్న ఫ్యూడల్‌పరిపాలనా విధానం వలన చిన్న సమస్య పరిష్కారానికి సంవత్సరాలు గడుస్తుంటాయి.

రాష్ట్రంలోనే కాదు, దేశంలో చేపట్టిన ప్రాజెక్టులు కొన్నింటికి నిర్మాణానంతరం అనుమతులు పొందినవి కూడా ఉన్నాయి. తెలుగుగంగ పనులు ప్రధాని ఇందిరాగాంధీ జోక్యంతో అనుమతులు లేకుండానే ప్రారంభించారు. ఇప్పటికీ నిర్మాణంలో నున్న చాలా ప్రాజెక్టులకు ఏదో ఒక అనుమతి రావాల్సియే ఉంది. కర్నాటక, మహారాష్ట్ర, ప్రభుత్వాలు నిర్మాణాలు పూర్తి చేసుకున్న ఎన్ని ప్రాజెక్టులకు అన్ని అనుమతులున్నాయి. అయినా అవి పూర్తయ్యాయి. కారణం వాటి నిర్మాణాలపై ఎవరు కోర్టులనాశ్రయించలేదు. అభివృద్ధి లక్ష్యంగా పనులు సాగాయి. ఎగువ రాష్ట్రాలు నిర్మాణాలు పూర్తి చేసిన తర్వాత మన రాష్ట్రానికి గత రెండు సంవత్సరాలుగా నీటి కొరత ఏర్పడడంతో నేటి ప్రభుత్వానికి ప్రాజెక్టులపై దృష్టి మళ్ళింది. గత పాలక తెలుగుదేశం ఓటమి కారణాలలో ప్రాజెక్టులను అలక్ష్యం చేయడం కూడా ఒకటి. గత చరిత్ర ప్రకారమే నిర్మాణాలు చేపడ్తూనే అనుమతులు పొందవచ్చని నేటి ప్రభుత్వం భావించడంలో అపార్థం చేసుకోవాల్సిన పనేమీ లేదు. రాష్ట్రంలో నేడు కొనసాగుతున్న ప్రాంతీయ భేధాల కారణంగా పులిచింతల సమస్య కోర్టుకెక్కింది. ప్రజా ప్రయోజనాల పేరుతో ఎవరైనా కోర్టునాశ్రయించవచ్చు. నేడదే జరిగింది. బహిరంగంగా అందరూ పులిచింతల నిర్మాణానికి తాము అభ్యంతరం చెప్పడంలేదనే అంటున్నారు. కాక పోతే ప్రాజెక్టు స్థలం మార్చాలని, లేదా ముందు శంఖుస్థాపన చేసిన ప్రాజెక్టుల నిర్మాణం తర్వాతనే చేపట్టాలని కోరుతున్నారు. ఇందులో కొంత వాస్తవముంది. ప్రభుత్వం ఆ మార్పుకు సిద్ధంగా లేనట్టు కన్పిస్తుంది.

అన్నింటికన్నా ముఖ్యమైనది కాంట్రాక్టర్ల సమస్య. వారి మధ్యనున్న పోటీకి రాజకీయనాయకుల అండదండలు కావాలి. నేడున్న చట్టాలలోని లొసుగులన్నింటిని వినియోగించుకొని కాంట్రాక్టును చేజిక్కుంచుకోవటానికి కృషి సాగిస్తారు. గతంలో విడిగా వున్న వీరు నేడు సిండికేట్లుగా మారి కంపెనీలు ఏర్పాటు చేసుకున్నారు. పార్టీలను ఆదేశించగల స్థాయికి చేరుకున్నారు. తమకు ఆశించిన కాంట్రాక్టు రాకపోతే పనిని నిలుపుదల చేయించడానికి ముందు రాజకీయ ఒత్తిడి, ఆ తర్వాత న్యాయస్థానం ఆశ్రయిస్తారు.

ప్రజాధనం దుర్వినియోగం జరుగుతుందని న్యాయస్థానంలో వ్యాజ్యం వేస్తే దానికి తగు తీర్పు వచ్చింది. గతంలో ప్రజాధనం దుర్వినియోగం జరిగింది కాబట్టి నేడు కూడ అలా జరగాలని లేదు. గతంలో వందల కోట్లు వ్యయం చేసి నిర్మాణం చేసిన కొన్ని ప్రాజెక్టులు నేడు నీరు నిల్వ పెట్టగల స్థితిలో లేవు.

టెండర్ల వ్యవస్థలోని లోపాలు అందరెరిగినవే. అయినా వాటిని సరిదిద్దడానికి ఇంతవరకు చర్యలు లేవు. ముందు తక్కువకు టెండర్ కోట్ చేసి, తర్వాత దశలో పెరిగాయని టెండరు మొత్తాలను రివైజ్డు ఎస్టిమేట్లు వేయడం, వీలైతే యస్-యస్-ఆర్ రేట్లనే పెంచడం ఆనవాయితీగా వస్తున్నది.టెండరు వేసిన మొత్తానికే జరిగిన పనులు చాలా తక్కువ. రాష్ట్ర ప్రభుత్వం టెండరు ఎస్టిమేట్లపై 5 శాతానికి మించి వేసిన వాటిని రద్దు చేస్తానని ప్రకటించి అమలు చేసింది. ఇది చూడడానికి బాగానే ఉన్నా ఇందులో కూడా గోప్యం ఉంది. అసలు ఎస్టిమేట్సు మొత్తాన్నే పెంచి టెండర్లు పిలిచారన్న వాదన ఉంది. దీనిని సవివరంగా పరిశీలిస్తే తప్ప తెలియదు. మొత్తం మీద టెండర్ల ప్రక్రియ అసాంతం తప్పుతడకగానే సాగింది. ప్రభుత్వ హడావుడితనం వలన మరల టెండర్లు పిలువవలసిన పరిస్థితి ఏర్పడింది. దీనికి ప్రస్తుత ప్రభుత్వమే బాధ్యత వహించాలి.

నిధుల కేటాయింపును పరిశీలిస్తే బడ్జెట్లలో ప్రాజెక్టులకు నిధులు కేటాయించడం, వాటిని విడుదల చేయకపోవడం ఆనవాయితి అయ్యింది. ఆ ప్రాంత ప్రజలను సంతోష పెట్టడానికి దొక ప్రక్రియ. శ్రీరాంసాగర్ రెండవ దశ, శ్రీరాంసాగర్ వరద కాలువ, హంద్రీ-నీవా, గాలేరు-నగరీ ప్రాజెక్టులే వీటికి ఉదాహరణ. శ్రీరాంసాగర్ వరద కాలువకు వార్షికవసరాలు ప్రభుత్వం 5-6-99న ఈ విధంగా ప్రకటించింది.

1999-2000	రు. 425 కోట్లు
2000-2001	రు. 434 కోట్లు
2001-2002	రు. 715 కోట్లు
2002-2003	రు. 675 కోట్లు
2003-2004	రు. 651 కోట్లు
మొత్తం	రు. 3101 కోట్లు

పై అంచనా ప్రకారం మార్చి 2004 నాటికి వరదకాలువ పూర్తయి కరీంనగర్ 1.30 లక్షల ఎకరాలు, వరంగల్ 60 వేల ఎకరాలు, నల్లగొండ 30 వేల ఎకరాలకు సాగునీటి కల్పన పూర్తి కావాలి. కాని ఇప్పటికి వరద కాలువ ప్రారంభ దశదాటి లేదు. ఈ పట్టిక చూడండి.

మేజర్ ప్రాజెక్టు	పూర్తి కావాల్సిన కాలం	అంచనా వ్యయం (కోట్లు)
శ్రీరాంసాగర్ 1వ దశ	1999-2003	రు. 854
శ్రీరాంసాగర్ 2వ దశ	1999-2006	రు. 697
ఎల్లంపల్లి	2001-2009	రు. 538
దుమ్ముగూడెం	2002-2007	రు. 426
ప్రాణహిత	2004-2010	రు. 203
ఇచ్చంపల్లి	2002-2011	రు. 3680

శ్రీరాంసాగర్ మొదటిదశకు నేటివరకు (మార్చి 2004) రు.2583.43 కోట్లు వ్యయం చేసినా పూర్తికాలేదు. రెండవదశకు నేటికి రు. 56 కోట్లు మాత్రమే వ్యయం చేశారు. వరదకాలువకు రు.42కోట్లు వ్యయం జరిగింది. (మార్చి 2004 నాటికి)

శ్రీరాంసాగర్ మొదటి దశకు 1963-64లో 200 టి.ఎమ్.సి లు వినియోగిస్తూ రు. 40.10 కోట్లకు ఎస్టిమేషన్ వేసారు-నేడది రు.2500 కోట్లు వ్యయం చేసినా పూర్తి కాలేదు. నాగార్జునసాగర్‌కు 230 టిఎమ్‌సి ల నీటి వినియోగంతో 1970-71లో రు.91.12 కోట్లకు వ్యయ అంచనా వేసారు. మార్చి 2004 నాటికి రు. 1180.65 కోట్లు వ్యయం చేశారు. ఇంకా పనులు సాగుతూనే వున్నాయి.

జాప్యంవలన నిర్మాణ వ్యయం ఎలా పెరుగుతున్నదో ఇంతకన్నా ఉదాహరణలు అవసరం లేదు. నేడు అన్ని ప్రాజెక్టుల వ్యయాలు చుక్కల్లోకి వెళ్తున్నాయి. స్వంత నిధులు సమకూర్చుకోలేక కేంద్ర ప్రభుత్వమే కాక నేరుగా విదేశీ నిధులకు ఎగబడుతున్నారు. సకాలంలో, నిర్ణీత కాలంలో పూర్తి చేస్తే రాష్ట్ర నిధులే ఈ ప్రాజెక్టులకు సరిపోతాయి. రాష్ట్రంలోని బ్యాంకులు అందుకు సిద్ధంగా ఉన్నాయి. ప్రాజెక్టు నిర్మాణం ద్వారా వందల, వేల కోట్లు సంపాదించాలనే వారికి ఈ ప్రాజెక్టుల జాప్యం మంచి సాధనంగా ఉంది. అందుకే ప్రభుత్వం ఏకబిగిన ప్రచారం చేస్తున్న సాగుదార్లకు మాత్రం నమ్మకం కలుగుట లేదు. ప్రకటనలు ఆనందంగా ఆస్వాదిస్తున్నారు. లాభాల పంపిణి వచ్చినప్పుడు ఎన్ని రాజకీయ భేదాభిప్రాయాలున్నా పాలకవర్గ కంపెనీలన్నీ ఏకమవుతాయి.

ప్రస్తుత పరిస్థితిని విశ్లేషించిన ప్రభుత్వం ప్రాజెక్టుల నిర్మాణాన్ని పారదర్శకంగా చేపట్టాల్సిన అవసరం ఎంత ఉందో తెలుస్తున్నది. ముందుగా కేంద్రం అనుమతి సాధించాలి. అందుకు తగిన సిబ్బందిని కేటాయించి నిర్ణీత వ్యవధిలో కొన్ని అనుమతులు పొందాలి. నేడున్న రేట్ల ప్రకారం ఎస్టిమేట్సు తయారు చేసి టెండర్లు పారదర్శకంగా పిలవాలి. ఆంక్షలు పెడితే అది అనుమానాలకు, కుంభకోణాలకు దారితీస్తుంది. పనుల నాణ్యత పరిశీలించడానికి ఇంజనీర్సు కాలేజి అసోసియేషన్‌కు బాధ్యత అప్పగించాలి.

ముఖ్యంగా ముందుగా ముంపు ప్రాంతాలవారి సమస్యలు పరిష్కరించాలి. ప్రాజెక్టుల నిర్మాణాల వలన నష్టపోయిన వారికి గత చరిత్ర పునరావృతం కారాదు. గ్రామ సభలు పెట్టి నష్టపోయిన వారికి తగిన పరిహారం చెల్లించాకనే పనులు ప్రారంభించాలి. ఇందులో మధ్య దళారీల ప్రమేయం లేకుండా ప్రభుత్వం తగు చర్యలు గైకొనాలి. ప్రభుత్వానికి లక్ష్య శుద్ధి ఉన్నా ముంపు ప్రాంతాల వారికి పరిహారాల చెల్లింపు, ప్రాజెక్టులకు అనుమతులు, పారదర్శకత కల్గిన టెండర్ల విధానం ఆచరిస్తే కొంతవరకు పనులు సాగుతాయి అన్ని లక్ష్యాలను వివరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వమే పట్టుదలకు పోకుండా పరిష్కరించాలి. నర్మదా ప్రాజెక్టు జాప్యం మన ముందుంది. అలాగే ఐక్యంగా ఉండి కర్నాటక నిర్మించిన ప్రాజెక్టులు మనముందున్నాయి. జాప్యం చేసే నష్టం, ఐక్యత సాధించే ఫలితం రెండు దృష్టాంతాలూ ఉన్నాయి. ఆ అనుభవాలను గుణపాఠాలుగా గ్రహిస్తే రాష్ట్రంలో ప్రాజెక్టుల నిర్మాణం అసాధ్యమేమీ కాదు.

ఆంధ్రప్రదేశ్ సమగ్ర ఇరిగేషన్ అభివృద్ధి

-కొల్లి నాగేశ్వరరావు
అధ్యక్షులు, ఆం.ప్ర.రైతుసంఘం

ఉపోద్ఘాతం

కుటుంబనియంత్రణలో ఆంధ్రప్రదేశ్ జాతీయసగటు కంటే ముందున్నప్పటికి జనాభా పెరుగుతూనే వుంది. పెరిగే జనాభాకు ఆహారధాన్యాలు ఉత్పత్తి చెయ్యవలసిన భూమి పెరక్కపోగా, ఇళ్ళస్థలాలు, స్మశానాలు, పరిశ్రమల వినియోగం పెరగటంతో భూమి తరిగిపోతుంది. తరిగే భూమిపై పెరిగే జనాభాకు ఆహారధాన్యాలు ఉత్పత్తి చెయ్యాలంటే ఉత్పాదకత పెంచాలి.

ఉత్పాదకత పెంచేందుకు ఇరిగేషన్ సదుపాయం పెంచటం మరియు అధికదిగుబడి విత్తనాల ఉత్పత్తి ప్రధానాంశాలు. 1997 నుండి ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న రైతాంగ ఆత్మహత్యలను పరిశీలించినా ఇరిగేటెడ్ ప్రాంతాలలో అత్యల్పం. మెట్టప్రాంతాలలో అత్యదికం. అందువల్ల రాష్ట్ర సమగ్ర ఇరిగేషన్ అభివృద్ధి ద్వారా రైతాంగ ఆత్మహత్యలు చాలా భాగం నివారించవచ్చును. వ్యవసాయ సంక్షోభం తగ్గించవచ్చును.

అలాగే గతంలో రాష్ట్రంలో తెలుగుదేశం, దేశంలో యన్.డి.ఎ అమలుపర్చిన, వ్యవసాయ అభివృద్ధి వ్యతిరేక ప్రపంచబ్యాంకు విధానాలను కూడా విరమించాలి. వ్యవసాయ సబ్సిడీలు తగ్గించినవి పునరుద్దరించాలి.

రాష్ట్ర ఇరిగేషన్ స్వరూపం

ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం సాగుభూమి 369.48 లక్షల ఎకరాలు కాగా అన్ని రకాల నీటి వనరుల క్రింద సాగు 142.63 లక్షల ఎకరాలు సాగుభూమిలో 38.60 శాతం. ప్రాజెక్టుల క్రింద సాగు 66.92 ల.ఎ. సాగుభూమిలో 18.11 శాతం. వర్షపాతం 944 మి.మీ.

ఉత్తరాంధ్రలో 27.08 ల.ఎ. సాగుభూమి కాగా అన్ని రకాల నీటి వనరుల క్రింద సాగు 11.86 ల.ఎ. సాగుభూమిలో 43.79 శాతం ప్రాజెక్టుల క్రింద సాగు 5.23 ల.ఎ. సాగుభూమిలో 19.31 శాతం. వర్షపాతం 1165 మి.మీ.

దక్షిణాంధ్రలో మొత్తం సాగుభూమి 86.54 ల.ఎ. కాగా మొత్తం సాగునీటి సదుపాయం కల భూమి 56.78 ల.ఎ. సాగుభూమిలో 65.61 శాతం. ప్రాజెక్టుల క్రిందసాగు 40.47 ల.ఎ. సాగుభూమిలో 46.76 శాతం. వర్షపాతం 1034 మి.మీ.

రాయలసీమలో మొత్తం సాగుభూమి 83.30 ల.ఎ. మొత్తం సాగునీరుకల భూమి 22.39 ల.ఎ. సాగుభూమిలో 26.87 శాతం. ప్రాజెక్టుల క్రింద సాగు 8.60 ల.ఎ. సాగుభూమిలో 10.32 శాతం. వర్షపాతం 714 మి.మీ.

దక్షిణ తెలంగాణాలో మొత్తం సాగుభూమి 87.50 ల.ఎ. మొత్తం సాగునీటి సదుపాయం కల భూమి 21.54 ల.ఎ. సాగుభూమిలో 24.61 శాతం. ప్రాజెక్టుల క్రింద సాగు 5.48 ల.ఎ. సాగుభూమిలో 6.26 శాతం. వర్షపాతం 752 మి.మీ.

ఉత్తర తెలంగాణాలో మొత్తం సాగుభూమి 78.87ల.ఎ. మొత్తం నీటి సదుపాయం కలభూమి 30.06 ల.ఎ. సాగుభూమిలో 38.11 శాతం ప్రాజెక్టుల క్రిందసాగు 7.14 ల.ఎ. సాగుభూమిలో 9.05 శాతం. వర్షపాతం 1055 మి.మీ.

ఆంధ్రప్రదేశ్‌లో గత 6 సంవత్సరాలలో 5 సంవత్సరాలు కరువు. కరువులో చెరువలక్రింద సాగు వుండదు. బోరులు, బావులు కూడా కొన్ని ఎండిపోతాయి. ప్రాజెక్టుల క్రింద మాత్రమే సాగునీటి గ్యారంటీ వుంటుంది.

ఐతే కృష్ణానదిపై ఎగువ రాష్ట్రాలు ఆల్‌మట్టి వగైరా ప్రాజెక్టులు నిర్మించటంతో కృష్ణానదిపై ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్టుల క్రింద కూడా గత 2 సంవత్సరాలుగా నీటి కొరత ఏర్పడింది. ఈ కొరత తీర్చాలి.

ఆంధ్రప్రదేశ్‌లో స్వతంత్రానికి పూర్వం తరువాత కూడా కొన్ని ఇరిగేషన్ ప్రాజెక్టులు నిర్మించబడినవి. కొంత ఇరిగేషన్ అభివృద్ధి జరిగినది. ఐతే ప్రధాన కారణం నదీ జలాల సౌలభ్యమే అయినప్పటికి ప్రాంతీయ హెచ్చు తగ్గులు వున్నవి.

దక్షిణ తెలంగాణాలో, రాయలసీమలో ప్రాజెక్టుల క్రింద ఇరిగేషన్ సదుపాయం తక్కువగా వుండటమే కాక, వర్షపాతం కూడా తక్కువే. ఈ ప్రాంతాలు తరచు కరువువాతపడుతున్నవి.

అన్ని ప్రాంతాలలో తరచుగా కరువువాత పడే జిల్లాలు

జిల్లా	మొత్తంసాగునీటిశాతం	ప్రాజెక్టులక్రింద సాగుశాతం	వర్షపాతం
ప్రకాశం	35.38	17.13	872
చిత్తూరు	31.45	2.08	935
కడప	56.59	25.91	700
అనంతపూర్	12.50	5.94	553
కర్నూలు	24.14	13.38	670
మహబూబ్‌నగర్	12.60	1.72	604
మెదక్	21.05	2.33	874
నల్లగొండ	45.46	17.06	751
రంగారెడ్డి	19.36	1.68	781
ఆదిలాబాద్	19.97	3.03	1157
వరంగల్	42.48	0.45	993
విశాఖపట్నం	44.13	19.31	1202
విజయనగరం	52.73	20.02	1131
నెల్లూరు	58.91	21.70	10.80

పై జిల్లాలే కాక ఇతర జిల్లా మెట్ట ప్రాంతాలు కూడా కరువువాత పడుతున్నవి. అందువల్ల నదులపై ప్రాజెక్టుల ద్వారా వర్షపాతం మరియు ప్రాజెక్టుల క్రిందసాగు కూడా తక్కువగావున్న దక్షిణ తెలంగాణా, రాయలసీమ, ప్రకాశం జిల్లాలకు సాధ్యపడిన మేరకు, ముందుగా సాగునీటి సదుపాయం కలుగచెయ్యాలి. అలాగే ప్రాధాన్యతా క్రమంలో పైన తెలిపిన జిల్లాలకు మరియు మొత్తం జిల్లాలలో మెట్ట ప్రాంతాలకు కూడా సాగునీటి సదుపాయం కలగచెయ్యాలి.

సాగునీటి అభివృద్ధికి అంతరాయాలు-అవకాశాలు

రాష్ట్రంలో చిన్న, పెద్ద 40 నదులలో వార్షికంగా 75 శాతం ఆధారంపై 2764 టి.యం.సి ప్రవహిస్తున్నవి. వీటిలో ప్రస్తుతం 1804 టి.యం.సి వినియోగంలో వున్నవి. 292 టి.యం.సి నిర్మాణంలో వున్న ప్రాజెక్టులకు కేటాయించబడినవి. నిర్మించవలసిన ప్రాజెక్టులకు 648 టి.యం.సి వినియోగించే అవకాశం వున్నది.

కృష్ణానదిలో ఆంధ్రప్రదేశ్‌కు బచావత్ అవార్డులో కేటాయించిన 811 టి.యం.సి వినియోగంలో వున్నవి. పెన్నలో 99 టి.యం.సి వినియోగంలో వున్నవి. గోదావరిలో కేటాయించిన 1495 టి.యం.సి లలో 750 టి.యం.సి వినియోగంలో వున్నవి. మిగిలినవి వినియోగానికి ప్రాజెక్టులు నిర్మించాలి. 75 శాతం వినియోగంపై కాక 50 శాతం వినియోగంపై గోదావరిలో సుమారు మరి 1000 టి.యం.సి మరియు కృష్ణ వగైరా నదులలో సుమారు మరి 500 టి.యం.సి వినియోగించే అవకాశం వుంటుంది.

ఈ మిగులు జలాలలో ఇతర రాష్ట్రాల వాటా కూడా పోయినప్పటికి సుమారు మరి 700 టి.యం.సి ఆంధ్రప్రదేశ్ వినియోగించే అవకాశం వుంటుంది.

ఆంధ్రప్రదేశ్‌లో తరచు కరువువాతపడే దక్షిణ తెలంగాణా, రాయలసీమ జిల్లాల ప్రాజెక్టులకు అవసరమైన నీటి సరఫరాకు గోదావరి జలాలు కృష్ణకు తరలించాలి. ఈ అంశం 1951లో ఖోస్లాకమిటి సిఫారసు చేసింది. 1961లో గుల్హతి కమీషన్ సిఫారసు చేసింది. 1970 నుండి 80 వరకు కృష్ణా, గోదావరి జిల్లాల వివాదాల పరిష్కారానికి విచారణ చేసిన బచావత్ ట్రిబ్యునల్ సిఫారసు చేసింది.

గతంలో 2 కమీషన్లు గోదావరి జలాలు కృష్ణా ప్రాజెక్టులకు సుమారు 300 టి.యం.సికి పైగా తరలించాలని సిఫారసు చేసినవి. సోదర రాష్ట్రాల అభ్యంతరాలు వగైరా సమస్యలతో బచావత్ ట్రిబ్యునల్ పోలవరం నిర్మించి కృష్ణాడెల్టాకు 80 టి.యం.సి తరలించే సిఫారసు నిర్దిష్టంగా చేసింది.

ఐతే ఇలా తరలించే నీటిలో 35 టి.యం.సి కృష్ణానదిలో పైరాష్ట్రాలు తమవాటా క్రింద పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్ర జలసంఘం ఆమోదించినప్పటి నుండి వినియోగించుకొనేందుకు ఒడంబడిక జరిగింది. అందువల్ల ప్రస్తుతం తరలించే నీటిలో 45 టి.యం.సి మాత్రమే రాష్ట్రంలో పైన తెలిపిన కరువు ప్రాంత ప్రాజెక్టులకు వినియోగించే అవకాశం వున్నది. ప్రస్తుతం దక్షిణ తెలంగాణా, రాయలసీమ ప్రాజెక్టులకు అవసరమైన నీరు 224 టి.యం.సి. ఈ నీటిని సరఫరా చెయ్యాలంటే గోదావరి నీరు కృష్ణాకు మరి 179 టి.యం.సి తరలించాలి ఎలా?

గోదావరినీరు కృష్ణాకు తరలింపు

గతంలో కమీషన్లు సిఫారసు చసినప్పటికి గోదావరి జలాలు కృష్ణకు తరలించేందుకు పోలవరం తప్ప ఇతర ప్రాజెక్టుల ద్వారా ప్రతిపాదనలు విరమించబడటం చివరికి గోదావరి జలాలు తెలంగాణా జిల్లాల వినియోగానికి కూడా అవసరమైన ప్రాజెక్టులు నిర్మించకపోవటానికి ఒక కారణం, సహజ ప్రవాహానికి (గ్రావిటి ప్రవాహం) అవకాశం లేకపోవటం మరొక కారణం ముంపు కారణాలతో సోదర రాష్ట్రాల వ్యతిరేకత.

సహజ ప్రవాహానికి అవకాశం వున్న శ్రీరాంసాగర్ వద్ద గోదావరిలో నీరు తక్కువగా వుంటుంది. నీరు అత్యధికంగా గోదావరిలో కలిసే

ఉపనదులు ప్రాణహిత, ఇంద్రావతి ప్రాంతాలలో గోదావరి పల్లం, తెలంగాణా భూములు మెరక.

తెలంగాణా ప్రజలు వేచిచూచే ఇచ్చంపల్లి నిర్మిస్తే 3.24 లక్షల ఎకరాలు మునిగిపోతే 1.57 లక్షల ఎకరాలకు సాగునీరు లభిస్తుంది. ఈ ముంపు కూడ మన రాష్ట్రంలో 1.13 లక్షల ఎకరాలవైతే సోదర రాష్ట్రాలు 2.10ల.ఎ. మన రాష్ట్రంలో 65 గ్రామాలు ముంపుకు గురవుతాయి. సోదర రాష్ట్రాలు 164 గ్రామాలు ముంపుకు గురవుతాయి. అందువల్ల సోదరరాష్ట్రాలు ఈ ప్రాజెక్టు నిర్మాణానికి ఆమోదించటం లేదు. ఈ ప్రాజెక్టు 112 మీటర్ల ఎత్తు కాకుండా 95 మీటర్ల ఎత్తులో నిర్మించుకొనమని కేంద్రజలసంఘం సలహా చెప్పింది. అలా ఎత్తు తగ్గించి నిర్మించితే గ్రావిటి ప్రవాహం వుండదు. కాబట్టి ఎత్తిపోతల ఏర్పాటు చేసుకోవటం ఉచితం.

ఈ పరిస్థితులలో చారిత్రికంగా వెనుకపడ్డ తెలంగాణా అభివృద్ధికి గోదావరిజలాలు సరఫరా లక్ష్యంతో రిటైర్డు చీఫ్ ఇంజనీరు డా.కె.శ్రీరామకృష్ణయ్య 1996లో ఎత్తిపోతల పథకాలు రూపొందించారు. ఈ ఎత్తిపోతల పథకాల ద్వారా తెలంగాణాలో 47 ల.ఎ.లకు, రాయలసీమలో 4 ల.ఎ.లకు, సర్కారు జిల్లాలో 10 ల.ఎ.కు సాగునీరు లభిస్తుంది. హైద్రాబాదు పారిశ్రామిక వినియోగానికి 40 టి.యం.సి త్రాగునీటికి 10 టి.యం.సి లభిస్తాయి. గోదావరిపై ఎత్తిపోతల గురించి అంతకు పూర్వం కొందరు ఇంజనీర్సు అభిప్రాయాలు చెప్పినా ప్రాథమికమైన ఇన్వెష్టిగేషన్‌తో డా.కె.శ్రీరామకృష్ణయ్య నిర్దిష్టంగా చెప్పారు.

ఇంతటి బృహత్తరమైన రాష్ట్ర సమగ్ర ఇరిగేషన్ అభివృద్ధికి సోపానమైన ఈ ఎత్తిపోతల పథకం మరియు ఇతర ప్రాజెక్టుల నిర్మాణం అమలు కోసం ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ఆధ్వర్యాన ఉద్యమం నిర్వహించబడింది. అసెంబ్లీ ముందు (ఇందిరాపార్కు) ఆమరణ నిరాహారసత్రం నిర్వహించగా 1999 మార్చి 24వ తేదీన ఈ డిమాండ్సుపై శాసనసభలో రోజంతా చర్చించి అమలుకోసం ఏకగ్రీవంగా తీర్మానించబడినది.

1997లో మేజరు మరియు మీడియం ఇరిగేషన్ ప్రాజెక్టులు నిర్మించరాదనే ప్రపంచబ్యాంకు ఆంక్షలను ఆమోదించిన గత తెలుగుదేశ ప్రభుత్వం రాష్ట్రంలో ప్రజాఉద్యమాల వత్తిడితో నిర్మించేందుకు ఆమోదించిన, శంకుస్థాపనలు చేసిన మేజరు మరియు మీడియం ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణం ప్రక్కన పెట్టబడినది. ప్రపంచబ్యాంకు ఆమోదించిన మైనర్‌స్కీమ్సు, ఇంకుడు గుంటలు వగైరా అమలు పర్చారు. కరువులో భూగర్భజలాలు పైకి రాకపోగా క్రిందకి పోయినట్లు రుజువయ్యింది. ఈ పరిస్థితులలో తమ వైఫల్యం నుండి ప్రజల ఆలోచనను ప్రక్కదారి పట్టించేందుకు రాష్ట్రంలో నదుల అనుసంధానాన్ని ప్రక్కన పెట్టిన పాలకులు గంగా-కావేరి అనుసంధాన పథకాన్ని ప్రచారంలో పెట్టి ప్రజలను మోసగించే ప్రయత్నం చేశారు. రాష్ట్రప్రజలు వాస్తవాలను, మోసాలను అర్థం చేసుకొన్నారు.

రాష్ట్రంలో ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణ పథకం

ఈ పరిస్థితులలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర సమగ్ర ఇరిగేషన్‌కు అవసరమైన 30 ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణం 2 నుండి 5 సంవత్సరాలలో పూర్తి చేసేందుకు ప్రకటించింది. ఈ ప్రాజెక్టుల నిర్మాణానికి రు.46000 కోట్లు ఖర్చు అంచనా ప్రకటించారు. 65 ల.ఎ.ల కొత్తసాగుకు నీరిచ్చేందుకు, 36ల.ఎ. పాతసాగు స్థిరీకరణకు ప్రకటించారు.

డా.శ్రీరామకృష్ణయ్య వెలుగులోకి తెచ్చిన ఎత్తిపోతల ద్వారా దుమ్మగూడెం నుండి ఖమ్మం కృష్ణాజిల్లాలలో నాగార్జునసాగర్ ప్రాజెక్టుల క్రిందసాగుకు 34.50 టి.యం.సి, నాగార్జునసాగర్ టైల్‌ఫాండ్‌కు 118 టి.యం.సి తరలించేందుకు ప్రకటించారు. ఈ 152.50 టి.యం.సి పోలవరం నుండి తరలించే 80 టి.యం.సిలలో ఆంధ్రప్రదేశ్ వాటా 45 టి.యం.సి మొత్తం 197.50 టి.యం.సి ద్వారా దక్షిణతెలంగాణా, రాయలసీమ ప్రాజెక్టులకు చాలాభాగం అవసరమైన జలాలివ్వవచ్చును. తగ్గినకొద్దిభాగం కూడా సమకూర్చేందుకు ఇచ్చంపల్లి ఎత్తు తగ్గించి నిర్మించి ఎత్తిపోతల ఏర్పాటు, పులిచింతల నిర్మాణం ద్వారా ప్రయత్నిస్తున్నారు.

ఐతే గోదావరినీరు కృష్ణాబేసిన్‌కు తరలించటం కోసం నాగుర్జున సాగర్ టైల్‌ఫాండ్‌కు తరలిస్తే, పోలవరం నుండి కృష్ణానదిని తరలించే నీటిలోవాటా ఇవ్వవలసి వచ్చినట్టు ఈ నీటిలో కూడా వాటా పెట్టవలసి రావచ్చునని అలా జరిగితే మన రాష్ట్రానికి తీరని నష్టమని దక్షిణ తెలంగాణా, రాయలసీమ ప్రాజెక్టులకు అవసరమైన నీరు సరఫరా చెయ్యలేమని అందువల్ల టైల్‌ఫాండ్‌కు కాక నాగార్జునసాగర్ ఆయకట్టుకే సరఫరా చెయ్యటం భావ్యమని కొందరు నిపుణులు చెప్పుచున్నారు.

అలాగే ఇచ్చంపల్లి ఎత్తిపోతల ద్వారా తరలించే నీరుకూడా నాగార్జునసాగర్‌కో, శ్రీశైలం ప్రాజెక్టుకో కాక తిన్నగా మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాల ప్రాజెక్టుల క్రింద కాలువలకు తరలించటం సౌలభ్యంగా వుంటుందంటున్నారు. ఈ అంశాలపై రాష్ట్ర ఇరిగేషన్ అధికారులు ప్రభుత్వ అవసరమైన నిర్ణయాలు తీసుకోవాలి.

ప్రస్తుతం ప్రకటించిన ప్రాజెక్టులలో శ్రీరాంసాగర్ మొదటిదశ, రెండవదశ, వరదకాలువలలో లోటు పూడ్చేందుకు ఎల్లంపల్లి ఎత్తిపోతల పథకం కూడా ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ సమగ్ర ఇరిగేషన్ అభివృద్ధికి సోపానమైన ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రాజెక్టులు సకాలంలో ప్రాధాన్యతా క్రమంలో నిర్మించాలి.

రాష్ట్ర ప్రభుత్వం నిర్మించేందుకు ప్రకటించిన ప్రాజెక్టులు

ప్రాజెక్టుపేరు	వినియోగపడే జిల్లాలు	నీటివినియోగం టి.యం.సి	కొత్తఆయకట్టు (ల.ఎ)	పాతసాగు (ల.ఎ)
(1)	(2)	(3)	(4)	(5)
వంశధారస్టేజ-2 పేజ-1	శ్రీకాకుళం	×12.00	0.62	0.00
తోటపల్లి	శ్రీకాకుళం,విజయనగరం	×24.00	1.20	0.6
ఝంఝావతి	విజయనగరం	×4.00	0.24	0.00
పోలవరం	విశాఖ,తూ.గో కృష్ణా, ప.గో	224.00	7.20	0.00
దుమ్ముగూడెం	కృష్ణా, ప.గో	3.00	0.58	0.00
తెలుగుగంగ	నెల్లూరు	12.81	2.54	0.00
సోమశిల	నెల్లూరు	30.00	1.39	2.75
గాలేరి-నగరి	నెల్లూరు	4.00	0.35	0.00
గుండ్లకమ్మ	ప్రకాశం	22.00	1.62	0.00
వెలిగొండ	ప్రకాశం,నెల్లూరు	40.98	4.12	0.00
సర్కారు జిల్లాలు		376.79	19.86	3.39
		48.99%	34.58%	
తెలుగుగంగ	కర్నూలు, కడప చిత్తూరు	16.18	3.21	0.00
గాలేరి-నగరి	కడప-చిత్తూరు	33.90	2.90	0.00
పి.ఎ.బి.ఆర్	అనంతపూర్	10.00	1.00	0.00
హంద్రీ-నీవా	కర్నూలు,అనంతపూర్ చిత్తూరు	40.00	6.05	0.00
చిత్రావతి	కడప 6.40	0.60	0.00	
వెలిగొండ	కడప 2.52	0.25	0.00	
రాయలసీమ		109.00	14.01	0.00
		14.17%	24.39%	
గంగారం	వరంగల్,కరీంనగర్ మెదక్, నల్లగొండ	50.00	5.00	0.00
ఆలీసాగర్	నిజాంబాద్	2.96	0.00	0.53
గుత్పాలిప్ప	నిజాంబాద్	1.90	0.00	0.38
యస్.యల్.బి.సి	నల్లగొండ	39.17	2.70	0.00
శ్రీరాంసాగర్‌స్టేజ-2	వరంగల్, ఖమ్మం నల్లగొండ	24.16	4.40	0.68
శ్రీరాంసాగ్‌వరదకాలువ	కరీంనగర్,వరంగల్	20.00	2.20	0.00
భీమా	మహబూబ్‌నగర్	20.00	2.03	0.04
కల్వకుర్తి	మహబూబ్‌నగర్	25.00	2.50	0.00
నెట్టంపాడు	మహబూబ్‌నగర్	20.00	2.00	0.00
దుమ్ముగూడెం	ఖమ్మం	17.00	2.70	0.00
ఎల్లంపల్లి	వరంగల్, ఖమ్మం కరీంనగర్, నల్లగొండ	63.00	0.00	2.69
తెలంగాణా		283.19	23.53	4.32
		36.82%	40.97%	

గమనిక:-

1. తాడిపూడి-పుష్కర ఎత్తిపోతల పథకాలు పోలవరంలో కలసి పోతాయి కాబట్టి వాటిని కలపలేదు
2. పోలవం నుండి కృష్ణాడెల్టాకు తరలించే 80 టి.యం.సి ల మేరకు నాగార్జునసాగర్‌పై నుండి రావు కాబట్టి కలపలేదు
3. పులిచింతల కృష్ణా డెల్టాకు కేటాయించబడ్డ నీటిలో అంతర్భాగం కాబట్టి కలుపలేదు
4. రామతీర్థం-గురురాఘవేంద్ర స్వామి తెలుగుగంగలో బాగం కాబట్టి కలుపలేదు
5. కె.సి.కెనాల్ మోడరనైజేషన్ కాబట్టి కలుపలేదు
6. దుమ్ముగూడెంలో కృష్ణా జిల్లాలో భాగం సర్కారు జిల్లాలలో ఖమ్మం భాగం తెలంగాణాలో కలిపాను
7. దుమ్ముగూడెం నుండి నాగార్జునసాగర్ ఆయుకట్టుకు తరలించే 34.50 టి.యం.సి మరియు త్రైల్‌పాండ్‌కు తరలించే 118 టి.యం.సి దీనిలో కలపలేదు. ఆవిరినష్టం కూడా కలపలేదు.
8. వెలిగొండలో కడపభాగం రాయలసీమలో కలిపాను
9. తెలుగుగంగ, గాలేరి- నగరిలో నెల్లూరిభాగం సర్కారు జిల్లాలలో కలిపాను
10. ప్రస్తుతం లిటిగేషన్ల నేపద్యంలో పోలవరం నుండి లిఫ్ట ద్వారా నాగార్జునసాగర్‌కు తరలించే భాగం విరమించారు.
11. నాగార్జునసాగర్‌కు తరలింపు భాగం మొత్తంగా దుమ్ముగూడెం ద్వారానే ప్రయత్నిస్తున్నారు.
12. గోదావరి జలాలు కృష్ణాబేసిన్‌కు తరలించటంలో ప్రధానలక్ష్యం దక్షిణ తెలంగాణా, రాయలసీమ ప్రాజెక్టులకు అవసరమైన నీరు కేటాయించటమైనా లీగల్ సమస్యల అంతరాయం, పై రాష్ట్రాలతో ప్రమాదం లేకుండా వుండేందుకు వాటిని వరద జలాలుగానే పరిగణిస్తున్నారు.

హామీలు, శంఖుస్థాపనలతో సాగునీటి ప్రాజెక్టులు పూర్తవుతాయా?

-గాదె దివాకర్,

అఖిల భారత రైతు-కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

గత టి.డి.పి. ప్రభుత్వం దీర్ఘకాలికంగా రాష్ట్రానికి ఉపయోగపడే ముఖ్యమైన సాగునీటి ప్రాజెక్టులు చేపట్టలేదు. కొత్త ప్రాజెక్టులు, పెద్ద ప్రాజెక్టులు చేపట్టరాదనే ప్రపంచబ్యాంకు ఎజెండాని అమలు చేసింది. నేడు అధికారంలోకి వచ్చిన కాంగీ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు గత ఆరు నెలలుగా పదే పదే ప్రకటించింది. రెండు సంవత్సరాల్లో 8 ప్రాజెక్టులు, 5 సం॥రాలలో 18 ప్రాజెక్టులు, మరికొన్ని భారీ ప్రాజెక్టులు నిర్మాణం చేపడతామని ప్రకటిస్తున్నారు. అంతే కాదు, వరుసగా ప్రాజెక్టులు లేని కాల్వలకు, కాల్వలు లేని ప్రాజెక్టుకు, లిఫ్టులు లేని పైపులైన్లకు, అనుమతిలేని ప్రాజెక్టులకు, వేసిన ప్రాజెక్టులకు రెండవసారి, మూడో సారి కొత్తగా శంఖుస్థాపనలతో ఆరు నెలలు గడిపారు. ప్రాజెక్టులకు టెండర్లు పిలిచారు. అవికాస్తా కోర్టు లిటిగేషన్లలో చిక్కి బయటకు వచ్చే సమయంలో అసెంబ్లీ వేదికపై ప్రాజెక్టులు-టెండరు అనే అంశంపై ఎడతెగని చర్చ ప్రారంభం అయింది. ఈ చర్చలలో ప్రాజెక్టుల ప్రాముఖ్యత గుర్తించి కాంగ్రెసు వాదిస్తుండగా, టెండర్లలో వాటాలు, పర్సెంటేజీలు, తదితర అంశాలపై టి.డి.పి చర్చ లేవనెత్తింది. నిజమైన సమాధానం ప్రాజెక్టులు నిర్మాణం పూర్తి చేయడమే తప్ప ఇతర ఏ జిమ్మిక్కులు ప్రయోగించినా అవి నిష్ప్రయోజనమే తప్ప వేరే కాదు.

రాష్ట్ర పరిస్థితి

నేడు రాష్ట్రం వరుస కరువులతో 30-50 మంది నివాస స్థలాలలో పనులు లభించక వలస పోయారు. పోతున్నారు. సాగునీరు లేక భూములు బీడు పట్టి పేద, మధ్య తరగతి రైతులతో సహా వలస పోవలసి వస్తుంది. అకాల వర్షాలు, అనావృష్టి కారణంగా వేసిన పంటలు ఎండిపోతున్నాయి. పంటలు దక్కించుకోవడానికి సాగు నీటికే వ్యక్తిగతంగా రైతులు భారీ స్థాయిలో ఖర్చు చేసి బోరుబావులు తొవ్వుకోవలసి వస్తున్నది. దీనితో పంట దిగుబడి తగ్గి, ఖర్చులు పెరగడం, మార్కెట్‌లో పంటలకు గిట్టుబాటు ధర లభించకపోవుటతో అప్పులపాలయిన పేద, మధ్యతరగతి రైతులు భూములు వదులు కోవడమో, ఆత్మహత్యలకు పాల్పడడమో జరుగుతుంది.

బ్రిటీషు కాలంలోను నుడు కాంగీ, టి.డి.పి. పరిపాలనా కాంలోను సమగ్రమైన నీటి పథకాలు ఏమీ లేకుండానే పరిమిత పరిధిలో పలుకుబడి కలిగిన అధికారంలో ఉన్న రాజకీయ శక్తు సంకుచిత ప్రయోజనాలకు లోబడి ప్రాజెక్టులు కాల్వలు నిర్మాణం జరిగిన కారణంగా, నీటి పంపిణీలో జిల్లాలు, జిల్లాల్లో ఇరిగేషన్ సౌకర్యాలలో విపరీత వ్యత్యాసం పెరిగింది. దీనితో కరువుతో పాటు, ప్రాంతీయ వ్యత్యాసాలు రాగా, ఉద్యమాలు పెరగటానికి దోహదపడింది. కరువులో అధిక మాసం అన్నట్లు టి.డి.పి. పూర్తిగా ప్రపంచ బ్యాంకు షరతుకు లోబడి 9 సంవత్సరాల కాలంలో నీరు-మీరు, ఇంకుడు గంతలు, చెక్ డ్యాములకు భారీగా ఖర్చు చేసి కొత్తగా నీటిని వినియోగంలోకి ఏమీ తీసుకురాలేకపోయింది. ఒక్క భారీ ప్రాజెక్టు నిర్మించలేదు. ఇదే కాలంలో కాల్వ క్రింద సాగు 50 శాతం వరకు తగ్గిపోతుంది. రైతులు వ్యక్తిగతంగా త్రవ్వుతున్న బావుల క్రిందనే సాగు కొంత నిలకడగా పెరిగింది. సాగునీటి వ్యవస్థపై కొంత అవగాహన కలిగించడానికి పరిమితం అవుతున్నాను.

సాగు భూమి

రాష్ట్ర విస్తీర్ణం 678.04 లక్షల ఎకరాలు కాగా సాగు యోగ్యమైన భూమి 413.572 లక్ష ఎకరాలు ఉంది. నేడున్న ప్రాజెక్టు, బావుల, చిన్ననీటి వనరులన్నీ సంపూర్ణంగా వినియోగంలోకి వస్తే, 20972001 ఎకరాలకు నీరు అందించవచ్చు. కానీ ప్రస్తుతం 133 లక్షల ఎకరాల వరకు 98-99లలో నీరందగా 2002-03 నాటికి నికరంగా 90 లక్షల ఎకరాలకు మించి నీరందని స్థితికి చేరింది. అన్ని రకాల నీటి వనరులు వినియోగించుకొన్న సాగుయోగ్యమైన భూమిలో 65 శాతానికి మించి సాగునీరు అందించటం కష్టం అనేది అనేక ఇంజనీరింగు నివేదికలు వ్యక్తం చేస్తున్నాయి. అన్ని జిల్లాల్లో సాగు యోగ్యమైన భూములున్నాయి. కానీ సాగునీటి కొరత కారణంగా ప్రకృతిపై ఆధారపడవలసి వస్తున్నది. ఈ కారణంగా ఒక పంట కూడా గ్యారంటీగా పండించ గలిగే పరిస్థితి లేదు. సారవంతమైన సాగు యోగ్యమైన భూములు భూస్వాముల పరిధి ఉండటమే గాక, రాయలసీమ, తెలంగాణా జిల్లాలో ఈ భూములు ఎక్కువ శాతం భూస్వాముల చేతుల్లో వివిధ రూపాల్లో కేంద్రీకృతం అయినవి.

నీటివనరులు

రాష్ట్రంలోని 23 జిల్లాలో సమాన వర్షపాతం లేదు. ఒక జిల్లాలో

వార్షిక వర్షపాతం 1200మీ. కాక కొన్ని జిల్లాలో 550మి.మీ వరకు పరిమితమయినది. అంతేకాదు పడే వర్షంలో 68 శాతం కేవలం జూన్ నుండి సెప్టెంబరు మధ్య కాలంలో పడుతోంది. ఇది 40 నదుల ద్వారా రాష్ట్ర వ్యాపితంగా ప్రవహించి సముద్రంలో కలుస్తాయి. శ్రీకాకుళం నుండి చిత్తూరు వరకు నదీ వ్యవస్థ సహజ సిద్ధంగా అద్భుతంగా రాష్ట్రం మొత్తంగా అల్లుకొని ఉన్నది. అయితే ప్రధానమైన నీటి వనరులు ఉన్నది గోదావరి, కృష్ణ, పెన్నా. ఈ మూడు నదుల ద్వారానే మనం వాడతగిన నీరు 2403 టి.ఎం.సి.ఎఫ్ కాగా మిగతా 37 నదుల నుండి 356 టి.ఎం.సి.ఎఫ్ నీరు లభిస్తుంది. నేడు వాడుకొంటున్నది అధికార లెక్కల ప్రకారం ఉపరితలం నీరు 2759 టి.ఎం.సి.ఎఫ్‌లో సుమారు 1700 టి.ఎం.సి.ఎఫ్ మాత్రమే. మిగిలిన నీరు సముద్రంలో కలుస్తోంది. ఇందులో ఎక్కువ భాగం గోదావరి నది నుండి వృధా అవుతుంది. మరోవైపు కృష్ణా, పెన్నాలో సకాలంలో నీటి లభ్యత తగ్గింది. అంతే కాదు, నిర్మాణంలో ఉన్న అన్ని ప్రాజెక్టులు పూర్తయితే ఆయకట్టు చివరి భూములకు నీరు లభించేస్థితి ప్రమాదంలో పడుతుంది. నదుల్లో హక్కు కలిగిన, వినియోగించు కోవడానికి వీలైన నీరు ఎక్కువ భాగం గోదావరిలో ఉన్నది. గోదావరి జలాలను రాష్ట్రానికి పూర్తి స్థాయిలో వినియోగించుకునే పథకాలపై కేంద్రీకరించటం ప్రధాన లక్ష్యంగా ఉండాలి. అలా లేనట్లయితే రాష్ట్రంలో సాగునీటి కొరత నుండి బయట పడటం సాధ్యపడదు.

రాష్ట్రంలో భూగర్భజలాలు 1073 టి.ఎం.సి.లు ఉన్నాయి. ఇందులో కాలువల వ్యవస్థ లేని జిల్లాల రైతులు 422 టి.ఎం.సి. బోరుబావు ద్వారా వాడుకుంటున్నారు. మిగతా 651 టి.ఎం.సి. కమాండ్ ఏరియాలో లభ్యమవుతుంది. దీని వాడకం అంతగా ఉండదు. రాష్ట్రం మొత్తంగా నీటిని వినియోగంలోకి తీసుకరావటం, సమాన పంపిణీ చేయటం ద్వారానే కరువు, వెనకబడ్డ ప్రాంతాలను అభివృద్ధి చేయటానికి వీలవుతుంది.

ప్రాజెక్టులు నిర్మాణం- సాధ్యాసాధ్యాలు

రాష్ట్రంలో కృష్ణా నదిలో లభించే నీటికి మించిన ప్రాజెక్టుల నిర్మాణం కొనసాగుతున్నది. అందుబాటులో నీరు ఎక్కువగా ఉన్నది గోదావరి మరియు ఉత్తరాంధ్రాలోని చిన్న చిన్న నదుల్లో మాత్రమే. రాష్ట్రంలో గత టి.డి.పి ప్రభుత్వం ప్రపంచబ్యాంకు ఎజెండాకు లోబడి భారీ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టలేదు. నేడు కాంగ్రెసు ప్రభుత్వం అధికారంలోకి రాగానే రెండు సంవత్సరాల్లో 8 ప్రాజెక్టులు చేపడతామని ప్రకటించారు. అవి వంశధార స్టేజి-2, తాడిపూడి లిఫ్టు ఇరిగేషన్, పుష్కర లిఫ్టు ఇరిగేషన్, సోమశిల, తెలుగు గంగ, గోదావరి లిఫ్టు ఇరిగేషన్, అలీ సాగర్ లిఫ్టు ఇరిగేషన్, గుప్త లిఫ్టు ఇరిగేషన్ ఇవి పూర్తి చేయడానికి 5,776.65 కోట్ల రూ.లు అవసరం. కాగా, 2003-2004కి 2226.63 కోట్ల రూ.లు ఖర్చు చేశారు. ఇంకా 3550 కోట్ల రూ.లు అవసరం. కాగా 2004-2005 సవత్సరానికి ఈ ప్రాజెక్టులు చేసిన కేటాయింపులు 980.76 కోట్ల రూ.లు. ఈ ప్రకారం నిధులు కేటాయించినా, ఈ ప్రాజెక్టులు పూర్తి కావడానికి కనీసం 4 సం॥లు సమయం పడుతుంది. మరో 18 మేజర్ ప్రాజెక్టులు 5 సం॥లలో పూర్తి చేస్తామని ప్రకటించారు. అవి: తోటపల్లి బ్యారేజ్, జంఝావతి, పులిచింతల, రామతీర్థం, బీ.ఆర్., గురురాఘవేంద్ర లిఫ్టు ఇరిగేషన్, కే.సీ కెనాల్ ఆధునికీకరణ జి.ఎన్.ఎస్.ఎస్., హెచ్.ఎన్.ఎస్.ఎస్., చిత్రావతి బీ.ఆర్., ఎస్.ఆర్.ఎస్.పి-2, ఎస్.ఆర్.ఎస్.పి వరదకాలువ, బీమా లిఫ్టు, కల్వకుర్తి లిఫ్టు వెలిగొండ ప్రాజెక్టు, నెట్టెంపాడు లిఫ్టు ఇరిగేషన్ ఇవి మొత్తం పూర్తికావడానికి 20,226 కోట్ల రూ.లు అవసరం. కాగా ఇప్పటి వరకు ఖర్చు చేసింది. 1817 కోట్ల రూ.లు మాత్రమే. 2004-05 బడ్జెట్ 1293.54 కోట్లరూ.లు కేటాయించారు. దీనికి తోడు ఎల్లంపల్లి ప్రాజెక్టుకు కూడా శంఖుస్థాపన చేశారు. నేడు కేటాయింపులు చేసిన విధంగా కొనసాగించినట్లయితే ఈ ప్రజెక్టులు పూర్తికావడానికి 12 సంవత్సరాల సమయం పడుతుంది.

మరో 4 ప్రాజెక్టులు పోలవరం, దుమ్ముగూడెం, గోదావరి, ఎల్లంపల్లి, ఈ నాలిగింటి మొత్తం ఖర్చు 20 వేల కోట్ల రూ.లకు పైగా ఉంటుంది. ప్రభుత్వం చెబుతున్నట్లుగా 30 ప్రాజెక్టులకు 46 వేల కోట్ల రూ.లు అవసరం కాగా, ఈ వార్షిక సంవత్సరంలో 2600 కోట్ల రూ.లకు మించి కేటాయించలేదు. ప్రాజెక్టు కేటాయింపుల కంటే ఖర్చు ఎంత చేయగలుటుతారు? పని ఎంత పూర్తి చేయగలుగుతారనేది? ప్రామాణికం చేసి చూసినట్లయితే అనేక సంవత్సరాలుగా ప్రాజెక్టులకు కేటాయించిన నిధులు ఏనాడూ పూర్తిస్థాయిలో ఖర్చు చేసిన స్థితిలేదు. 8వ ప్లానులో 3660 కోట్ల రూ.లు ఖర్చు చేస్తామని ప్రకటించి, 3400 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. 9వ ప్రణాళికలో 6304 కోట్ల రూ.లు ఖర్చు చేస్తామని ప్రకటించి, 5200 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. 10వ ప్రణాళిక నడుస్తోంది. పదవ ప్రణాళికలో రెండు సంవత్సరాల ఖర్చు విధానం చూసినట్లయితే కేటాయింపులో 60 శాతానికి మించి ఖర్చు చేయలేదు. 2004-05లో మొత్తం ఇరిగేషన్‌కి ప్రణాళికా బడ్జెట్‌గా 4400 కోట్ల రూ.లు కేటాయించినా, లక్ష్యంగా పెట్టుకున్న ప్రాజెక్టుల టెండర్లు వివాదం నుండి బయటపడలేదు. కొన్ని ప్రాజెక్టుల పనులు నడుస్తున్నా, అవి నత్తనడకలోనే కొనసాగుతున్నాయి. ఈ ప్రాజెక్టులు

పూర్తయితే అద్భుతమైన ఫలితాలొస్తాయని కాంగ్రెస్ పార్టీ చేసే వాదనలో వాస్తవం ఉన్నా, ఆటంకాను కూడా పరిగణనలోకి తీసుకోవడం అవసరం. ఈ ప్రజెక్టులలో నీటికీ 16 ప్రాజెక్టుకు ఫారెస్టు క్లియరెన్సులేదు. సెంట్రల్ వాటర్ కమీషన్ అనుమతులు చాలా వాటికి లేవు. అంతరాష్ట్ర వివాదాలు క్లియరెన్సు లేదు. అన్నింటికంటే ముఖ్యమైనది పునరావాస సమస్య. దీనికి తోడు ఆర్థిక వనరులు.

ప్రాజెక్టులు-పునరావాసం

రాష్ట్రంలో నేడు ప్రకటించిన ప్రాజెక్టులు పూర్తవడానికి 5,55,111 ఎకరాల భూమి కావాలి. కానీ ఇప్పటి వరకు సేకరించింది 10 శాతానికి మించి లేదు. చాలా ప్రాజెక్టుల సర్వేలు కూడా పూర్తి కాలేదు. ఈ ప్రజెక్టుల కారణంగా సుమారు వెయ్యి గ్రామాలు మునిగిపోతాయి. వీటన్నింటికీ ప్రత్యామ్నాయ మార్గం చూపెట్టాలి. వ్యవసాయ కూలీలకు ప్రత్యామ్నాయ ఉపాధి, నివాస వనరులు చూపెట్టాలి. పునరావాసానికి సంబంధించిన నిర్దిష్టమైన చర్యలేమీ ప్రకటించలేదు. ఈ కారణంగా భూములు కోల్పోయినా, ఇండ్లు కోల్పోయిన వాళ్లు కోర్టుకెక్కడం సహజం. కోర్టు వివాదాల కారణంగా అనేక కాలువలు, ప్రాజెక్టులు విపరీతం జరిగాయి. బలవంతంగా భూముల నుండి గెంటి వేసి ప్రాజెక్టుల నిర్మాణం చేస్తే 40 సంవత్సరాలైనా పునరావాసం లభించని స్థితి. శ్రీశైలం, నాగార్జున సాగర్, ఏలేరు, సోమశిల ఇంకా అనేక ప్రాజెక్లు నిర్వాసితుల గోడు రోజూ వింటూనే ఉన్నాం. ప్రాజెక్టుల నిర్మాణంలో పునరావాసం ప్రధాన సమస్య. దీనిపై నేటికీ ఈ ప్రభుత్వం నిర్దిష్ట విధానం ప్రకటించలేదు.

ప్రాజెక్టులు-వివక్షత

రాష్ట్రంలో ఏ ప్రాజెక్టులు, ఏ క్రమంలో నిర్మించాలనే విధానపరమైన వైఖరి నేటికీ ప్రభుత్వం ప్రకటించలేదు. కరువు, వెనుకబడిన ప్రాంతాల్లో ఉన్న ప్రాజెక్టుకు ఉన్న ఆర్థిక స్థోమతలో ప్రాధాన్యతనిస్తూ నిర్మాణం చేపట్టడం సమంజసగా ఉంటుంది. ఈ విధంగా తెలంగాణా, రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు ఉపయోగపడే ప్రాజెక్టులకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలి. పులిచింతల లాంటి ప్రాజెక్టు అవసరమైనప్పటికీ చివరి ప్రాధాన్యతనివ్వాలి. మరో విషయం గోదావరి జలాలు భారీ స్థాయిలో వినియోగించుకోవాలంటే గోదావరి నదిపై రిజర్వాయర్లు, లిప్టు ఇరిగేషన్లు అవసరం. అంతే కాదు గోదావరి నీటిని కృష్ణా ఆయకట్టుకు లింకు చేయడం ద్వారా కృష్ణాలో లభ్యమయ్యే నీటిని రాయలసీమ, తెలంగాణా ప్రాంతాలకు వినియోగించుకునే విధంగా కాలువల విధానం రూపొందించటమే సరైన మార్గమని అనేకమంది ఇంజనీర్లు తమ నివేదికల్లో తెలియ చేశారు. అయితే గోదావరి నీటిని కృష్ణాకు లింకు చేయడం ద్వారా నీటి హక్కులు కోల్పోతామని గత టి.డి.పి. కుంటి సాకులు చూపి, గోదావరి నదిపై ప్రాజెక్టుల నిర్మాణాన్ని నిర్లక్ష్యం చేసింది. నేడూ అదే విధానం అనుసరించటం దుర్మార్గమైనది.

మన రాష్ట్రంలోని నీటిపై వాడుకునే హక్కు మనకుండాలి. ఇందుకవసరమైతే చట్టాలు సవరించైనా, హక్కు సాధించుకోవాలి. నీటిపై మనకున్న హక్కును వినియోగించుకోవడానికి అవకాశం లేకపోతే ఏ నాటికీ రాష్ట్రంలోని కరువు, వెనకబడ్డ ప్రాంతాలకు నీటిని అందించటం సాధ్యంకాని విషయం. ఇప్పటికే అనేక పాలకవర్గాలు కుంటి సాకులు చెప్పి సారవంతమైన భూములకు నీరందకుండా చేశాయి.

ప్రాజెక్టులు-ఆర్థికం

రాష్ట్రంలో భారీ ప్రాజెక్టులు నిర్మించడానికి అవసరమైన ఆర్థిక స్థోమత ఉన్నదా అనేది సందేహం. కానీ, ఉన్న నిధులో ప్రియారిటీ, మరియు భారీ ప్రాజెక్టులకు కేంద్రం నుండి నిధులు సాధించడం ద్వారా లక్ష్యాలు సాధించవచ్చు. అంతేకానీ, ఆస్ట్రియా, ప్రపంచబ్యాంకు షరతులకు లోబడి ప్రాజెక్టులను ప్రైవేటీకరణ చేసే విధంగా నిర్మాణం చేపట్టినట్లయితే అవి రైతులకు మరింత భారం కాక తప్పదు. నేడు కాంగ్రెసు పార్టీ ప్రకటించిన అనేక ప్రాజెక్టులలో కీలక విధానాలు ఇముడి వున్నాయి. దుమ్ముగూడెం, సింగారెడ్డి పల్లి, పోలవరం, ఇచ్చంపల్లి, పులిచింతల ప్రాజెక్టులకు విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టులుగా అసెంబ్లీలో ప్రకటించారు. ఈ ప్రాజెక్టులు ఎంతకాలంలో పూర్తి చేసే విషయం, దానికి సంబంధించిన నిధుల వివరాలు స్పష్టంగా లేవు. అంతేగాకుండా ప్రాజెక్టు నిర్మాణంలో మరో తీవ్రమైన లోపం టెండర్లు సకాలంలో పూర్తి చేయకపోవటం. ఈ అన్ని రకాల అవరోధాలను మన పాలకులు అధిగమించి ప్రాజెక్టులు పూర్తిచేస్తే సత్ఫలితాలే వస్తాయి!

ముగింపు

రాష్ట్రంలో ప్రజలు కోరుకునేది "ఇంటర్ నెట్ కాదు" వాటర్ నెట్! గోదావరి జలాలను పూర్తి స్థాయిలో ఉపయోగంలోకి తీసుకురావడం, అందుకు తగిన ప్రాధాన్యతనిచ్చి, నిధులు కేటాయించి, ఖర్చు చేయడం ద్వారా సత్ఫలితాలొస్తాయి. లేనట్లయితే రాష్ట్రం కరువు కాటకాల నుండి, అసమానత నుండి బయటపడటం సాధ్యం కాదు. ఇది అనేక విష పరిణామాలకు దారి తీయక తప్పదు.

శ్రీరాంసాగర్ ఆయకట్టు రైతుల అనుభవాలు

-యం. కోదండరామ్

సాగునీటి సౌకర్యం పెంపొందిన తరువాత గ్రామాల్లో వచ్చిన మార్పులను అర్థం చేసుకొనే లక్ష్యంతో 'గోదావరి వేదిక' బృందం, జమ్మికుంట, కృషి విజ్ఞాన కేంద్రం సహాయంతో శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు ఆయకట్టుదారులతో జమ్మికుంటలోనే ఒక వర్క్‌షాపు నిర్వహించింది. శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టు కాలువ నీరందే (హుజూరాబాద్, జమ్మికుంట, వీణవంక, కమలాపూర్) మండలాలకు చెందిన సుమారు 100 మంది రైతులు సమావేశానికి హాజరయ్యారు.

హాజరైన రైతులు సాగునీరు అందిన తరువాత పంట ఉత్పత్తి, ఉత్పత్తి పద్ధతులు, దిగుబడి, ఆదాయం, పశుపోషణ, తాగునీటి సరఫరా, సాగునీటి సరఫరా యంత్రాంగం, ఆరోగ్య పరిస్థితి, కూలీ అవకాశాలు వంటి అంశాలలో వచ్చిన మార్పులను చర్చించారు.

శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టు నుండి మొట్టమొదట జగిత్యాల, మెట్‌పల్లి ప్రాంతాలకు 20 సంవత్సరాల క్రితమే నీళ్ళు వదిలారు. జమ్మికుంట, హుజూరాబాద్ ప్రాంతాలకు మాత్రము 10 సంవత్సరాల నుండి నీళ్ళు వస్తున్నాయి. నీళ్ళు రావడం వలన ప్రజల జీవన ప్రమాణాలు బాగా పెరిగాయి.

సాగుభూమి విస్తీర్ణం పెరిగింది. దిగుబడి ఎక్కువైంది. కూలీరేట్లు పెరిగాయి. పనులు కూడా దొరుకుతున్నాయి. ఉన్న ఊరివాళ్ళే కాదు, పొరుగూరు వాళ్ళు కూడా పంటల సీజన్లలో కూలి చేసుకొని సంపాదించుకొని పోతుంటారు. గొర్రెలు, మేకలు కొంత తగ్గినా పాడిపశువులు బాగా పెరిగినాయి. వాటి నుండి ఆదాయాలు వస్తున్నాయి. అయితే సాంప్రదాయ వ్యవసాయ పద్ధతులు, పంటలు ఇప్పుడు లేవు. గతంలో ప్రతిరైతు చెరువు క్రింద, బావుల కింద వరి సాగుచేసినా మెట్ట భూముల్లో మొక్క, జొన్న, పప్పు ధాన్యాలు, నూనె గింజలు కూడా పండించేవాడు. ఇప్పుడు పరిస్థితి వేరు. ప్రధానంగా వరి సాగుచేస్తున్నారు. వరితోపాటు, పత్తిపంటను కూడా వేస్తున్నారు. ఇవి రెండు ప్రధానమైన పంటలు. మొత్తం మీద నీళ్ళు వచ్చిన తరువాత ఉత్పత్తి పెరిగింది. రైతులకు కూలీలకు ఆదాయాలు పెరిగాయి. అందువలన రైతులకు ఆత్మస్థైర్యం పచ్చింది. ఎట్లయినా బతకవచ్చుననే ధైర్యం ఏర్పడింది. కాలువలు రాకముందు బావులు పడక, నీళ్ళు చాలక, వర్షాధారం పంటలు పండించుకొనే రోజుల్లో ఆదాయాలు తక్కువగా ఉండేవి. పంట భరోసా ఉండేది కాదు. కాబట్టి బతుకు ఎట్ల గడుస్తదోనన్న భయం ఎప్పుడు వెంటాడుతుండేది. ఇప్పుడు అటువంటి భయాలు లేవు.

చంద్రునిలో మచ్చ ఉన్నట్లు ఈ సాగునీటి వ్యవస్థలో కూడా లోపాలు ఉన్నాయి. శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టు కాలువల, తూముల డిజైన్‌లోనూ లోపాలున్నాయని రైతుల అభిప్రాయం. అసలేం జరిగిందంటే కాలువ నిర్మాణం పూర్తికాకుండానే రాజకీయ అవసరాల రీత్యా నీళ్ళను వదిలారు. దీని వలన కాలువలో పూడిక వచ్చింది. తరువాత పూడిక తీయకుండానే లైనింగ్ చేసినారు. దానితో కాలువల్లో అసమానతలు ఏర్పడినాయి. అదే విధంగా తూముల సైజును కూడా నీటి అవసరంతో నిమిత్తం లేకుండా రూపొందించారు. కొన్ని చోట్ల అవసరమైన దానికన్నా ఎక్కువ, కొన్ని చోట్ల తక్కువ నీళ్ళు పోతున్నాయి.

కాలువల డిజైనింగ్‌లో ఉన్న ఈ లోపాలతో పాటు నీటి విడుదలలో కూడా అనేక లోపాలున్నాయి. ప్రభుత్వం శ్రీరామ్‌నగర్ ప్రాజెక్టు కింద మెట్ట పంటలే సాగుచేయాలంటున్నది. అయితే కాలువల కింద మెట్ట పంటలకు మాత్రమే నీళ్ళు విడుదల చేస్తారన్న విషయం రైతులకు తెలియదు. అయినా లాభసాటిగా దిగుబడి వచ్చే మెట్ట పంటలు లేవని రైతులు అంటున్నారు. కాబట్టి రైతులు వరిసాగు భూమిని చదును చేసి పొలాలుగా మార్చుకొన్నారు.

సమతలంగా మార్చే క్రమంలో కొన్ని సార్లు సారవంతమైన పై మట్టి అడుగున పడిపోయి నేలసారం తగ్గింది. సమతలంగా చేయడానికి ఎంత ప్రయత్నించినా దక్కను పీఠభూమి కాబట్టి పంజాబ్‌లోనో, డెల్టా ప్రాంతాలలోనో ఉన్నట్లుగా సమానంగా చేయడం సాధ్యం కాదు. ఎత్తు పల్లాలు మిగిలిపోతాయి. ఒక పొలానికి నీళ్ళు ఇవ్వాలంటే ఇంకొక పొలం మునుగుతుంది. దీనికితోడు తెలంగాణ భూముల్లో ఎక్కువగా తేమ నిలువదని రైతుల అభిప్రాయం. కాబట్టి ఎత్తున భూములకు చాలినన్ని నీళ్ళు ఇచ్చేసరికి పల్లపుభూములు జాలువారుతాయి.

ఆ విషయాలను అట్లుంచితే నీటి విడుదల పద్ధతిలోనే లోపాలున్నాయి. ప్రభుత్వం కాలువల కింద ఆరుతడి పంటలకే నీళ్ళు

వదులుతున్నది. కానీ రైతులు మొత్తం వరిసాగు చేస్తున్నారు. కాబట్టి వచ్చి నీళ్ళు కింది దాక పోవటం లేదు. టెయిలెండ్ వారికి నీళ్ళు సరిగ్గా అందడం లేదు. అయినా నీళ్ళ దగ్గర శిస్తు వసూలు చేస్తున్నారు.

నీళ్ళ విడుదల కూడా పూర్తిగా రాజకీయమయమైందని రైతులు ఆరోపించారు. నాయకులు బలాబలాలను బట్టి ఒక కాలువలో ఎక్కువ మరో కాలువలో తక్కువ వదులుతుంటారని అన్నారు. ఒక్కొక్కసారి నీళ్ళు రావనుకుని ఆరుతడి పంటలు వేసుకుంటే దిగువ ప్రాంతాల నాయకుల రాజకీయ ప్రయోజనాల కొరకు నీళ్ళు వదులుతారు. దానితో నీళ్ళు ఎక్కువై చేను జాలువారి పంట దెబ్బతింటది.

కాలువ నీళ్ళు ఏ సంవత్సరమైనా ఆగష్టుకు ముందు విడుదల చేయడం లేదు. కానీ అంతవరకు ఆగి విత్తనాలు నాటితే దిగుబడి సరిగ్గా రాదు. మంచి పంట రావాలంటే జూన్, జూలై కల్లా విత్తనాలు అలకాలి. అయితే జూన్, జూలైలో నీళ్ళు వదలరు.

కాబట్టి వసతి ఉన్న రైతులు బావులు తవ్వుకున్నారు. కాలువ నీళ్ళు అందనప్పుడు బావుల నీళ్ళు వాడుకుంటారు. కాలువలు వచ్చిన తరువాత ఆయకట్టు గ్రామాలన్నింటిలోను చెరువుల్లో ఎప్పటికి నీళ్ళు ఉంటున్నాయి. కొన్ని గ్రామాల్లో కాలువల ద్వారా చెరువుల్లోకి నీళ్ళను వదులుతున్నారు. మరికొన్ని చోట్ల పొలాలనుండి మిగులు నీరు చెరువులోకి పారుతున్నది. మొత్తానికి అన్ని గ్రామాల్లో చెరువుల్లో నీళ్ళు ఉంటున్నాయి. దాని వలన బావుల్లో నీటిమట్టం పెరిగింది. ఈ విధంగా శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టు ఆయకట్టులో కాలువ నీటితో బావుల నీటినీ వాడుతున్నారు. కాకపోతే బావుల్లో ఎప్పటికీ నీళ్ళుంటున్నాయి. అయితే బావి కల రైతులు ముందుగా పంట వేస్తారు. అది లేనివాళ్ళు ఆలస్యంగా విత్తనాలు వేస్తారు. ఫలితంగా మొదలు వేసింది కోతకొస్తది. వెనుక వేసిన పంట నాట్లకు వస్తది. మొదట వేసిన వారు నీళ్ళు ఆపాలంటారు. తరువాత వేసిన వారికి నీళ్ళు కావాలంటారు. రెండు భిన్నమైన సాగువ్యవస్థల వలన ఈ సమస్యలు తలెత్తుతున్నాయి.

రైతులు చెప్పిన విషయాలు బట్టి చూస్తే కాలువల ఆయకట్టు ప్రాంతాల్లో రైతులకు పంటల ఎంపికలో ఎక్కువ స్వేచ్ఛ ఉండదు. అందరు ఒక పంట వేస్తే, ఒకరైతు వేరేపంట వేయరాదు. ఎందుకంటే పొలాలల్లో నీళ్ళు నిలిచి జాలువారి చేలు దెబ్బతింటాయి. ఈ పరిస్థితి వల్లనే రైతులకు ఇష్టమున్నా లేకపోయినా వరిపంటనే వేస్తున్నారు. అయితే చాలా సంవత్సరాలుగా వరిసాగు చేయడం వలన పొలాలలో ఎప్పటికి నీళ్ళు నిలువ ఉండటం వలన భూసారం తగ్గింది. దిగుబడి గత రెండు-మూడు సంవత్సరాలలో బాగా పడిపోయింది.

మొత్తం ఈ విషయాలన్నీ వివరించిన తరువాత ఈ సమస్యలు పునరావృత్తం కాకుండా ఉండటానికి తీసుకోవలసిన జాగ్రత్తల గురించి సూచనలు చేయమని గోదావరి వేదిక బృందం సమావేశానికి వచ్చిన రైతులను అడిగింది. రైతులు ఏకకంఠంతో ఇచ్చిన సలహాలు ఇలా ఉన్నాయి.

1. పూర్తిగా వరిసాగు చేయడం మంచిదికాదని అన్నారు. అయితే వరికి ప్రత్యామ్నాయంగా మరే ఇతర పంట కనిపించడం లేదు. పత్తి, మిర్చి పంటలకు పెట్టుబడి ఎక్కువ. పంట దెబ్బతింటే, విపరీతమైన నష్టం వస్తుంది. కాబట్టి వాటివైపు అందరు రైతులు మొగ్గు చూపడం లేదు. కనుక ప్రత్యామ్నాయం ప్రశ్నగానే మిగిలింది.
2. నీటి వాడకాన్ని బట్టి శిస్తు వసూలు చేయాలి. తద్వారా కాలువ హెడ్ వద్ద నీటిదుబారాను నివారించవచ్చును. దిగువన నీళ్ళు రాని రైతులకు శిస్తు తప్పుతుంది.
3. పూర్తిగా కాలువలద్వారా నీళ్ళివ్వడం కన్నా చెరువులను నింపి నీటిమట్టం తగ్గకుండా సరఫరా చేయగలిగితే బావుల్లో ఊట కూడ పెరుగుతుంది. తద్వారా అటు చెరువుల నుండి ఇటు బావుల నుండి తోడుకొని నీళ్ళను వాడకోవచ్చును. దీని వలన రైతుకు నీటి వాడకంపై నియంత్రణ ఉంటుంది. పూర్తి వందరు భూమిలోనైతే అనివార్యంగా వదిలేసినా రైతులు ఇతర భూముల్లో పంటల ఎంపికలో స్వేచ్ఛ ఉంటుంది.
4. నీరు విడుదల చేసే ఇరిగేషన్ శాఖకు వ్యవసాయ శాఖకు సమన్వయం ఉండాలి. ఇరిగేషన్ శాఖ ఏ పంటకు, భూమిని పట్టి ఎన్ని నీళ్ళు అవసరమో వ్యవసాయ శాఖనుండి తెలుసుకోవాలి. అదేవిధంగా పంటలకు నీళ్ళు ఎప్పుడు వదలాలి, ఎప్పుడు ఆపాలి అన్న విషయాలలో కూడా వ్యవసాయ శాఖ సూచనలను పాటించాలి.
5. నీటి విడుదలలో రాజకీయ జోక్యాన్ని నివారించాలని సూచించారు. అందుకుగాను నీటి విడుదలను స్వయంప్రతిపత్తి గల బోర్డుకు అప్పగించారు.

ఈ విధంగా శ్రీరామ్‌సాగర్ రైతుల అనుభవాలు భవిష్యత్తులో నిర్మించే ప్రాజెక్టుల విషయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు స్పష్టంగానే వ్యక్తం చేస్తున్నాయి.

ప్రాజెక్టు నిర్వాసితుల బాధలు-పునరావాస విధానాలు

-ప్రొ॥ కె.ఆర్. చౌదరి

రాష్ట్రంలో అనేక సాగునీటి ప్రాజెక్టులను భారీ వ్యయంతో చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో నిర్వాసన, పునరావాసం ప్రాముఖ్యతను సంతరించుకుంటోంది. సాగునీటి ప్రాజెక్టులే కాక విద్యుత్ ప్రాజెక్టులు, పరిశ్రమలు, విమానాశ్రయాలు, గనుల తవ్వకం మొదలైన కార్యక్రమాలన్నీ 'అభివృద్ధి' పేరిట చేపట్టడం జరుగుతోంది. ఇవన్నీ కూడా 'అభివృద్ధి'కి దోహద పడుతాయనటంలో సందేహం లేదు. ఉపాధి సౌకర్యాలు పెరుగుతాయి. సేవలు అభివృద్ధి అవుతాయి. ప్రజల జీవితాల్ని మెరుగుపరుచుతాయి. కానీ, అభివృద్ధి పేరిట జరిగే ఈ తతంగంలో వేలాది మంది ప్రజలను తమ నివాసాల నుండి పెకలించివేస్తున్నారు. తమ తమ గ్రామాల నుండి, ప్రాంతాలనుండి తరిమివేయబడుతున్నారు.

అభివృద్ధి రథ చక్రాల కింద జనం నలిగిపోతున్నారు. కొంతమంది అభివృద్ధి కోసం, మరికొంతమంది జీవితాలను ఛిన్నాభిన్నం చేయడంలో మానవీయత లోపిస్తున్నది. సామాజిక, పర్యావరణ రంగాలపైన ప్రాజెక్టుల యొక్క ప్రభావాన్ని గురించి లోతుగా అధ్యయనం జరుగలేదనే చెప్పాలి. కొన్ని ప్రాజెక్టుల వల్ల జరిగిన నిర్వాసన, పునరావాస కార్యక్రమాలను గురించి కొన్ని అధ్యయనాలు వెలుగు చూసిన మాట వాస్తవమే. ఏ ప్రాజెక్టు చరిత్ర చూసినా, నిర్వాసితుల గోడు ఒకే విధంగా ఉంది. పునరావాసం నామ మాత్రంగా ఉంది. నిర్వాసితుల జీవితాలు దయనీయంగా ఉన్నాయి. సమాన హక్కులు, సామాజిక న్యాయం హరించి వేయబడినాయి.

నిర్వాసన ప్రాంతాల్లో లేదా సాగునీటి ప్రాజెక్టులయితే, మునక గ్రామాల్లో, ప్రజలు మొట్ట మొదటగా తమకు జీవనాధారంగా ఉన్న భూమిని కోల్పోతారు. రైతులు, వ్యవసాయ కూలీలు, వ్యవసాయం పైన పరోక్షంగా ఆధారపడిన తదితర ప్రజలు భూమిని కోల్పోవడం ద్వారా తమ ఉపాధిని కోల్పోతారు. కూలీలకు ఉపాధితో పాటు వేతనాలు, ఆదాయాలు తగ్గిపోతాయి. రైతులకు వ్యవసాయోత్పత్తి, ఆదాయాలు మృగ్యమవుతాయి. నిర్వాసితులు తమ నివాసాలను (ఇళ్ళను) వదలుకోవాలి. దారిద్ర్యంలోకి నెట్టి వేయబడుతారు. ఆహార భద్రతకు విఘాతం ఏర్పడుతుంది. ప్రజల్లో అనారోగ్యం ప్రబలిపోతుంది. మునక గ్రామాల పరిసరాల్లో లేదా కొత్తగా పునరావాసం కల్పించిన గ్రామాల్లో మలేరియా, ఫైలేరియా, మొదలైన రోగాలు జనాన్ని పీడిస్తాయి. సామూహిక వనరులపైన జనానికి అందుబాటు తప్పిపోతుంది. ప్రజలు నిస్సహాయులయిపోతారు. తమ హక్కుల కొరకు పోరాడే పటిమ ఉండదు. నిర్వాసితులు తరతరాలుగా నివసిస్తున్న తమ ప్రాంతాల నుండి వెళ్ళిపోవటంలో మానసికంగా ఆందోళనలకు గురి అవుతారు. కుంగిపోతారు. ఆయా ప్రాంతాలలో ముడిపడి ఉన్న తమ సాంస్కృతిక జీవితాలకు తెరపడుతుంది. ఒక్క మాటలో చెప్పాలంటే వారి జీవితాలు ఛిన్నా భిన్నమవుతాయి.

కొందరి అభివృద్ధికోసమో, సంక్షేమం కోసమో త్యాగాలు చేసిన నిర్వాసితులకు పునరావాసం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉన్నది. అయితే ప్రభుత్వం ఈ విషయంలో ఘోరంగా విఫలమయింది. చాలాచోట్ల ఏదో కొంత నష్టపరిహారం చెల్లించి చేతులు దులుపుకుంది. సామాజిక కార్యకర్తలు, రాజకీయ పార్టీలు, నిర్వాసితుల ఉద్యమాల ఫలితంగా, పునరావాస కల్పనలో కొంత ప్రగతి కనబడుతోంది. పునరావాస విధి విధానాన్ని కేంద్ర ప్రభుత్వం రూపొందించింది. ఈ విధానంలో కూడా అనేక లొసుగులున్నాయి. నిర్వాసితుల బాధలు తీర్చేవిగా లేవు. అందువల్ల పునరావాస విధానంలో మార్పులు రావాలి. నిర్వాసితులకు అనుకూలంగా కచ్చితంగా పునరావాస కార్యక్రమాలను అమలు చేయాలి.

భారీ నీటి ప్రాజెక్టులస్థానే చిన్ననీటి, మధ్య తరహా ప్రాజెక్టులను కట్టి, నిర్వాసన తగ్గించడానికి గల అవకాశాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిశీలించడం అవసరం. భూసేకరణ చట్టం 1894 ప్రకారం భూసేకరణ జరుగుతోంది. 95 శాతం ప్రజలకు చట్టంలోని వివిధ నిబంధనలు తెలియవు. చట్టమే దోపిడీకి దోహదపడుతోంది. చట్టాన్ని గురించి విస్తృతంగా ప్రచారం చేయాల్సిన అగత్యముంది. నష్టపరిహారం న్యాయంగా ఉండాలి. నష్ట పరిహారం ప్రస్తుత మార్కెట్ రేటును బట్టి నిర్ణయించాలి. ఎప్పుడో చేసిన భూసేకరణ ప్రకటన తేదీ నాటి రేటును బట్టి చేయకూడదని నిర్వాసితులు కోరుకుంటున్నారు. నష్టపరిహారం నిర్ణయించడంలో పారదర్శకత ఉంటే, కొంతవరకు అన్యాయాన్ని తగ్గించవచ్చు. దఫదఫాలుగా కాకుండా ఒకే దఫాలో నష్టపరిహారం యొక్క మొత్తం చెల్లించితే, నిర్వాసితులు ఆ మొత్తాన్ని సద్వినియోగం చేసుకోగలరు. భూమి తదితర ఆస్తులు సంపాదించుకునేందుకు నష్టపరిహారం ఉపయోగపడుతుంది. నష్టపరిహారం చెల్లింపులో ఏ మాత్రం జాప్యం కూడదు. దళితులు, తదితరులకు పంచిన బంజరు భూములకు, కూడా నష్టపరిహారం ఇవ్వాలి. ఎన్నో ఏళ్ళుగా భూమిని అభివృద్ధి చేసుకొని సాగుచేసుకుంటున్న నిరుపేద రైతాంగానికి ఆ భూములకు

నష్టపరిహారం ఇవ్వకపోవడం చాలా అన్యాయం. గ్రామాలనుండి జనాన్ని తరలించడం సున్నితమైన విషయం. చాలా జాగ్రత్తగా వ్యవహరించాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉంది.

నిర్వాసితులైన ప్రతికుటుంబానికి ఐదు ఎకరాల చొప్పున కొత్తగా ప్రాజెక్టుల కింది ఆయకట్టు ప్రాంతంలో విధిగా ప్రభుత్వం వ్యవసాయ భూమిని ఇవ్వాలి. ప్రాజెక్టు నీళ్ళు ఇవ్వకముందు రైతుల పొలాలన్నీ మెట్ట భూములే. మెట్ట పంటల దిగుబడులు తక్కువే. భూమి ధర కూడా చాలా తక్కువ. ప్రాజెక్టు నుండి సాగునీటిని ఈ భూములకు అందించిన వెంటనే, పంటల దిగుబడులు పెరుగుతాయి. భూమి ధర ఎన్నో రెట్లు పెరుగుతుంది. కాబట్టి, సాగునీటిని వాడుకోవాలంటే, భూకామందు తన భూమిలో కొంత భాగాన్ని (దాదాపు 40 శాతం), ఉచితంగా ప్రభుత్వానికి ఇవ్వాలి. అలా సేకరించిన భూమిని సర్వస్వం కోల్పోయిన నిర్వాసితులకు ప్రభుత్వం పంచాలి. నష్టపరిహారం కాకుండా సాగుభూమిని ఇస్తే, నిర్వాసితుల జీవితాలకు భద్రత ఏర్పడుతుంది. భూమితోపాటు వ్యవసాయానికి అవసరమైన ఉత్పాదకాలు, రుణసదుపాయం కల్పించినప్పుడే నిర్వాసిత రైతు వ్యవసాయాన్ని సాగించగలడు.

ఇంటికి నష్టపరిహారం కాకుండా, ఒక లక్ష రూపాయల ఖర్చుతో ఇల్లు కట్టించి ఇస్తే, కొత్త ప్రదేశంలో నిర్వాసితులకు అనుకూలంగా ఉంటుంది. పునరావాసం కల్పించిన ప్రాంతంలో అన్ని సదుపాయాలు కల్పించాలి. తాగునీరు, పారిశుధ్యం, పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు, రోడ్లు, కరెంట్, చౌక దుకాణాలు, మొదలైన సదుపాయాలను ఏర్పాటు చేయాలి. పోస్టాఫీసులు, టెలిఫోన్, బ్యాంకులను పునరావాస ప్రదేశాలకు అందుబాటులో నెలకొల్పాలి.

ప్రధానంగా పునరావాస ప్రాంతాల్లో నిర్వాసితులకు ఉపాధి సౌకర్యాలు కల్పించాలి. ప్రతి నిర్వాసిత కుటుంబంలో ఒక వ్యక్తికి ప్రభుత్వ రంగంలో ఉద్యోగమివ్వాలనే నిబంధనను ఏ ప్రభుత్వమూ అమలు చేయటం లేదు. దీన్ని కచ్చితంగా అమలు చేసి నిర్వాసితులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. నిర్వాసితుల నైపుణ్యాన్ని పెంచడానికి శిక్షణా కార్యక్రమాలను అమలు జరపాలి. వ్యవసాయేతర వృత్తులను ప్రోత్సహించాలి. అవసరమైన ముడి సరుకులు, సాంకేతిక పరిజ్ఞానంతో పాటు రుణసదుపాయం కల్పించి, మార్కెటింగును బలోపేతం చేయాలి. పశుపోషణ, ముఖ్యంగా, పశువులు, మేకలు, గొర్రెల పెంపకాన్ని అన్ని విధాలా ప్రోత్సహించాలి.

పునరావాస ప్రదేశాల్లో సామాజిక వనరుల అభివృద్ధి, ఈ వనరుల అందుబాటు ప్రజల అభివృద్ధి ఇతోధికంగా సహాయపడతాయి. సామాజిక సంబంధాలు, సంస్థలు, ఆచార వ్యవహారాలను పునరుద్ధరించి ప్రజల జీవితాల్లో శూన్యం లేకుండా చేయడం సామాజికంగా అవసరం.

ప్రాజెక్టు నిర్మాణం చేపట్టకముందే, పునరావాసం పూర్తి చేస్తే, నిర్వాసితులకు కష్ట, నష్టాలుండవు. పునరావాసమంటే ఏదో కొంత నష్టపరిహారం చెల్లించి, కొన్నిచోట్ల ఇళ్ళ స్థలాలు చూపించడం కాదు. పునరావాసం అంటే, నిర్వాసితులకు మెరుగైన జీవితం గడపడానికి సకల సదుపాయాలు, అవకాశాలు కల్పించడమే. ప్రభుత్వం పునరావాసం కల్పించడానికి ఒక ప్రత్యేకమైన విభాగం ఏర్పాటు చేసి, పునరావాస కార్యక్రమాన్ని సంపూర్ణంగా, సత్వరంగా పూర్తి చేయాలి. ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించడానికి ఒక పర్యవేక్షణ కమిటీని ఏర్పాటు చేసి, ఈ కమిటీకి తగిన అధికారాలు ఇవ్వాలి. పునరావాస అమల్లో ఏదైనా అవకతవకలుంటే, వాటిపైన ఫిర్యాదు చేయడానికి ముగ్గురు హైకోర్టు జడ్జీలతో ఒక 'ట్రిబ్యునల్ అథారిటీని' ఏర్పాటు చేస్తే, నిర్వాసితులకు సత్వరం న్యాయం జరిగే అవకాశముంటుంది. వీరి తీర్పుకు ప్రభుత్వం కట్టుబడి ఉండాలి.

ప్రాజెక్టు ఖర్చులు, కలుగబోయే ప్రయోజనాల అంచనాల్లో సహేతుకత లోపించింది. కలుగబోయే ప్రయోజనాలను ఎక్కువ చేసి చూపించడం, ఖర్చులను తగ్గించి చూపడం జరుగుతోంది. ప్రాజెక్ట్ నిర్మాణపు ఖర్చుతోపాటు సంపూర్ణ పునరావాసంపై అయ్యే ఖర్చును కూడా మొత్తం ప్రాజెక్ట్ ఖర్చులో కలిపి లెక్కించాలి. ప్రాజెక్ట్‌లో మునిగిపోయే మొత్తం ప్రజల ఆస్తులతో పాటు సామాజిక ఆస్తులు వనరులు, అడవులు, తదితర ప్రకృతి వనరులు, దేవాలయాలు, పురాతన కట్టడాలు మొదలైన వాటిపట్ల సంభవించే నష్టాలను కూడా ఖర్చులో కలపాలి. పర్యావరణానికి కలుగబోయే నష్టాల్ని, వాటిని నిరోధించడానికయ్యే ఖర్చును కూడా ప్రాజెక్ట్ ఖర్చులో చేర్చాలి. భవిష్యత్‌లో కలుగబోయే నష్టాలు ముఖ్యంగా, నేలలు ఉప్పుదేలి పోవటం, ప్రాజెక్టుల్లో పూడిక, మొదలైన వాటిని కూడా అంచనావేసి ప్రాజెక్ట్ ఖర్చుల్లో చేర్చాలి. మురికి కాలువల నిర్మాణ ఖర్చులు కూడా లెక్కించాలి. ఈ విధంగా లెక్కించిన ఖర్చులతో, ప్రాజెక్ట్‌వల్ల లాభించే వాటిని కూడా లెక్కవేసి, బేరీజు వేయాలి. ప్రజలకు ఈ వివరాలను చెప్పాలి. ప్రాజెక్ట్ చేపట్టడానికి ముందే 'ప్రజా నివేదనలు' ఏర్పాటు చేసి, ప్రజల అభిప్రాయాలను సేకరించాలి. తదనుగుణంగా చర్యలు తీసుకోవాలి.

పునరావాస ప్రాంతాల్లో ప్రజలకు జీవన భద్రత కల్పించాలి. సాంప్రదాయ వృత్తులను మరింత నైపుణ్యంతో కొనసాగించేలా సహాయ పడాలి. అవసరమైన శిక్షణతోపాటు రుణసదుపాయాన్ని కల్పించి కొత్త వృత్తులను వారికి కల్పించాలి. ప్రత్యామ్నాయ జీవనాధారాలను నిర్వాసితులకు అందుబాటులోకి తేవాలి. ప్రాజెక్టులవల్ల నిర్వాసితులైన వారు, నిర్వాసనకు గురి కాబోయే వారు వారికి అనుకూలంగా ప్రజాభిప్రాయాన్ని కూడగట్టాలి, మద్దతును సంపాదించుకోవాలి. వారి హక్కుల సాధనకై ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలి. అప్పుడే వారి సమస్యలు పరిష్కారమవుతాయి. వారి బాధలు తగ్గుతాయి.

'పునరావాస కల్పనలో' నేటి నవాబుల కన్నా, నాటి నైజాంలే నయం!

-డా॥ కె. ముత్యంరెడ్డి
(అర్థికశాస్త్ర సహాయ ఆచార్యులు, ఉస్మానియావిశ్వవిద్యాలయం)

"ఒకరి 'అథ:గతి', మరొకరి ఉన్నతికి కారణం కారాదు. ఇది అతి సర్వసాధారణమైన సహజన్యాయ నిబంధన..కానీ ఈ సహజన్యాయ గొంతు నొక్కేసి వర్గ ప్రయోజనాలను కాపాడుకోవడమే పాలకవర్గ నీతిగా ఇటీవల చెలామణీ అయిపోతుంది. ఈ కారణంగానే సరిగ్గా 20 సంవత్సరాల క్రితం ఒక అమెరికా కంపెనీ, భోపాల్ పట్టణంలో విషవాయువులను జిమ్మి వేలాది మందిని పొట్టన పెట్టుకుని, అసంఖ్యాకంగా అమాయకులను అవిటి వారిని చేసేసినా, బాధితులకు పునరావాసకల్పన మాట దేవుడెరుగు, కనీసం ఆ కంపెనీ వాడ్ని కోర్టుకు కూడా రప్పించలేక పోయాయి మన ప్రభుత్వాలు. అలాగే సర్దార్ సరోవర్ రిజర్వాయర్ నిర్మాణ సందర్భంగా నర్మదా బబావత్ ఆందోళన. ఈ ఆందోళనలో ప్రధానాంశం.. ఈ భారీ ప్రాజెక్టు నిర్మాణ కారణంగా, ఆయా ప్రాంతాల్లో ప్రకృతిని నమ్ముకుంటూ జీవనం వెళ్ళదీస్తున్న ఆదివాసుల పునరావాస కల్పనే. ఈ ప్రాజెక్టు వలన 85 వేల కుటుంబాలు నిర్వాసిత మౌతున్నాయని తెలిసి కూడా, వీరి 'పునరావాసం' కోసం ఆలోచించకుండా ప్రపంచ బ్యాంకు రుణాలకోసం వెంపర్లాడిన సంగతి మనకందరకూ తెలిసిందే. 'సంస్కరణ'ల పేరిట సాగుతున్న 'లోగుట్టు' ఇదే. ఓ ప్రజాసంక్షేమ ముసుగుతో ప్రపంచబ్యాంకు రుణాలకై వెంపర్లాడటమే. సమస్యంతా అప్పు తీర్చేనాటికి కదా అన్న వక్ర ఆలోచనే ఇందుకు మూల హేతువు.

ప్రజాహితం కోసం ప్రభుత్వం చేపట్టిన ఓ కార్యక్రమం ద్వారా నిర్వాసితులయిన వారికి, వారి ఆర్థిక అభివృద్ధి కుంటుపడని రీతిన ఉత్తమ ఆదాయ ప్రత్యామ్నాయ మార్గాలను చూపాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. అయినా పునరావాసకల్పనా విషయంలో నిర్థిష్టమైన మార్గదర్శక విధానాల ప్రస్తావన ఎక్కడాలేదు. మన చట్టాల్లో కానీ రాజ్యాంగంలో కానీ. ఈ కారణంగానే 'పునరావాసం' పాలకుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి పోయింది. ఈ పునరావాస కల్పన విషయంలో నేటి పాలకుల కన్నా, నేటి నవాబులే అత్యంత బాధ్యతా యుతంగా నిర్వాసితుల వసతి కల్పనకు కృషి చేశారన్న సంగతి అవగతమౌతుంది. అదెలాగో చూద్దాం!

అభివృద్ధి, ప్రగతి పేరిట పాలకులు చేపడుతున్న పథకాలు లక్షలాదిమందిని నిర్వాసితులను చేయడం జరుగుతూనే వుంది. వునికిలోవున్న జన జీవనాన్ని ఛిన్నాభిన్నం చేసేసి, కొత్త జీవనానికి బాటవేయడం అన్న మాట. దీంతో నష్టపోయినవారు, లాభపడినవారు అనే రెండు మార్గాలు ఉనికిలోకి వస్తాయి. తన ఆవాసాలను కోల్పోయి, పొట్టచేత్తో పట్టుకుని వలసపోయే వారు ఒకరైతే, నూతన ఆయకట్టు, పారుదలా ప్రాజెక్టుల ఫలితాలు అనుభవంలోకి వచ్చిన వారు పారిశ్రామిక వేత్తలు, అధికార వర్గాలు, కాంట్రాక్టర్లు మరో వర్గంగా ఈ అభివృద్ధిని అనుభవిస్తారు. మరీ నిర్వాసితులకు కనీసం ఆనాటి వరకూ వారు అనుభవించిన జీవనస్థాయినైనా కల్పించాలని పాలకులు భావించకపోవడం శోచనీయం. కనీసం గత కాలపు పాలకులు చేపట్టిన పునరావాస విధానాలను గమనించైనా, ప్రస్తుత పాలకులు పునరావాస కల్పన విషయంలో ఏఏ అంశాలను పరగణనలోకి తీసుకోవాలో తెలుసుకుంటారన్నదే అభిమతం.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడడానికి ముందు

చాలా అభివృద్ధ పథకాలు నైజాం రాజుల పాలనలో చోటు చేసుకున్నాయి. నవాబ్ అలిజంగ్ బహదూర్ నీటిపారుదలా అభివృద్ధి శాఖను 1886లోనే ప్రారంభించారు. తుఫాన్‌ల రాకలు..ప్రజా ఇక్కట్లను పర్యవేక్షించే లక్ష్యంతో 1925 నాటికి ఈ నీటిపారుదలా అభివృద్ధిశాఖా ఆధ్వర్యంలో సుమారు ఏడువేల ఎకరాలకు చిన్న నీటిపారుదలా పథకాల ద్వారా అందివ్వగలిగారు. భారీ, మధ్యతరహా ప్రాజెక్టుల నిర్మాణం సేద్యాభివృద్ధికి మరింత అవసరమని గ్రహించి ఆ దిశగా ప్రయత్నాలను ప్రారంభించారు. ఆ వెలుగులోనే నిజాంసాగర్, తుంగభద్ర ప్రాజెక్టులకు రూపకల్పన జరిగింది. నైజాం, బ్రిటీష్ పాలకుల ఆధ్వర్యంలో ఈ ప్రాజెక్టుల నిర్మాణం జరిగింది. తెలంగాణా ప్రాంతంలో తుంగభద్ర ప్రాజెక్టు నిర్మాణం వలన నిర్వాసితుల పునరావాస కల్పనకోసం నాటి నైజాంలు ఏం చేసారన్నది మనం

పరిశీలిద్దాం!

నైజాం సాగర్:

1923-31 మధ్యకాలంలో హైదరాబాద్ నైజాం పాలకుల నేతృత్వంలో నిర్మించబడింది. నిజామాబాద్ జిల్లా బన్సువాడ తాలూకాలో గోదావరినదిపై నిర్మించారు. ఆనాడు ఈ ప్రాజెక్టు దేశంలో అతి పెద్ద ప్రాజెక్టుల్లో ఒకటిగా గణతికెక్కింది.

ఈ ప్రాజెక్టు నిర్మాణం కారణంగా రెండు తాలూకాలకు చెందిన 40 గ్రామాలకు ముంపు ప్రమాదం ఏర్పడి, ఖాళీ చేయబడ్డాయి. 5037 ఇళ్ళు ఖాళీచేయబడ్డాయి. 20140 ఎకరాల విస్తీర్ణం సేద్యపు భూములను ప్రజలు వదులుకోవాల్సి వచ్చింది.

నాడు చేపట్టిన 'పునరావాస కల్పనా విధానం':

నిర్వాసితుల నష్టాలను భర్తీ చేసేందుకు నాటి పాలకులు భౌతిక పునరావాస ప్రక్రియ (ఫిజికల్ రెహబిలిటేషన్ మెథడ్)ను చేపట్టారు. నిర్వాసితులు నిలదొక్కుకునేందుకు గానూ నష్టపోయిన సేద్యపు భూములకు బదులుగా భూములు, గ్రామానికి ప్రతిగా, గ్రామ నిర్మాణం ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు.

పునరావాస కల్పనలో వారు చేపట్టిన నిబంధనలు:

1. నిర్వాసితులకు కాలువ కింది భూములనే కేటాయించాలి
2. నూతన గ్రామ నిర్మాణానికి అనువైన స్థల కేటాయింపు
3. ఇంటి నిర్మాణ సామాగ్రిని నిర్వాసితులకు అందివ్వాలి.
4. అన్ని సౌకర్యాలతో కూడిన గృహనిర్మాణ నమూనాలను అదివ్వాలి
5. వ్యవసాయ పనిముట్లు, ఎరువులు వంటి వ్యవసాయ అవసరాలకై ద్రవ్య సహాయం అందివ్వాలి.
6. తక్కువ వ్యయంతో నమూనా గృహాలను నిర్మించి ఇవ్వాలి.

ఇన్ని విధాలు పునరావాస కల్పనలో నాటి ప్రభుత్వం తగు జాగ్రత్తలు తీసుకున్నా, అసంతృప్తి వాదనలు వినపడుతూనే వుండేవి. పునరావాస కేటాయింపుల్లో భూములు, ఇళ్ళకు బదులు నగదు చెల్లిస్తే, తమకు అనువైన చోట నివాశాలు ఏర్పర్చుకోవచ్చనేది కొందరి వాదన. ఇలా కొన్ని సందర్భాల్లో ప్రభుత్వం భూములకు బదులు నగదు సైతం చెల్లించిన సందర్భాలు వున్నాయి. ఈ పరిస్థితుల్లో సైతం తాము చెల్లించిన నగదు ఇతరత్రా దుర్వినియోగమై ప్రజలు గూడూ-నీడా లేకుండా నిరాశ్రయులై పోతారేమోనని పాలకులు పరితపించిన పరిస్థితులున్నాయి. ఈ కారణంగానే పునరావాస కల్పన విషయంలో నిర్ధిష్ట కాలపరిమితిని నిర్దేశించుకుని సక్రమ నిర్వహణను చేపట్టాలని ప్రభుత్వం యోచించింది. పథకాల నిర్మాణానికి ముందుగానే పునరావాసకల్పనకై తగు ఏర్పాట్లు చేసుకుని, నిర్మాణాన్ని చేపట్టిన కారణంగా రైతాంగానికి ఇబ్బంది వుండదని నాటి ప్రభుత్వం భావించింది. ఈ కారణంగా, పథక ప్రారంభం నాటినుండే ప్రభుత్వం నిర్ధిష్ట అంచనాలతో యంత్రాంగాన్ని కదిలించి పునరావాసకల్పనను పటిష్టపర్చ గలిగింది.

తుంగభద్ర పథకం:

భారత నీటిపారుదలా కమీషన్ ఆధ్వర్యంలో నాటి ఉమ్మడి మద్రాను రాష్ట్ర ఆధ్వర్యం 1901-03 సంవత్సరాల్లో ప్రతిపాదించబడింది. కమీషన్ హైదరాబాద్ స్టేట్‌లో నీటి పంపకాన్ని సూచించిన కారణంగా పథక నిర్మాణం 50 ఏళ్ళు వెనకపడింది. జల పంపక చర్చలు, పథక నిర్మాణ రచన, ఒక కొలిక్కి వచ్చి భూసేకరణను మద్రాసు రాష్ట్రం 1941లో మొదలిడితే, హైదరాబాద్‌లో 1945లో మొదలెట్టింది.

ఈ ప్రాజెక్టు కారణంగా మూడు జిల్లాలు నష్టపోయాయి. బళ్ళారి, రాయ్‌చూర్, ధావార్. బళ్ళారి మద్రాసు రాష్ట్రానికి చెందింది. రాయ్‌చూర్, ధావర్ హైదరాబాద్‌కు చెందినవి.

ఈ ప్రాజెక్టు కారణంగా హైదరాబాద్‌కు చెందిన 37 గ్రామాలు ముంపుకు గురైనాయి. ఈ 37 గ్రామాల్లో 5225 కుటుంబాలకు చెందిన 30 వేలమంది నిరాశ్రయులైనారు.

నైజాం సాగర్ పునరావాస ఏర్పాట్లు అనుభవం ప్రభుత్వానికి బాగా ఉపయోగపడింది. నష్టపోయిన భూములకు ప్రతిగా భూములు. గ్రామాలకు బదులుగా గ్రామాలు. 19 పునరావాస కేంద్రలను ఏర్పర్చి, నిర్వాసితులందరికీ సేద్యానికి పొలం, ఉండటానికి ఇల్లు తప్పనిసరి అన్న నిబంధన అమలు పర్చారు. ఇళ్ళ నిర్మాణ పనుల్లోనూ, నిర్వాసితుల తరలింపులోనూ సైన్యం సహాయపడింది. 1953 నాటికల్లా నిర్వాసితులు స్థిరపడేటట్టు చేయగలిగారు.

వీటితోపాటు వ్యవసాయ పనిముట్లను, గృహనిర్మాణ సామాగ్రి కొనుగోలుకై రుణసహాయం, బహుళ ప్రయోజనాలకనువుగా సహకార సంస్థలను ఏర్పాటు చేశారు. "నాటి పునరావాస ఏర్పాట్లలో అసంతృప్తిని వెలికి తీసేందుకై చేసిన ప్రయత్నాలు సఫలం కాలేదు" అని నాటి ప్రాత్రికేయుడు రాసుకున్న విషయం, నాటి పునరావాస కల్పన ఔన్నత్యాన్ని చెప్పకనే చెప్తుంది.

ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన అనంతరం:

నాగార్జునసాగర్ పథకం: 1955లో ఆంధ్రా-హైదరాబాద్ రాష్ట్రాల సంయుక్తంగా ప్రారంభించాయి. 1960వ దశకం మధ్యలో పూర్తయింది. రెండు జిల్లాలు నల్గొండ, గుంటూరుకు చెందిన 57 గ్రామాలు ఖాళీ చేయబడ్డాయి. 5098 కుటుంబాలకు చెందిన 25 వేల మంది నిర్వాసితులైనారు. భూసేకరణ చట్టం: 32, 1956 ప్రకారం, 1962లో ప్రారంభించిన భూసేకరణ 1966 వరకూ సాగింది. కాని నష్టపరిహారం చెల్లింపులో 1.7.1953 నాటి మార్కెట్ విలువనే భూములను నష్టపోయినవారికి చెల్లించారు. 1953లోనే ప్రాజెక్టు నిర్మాణ విషయం ప్రజలు తెలుసుకున్నారు కాబట్టి నాటి విలువనే ఇవ్వాలని ప్రభుత్వం సమర్థించుకుంది. దీంతో 1874 నాటి పునరావాస చట్టం కన్నా అధమంగా ఇక్కడ నిర్ణయించారు.

ఫలితంగా ఎకరాకు 25 రూపాయల మేరకే నష్టపరిహారాన్ని చెల్లించారు.

పునరావాస పథకం: భౌతిక పునరావాస విధానాన్నే కొనసాగించినా నాగార్జునసాగర్ నియంత్రణా బోర్డు కొన్ని నిబంధనలను రూపొందించింది.

1. నిర్వాసితులకు 5 ఎకరాల మెట్టభూములకు మించి అనుమతించరాదు
2. అంతకు ముందు మూడేళ్ళ నాటినుంచి వ్యవసాయా ధారిత కుటుంబాలకే ఉచిత గ్రాంటు
3. ఉచితంగా ఇచ్చిన భూవసతిని, కేటాయించిన నాటినుండి ఐదేళ్ళ వరకూ ఎటువంటి బదలాయింపులకు అనుమ తించరాదు.
4. ఉచిత భూకేటాయింపుకు అదనంగా, 20 ఎకరాల భూవసతి కాన్న ఎక్కువ కోల్పోయిన వారికి మార్కెట్ రేటు ప్రకారం 20 ఎకరాకన్నా ఎక్కువ అనుమతించరాదు.
5. భూవసతి, మార్కెట్ చెల్లింపులు చెల్లించిన వారిలో ఏ తరహా భూవసతి లేనివారికి, తక్కువ భూవసతి వున్నవారికి ప్రాధాన్యత నివ్వాల్సిందిగా సూచించారు

ఈ సౌకర్యాలకు అదనంగా, 1. ఇళ్ళ స్థలాల కేటాయింపు, 2. నూతన పునరావాస కేంద్రానికి ఉచిత రవాణా, 3. మంచినీటి వసతి, 4. రోడ్లు తదితర సాధారణ సదుపాయాల కల్పన, 5. ఆలయాల నిర్మాణం, 6. కమ్యూనిటీ సెంటర్లు, చావిడిల నిర్మాణాన్ని చేపట్టాలని నిర్దేశించారు.

24 ప్రధాన పునరావాస కేంద్రాలకు అదనంగా 10 అనుబంధ పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. 2812 ఎకరాలు గుంటూరు జిల్లాలోనూ, 2480 ఎకరాలను నల్గొండ జిల్లాలలోనూ పునరావాసానికై కేటాయించారు.

నాగార్జునసాగర్ పునరావాస పనుల సందర్భంగా కొన్ని కొత్త నిబంధనలను అనుమతించడం గమనార్హం.

1. అదనపు ఉచిత భూవసతికి అదనంగా, నగదు చెల్లింపు అదనపు భూములకు, 2. భూసేకరణ భూముల్లో రైతులను లీజ్ పద్ధతిపై సేద్యానికి అనుమతించడం, నిర్మాణ పనులు మొదలిడే వరకూ. అయితే ఆచరణలో కొన్ని సమస్యలు తలెత్తాయి. నల్గొండ జిల్లా ఏలేశ్వరం ప్రాంతంలో వేరే గ్రామంలో ప్రత్యామ్నాయ నివాసాలను, భూవసతిని కేటాయించగా, అవి స్థానికులచే ఆక్రమణలకు గురికావడంతో ప్రత్యాన్మాయ కేటాయింపుల్లో సాధారణ వసతులు లోపించడం జరిగింది. ఫలితంగా పునరావాసకల్పన ఆలస్యానికి గురైంది. తదుపరి వరదల కారణంగా నిర్వాశితులు వేరే ప్రాంతాలను వెతుక్కోవలసి వచ్చింది. పునరావాసకల్పనలో ముందు చూపు లోపించిన కారణంగానే ఈ తరహా సమస్యలు తలెత్తాయి.

శ్రీరాం సాగర్:

తెలంగాణా ప్రాంతంలో ఆరుజిల్లాల్లో ఈ ప్రాజెక్టు నిర్మాణం ప్రభావితం చేసింది. మొదటి దశలో ఈ ప్రాజెక్టు నిర్మాణ కారణంగా 16.109 లక్షల ఎకరాలు రెండో దశలో 8.930 ఎకరాలకు సేద్యావసతి లక్ష్యం కాగా, మూడు దశాబ్దాలు దాటిన ప్రాజెక్టు నిర్మాణం 5 లక్షల ఎకరాల సేద్యావసతికే పరిమితమయింది.

నిజామాబాద్, అదిలాబాద్ జిల్లాల్లో ప్రధాన ప్రాజెక్టు కారణంగా 91 గ్రామాలు ముంపుకు గురికాగా, అనుబంధ మున్నేరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణంలో 117 గ్రామాలు నిర్వాసితమయ్యాయి. మొత్తం 117 గ్రామాల్లో 47599 కుటుంబాలకు చెందిన వారు నిర్వాసితులుగా మిగిలారు. 1,52,493 ఎకరాల భూసేకరణ జరిగింది.

ఈ ప్రాజెక్టుకు వచ్చేసరికి భూధరల నిర్ణయం ఏకీకృత మార్గంలో జరగలే.. స్పెషల్ డ్యూటీ కలెక్టర్ల యదేచ్ఛ మేరకు నిర్ణయాలు చోటు చేసుకున్నాయి. రిజిస్ట్రేషన్ గణాంకాలనే ఎక్కువ కేసుల్లో ప్రామాణికంగా తీసుకున్నారు. భౌతిక పునరావాస విధానంతో పాటు నగదు చెల్లింపు విధానం (కష్ గ్రాంట్ మెథడ్) ను అనుసరించారు.

భౌతిక పునరావాస విధానం (ఫిజికల్ రెహబిలిటేషన్ మెథడ్) లో 1) 5ఎకరాల మెట్ట సేద్యపు భూములు ఉచితంగా ఇవ్వడం.. లేదా రెండకరాల పల్లపు భూవసతిని ఇవ్వడం. ఇది కూడా మూడేళ్ళుగా సేద్యం ఆధారంగా జీవిస్తున్నవారికే. 2) ఇళ్ళ స్థలాలుగా పదిసెంట్ల నేలను ఉచితంగా, భూములను కోల్పోయిన వారికి కేటాయించారు. భూవసతి కోల్పోని వారికి ఐదు సెంట్లను కేటాయించారు. నగదు చెల్లింపు విధానం (క్యాష్ గ్రాంట్ మెథడ్) లో ప్రభుత్వ పునరావాస కేంద్రాల మినహా స్థిరపడాలనుకున్న కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి 5 వేల నగదు, ఇళ్ళస్థలాలు కాకుండా, కేవలం భూములనే కోల్పోయిన నిర్వాసితులకు 50 శాతం నష్టపరిహారాన్ని చెల్లించారు. ఇక్కడ మనం గమనించాల్సింది నిజాంసాగర్, తంగభద్రా ప్రాజెక్టుల పునరావాసం మానవతా లక్ష్యాలతో ముడిపడగా, క్రమానుగతంగా యాంత్రిక, అధికారిక నిర్ణయాలకు ఈ పునరావాసం పరిమితం కావడం.

1978 నాటి వరకూ పునరావాస విధానంలో మార్పు చోటు చేసుకోలేదు. ప్రతీ కుంటుంబానికి సగటున 29 ఎకరాల సేద్యపు వసతి లభ్యమయ్యేలా జాగ్రత్త వహించారు.

శ్రీశైలం ప్రాజెక్టు: శ్రీశైలం ప్రాజెక్టుకు వచ్చే సరికి ప్రభుత్వం పునరావాస కల్పనా విధాన పరిశీలనకై ఓ కమిటీని నియమించింది. కమిటీ కొన్ని సూచనలను చేసినప్పటికీ ప్రభుత్వం అనుమతించలేదు.

ఈ ప్రాజెక్టు పునరావాస కల్పనలో అనుసరించిన నియమాలు: 1. భూవసతిని కోల్పోయిన నిర్వాసితులకు 50 శాతం నష్టపరిహారాన్ని వెయ్యిరూపాయల గరిష్ట పరిధితో చెల్లించారు. 2. ఇళ్ళ స్థలాలనే కోల్పోయిన వారికి కూడా 50 శాతం నష్టపరిహారంగా వెయ్యిరూపాయల గరిష్ట పరిధినే అమలు చేశారు. 3. ఇళ్ళ స్థలాలతో పాటు భూవసతినే కోల్పోయిన వారికి 50 శాతం నష్టపరిహారాన్ని, 5 వేల రూపాయల గరిష్ట పరిధిగా అనుమతించారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పరిధిలోనే స్వాతంత్ర్యా అనంతరం, ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు నాటికే పునరావాస కల్పన పెనుమార్పులకు లోనయింది.

పునరావాస విధాన అమలుపై నిర్వాసితులకు ముందస్తు సమాచారం లేకుండా యదేచ్ఛగా అమలు కావడం, రాజ్య విధాన అమలులో మానవ హక్కులు- సమస్యలను పరిగణనలోకి తీసుకోకపోవడం జరిగింది. శాసన విధానంలో రాజకీయ వేత్తలు, అధికార్లు, కాంట్రాక్టర్లు వంటి శక్తుల ప్రమేయం పెరిగి అవినీతి మయంగా పునరావాస ప్రక్రియ మారిపోయింది.

రాష్ట్రావతరణకు ముందు నాటి పాలకులు పునరావాస కల్పనలో ప్రజాశ్రేయస్సుకే ప్రాధాన్యతను ఇవ్వడం మనం గమనించవచ్చు. లేని పక్షంలో నిర్వాసితుల ఇక్కట్లు పాలనా పరంగా మచ్చను తీసుకు వస్తాయని ఆలోచించడమూ జరిగింది. నిర్వాసితులకు చేపట్టిన ఆయకట్టు పరిధిలోనే పునరావాసాన్ని కల్పించడం ద్వారా నిర్వాసితుల అభివృద్ధి ప్రాతిపదికనే ప్రభుత్వాలు మెలగాయని తెలుసుకోవచ్చు. తరువాతి క్రమంలో ఈ ధోరణులకు నీళ్ళొదిలేసు కోవడం గమనార్హం!

ఈ క్రమానుగత పరిశీలనలో పునరావాస కల్పన పలువురు పరిశోధకులు, స్వచ్ఛంధ సంస్థలు, ప్రపంచబ్యాంకు 80 దశాబ్దాల నాటి నైజాం పాలకుల ధోరణులనే ఆదర్శప్రాయంగా తీసుకోవల్సి వుంది. నాటి నైజాం పాలకులే నేటి ప్రజాస్వామ్య నేతలకన్నా మెరుగ్గా వ్యవహరించారన్నది అక్షరసత్యం. ఇక ముందైనా ప్రస్తుత పాలకులు కళ్ళు తెరచి, నాటి నైజాం పాలకుల్నే పునరావాస కల్పనలో ఆదర్శంగా తీసుకోవల్సి వుంది!

(స్వేచ్ఛానువాదం... విద్యాభూషణ్)

ఇటీవలి అబద్ధం పులిచింతల!

-ఎన్. వేణుగోపాల్

ప్రభుత్వం అనేది ఒక పెద్ద అబద్ధాల తయారీకర్మాగారమని ఇప్పటికి ఒకటికి పదిసార్లు రుజువయింది. ఆ అబద్ధాల తయారీలో, పంపిణీలో, ప్రచారంలో పాలకపక్షమూ, దాదాపు అన్ని రాజకీయ పక్షాలూ కూడ తమవంతు పాత్రను సృజనాత్మకంగా పోషిస్తాయని కూడ ఎన్నోసార్లు రుజువయింది. ఈ కార్ఖానా మరీ ముఖ్యంగా ప్రపంచీకరణ క్రమం మొదలయ్యాక మూడు షిఫ్టులూ నిర్విరామంగా పనిచేస్తోంది. పాలక పక్షాలకు ప్రజలను మభ్యపెట్టవలసిన, అబద్ధాలు ప్రచారం చెయ్యవలసిన అవసరం నానాటికి విపరీతంగా పెరిగిపోతోంది.

ఈ అబద్ధాల వెల్లువలో అతి తాజా అబద్ధం పేరు పులిచింతల.

ఈ వారం రోజుల్లో పులిచింతల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ గురించి ప్రభుత్వం, పాలకపక్షం ఎన్ని అబద్ధాలాడిందో, అఖిలపక్ష సమావేశంలో ఆడిన అబద్ధాలను కూడా ఖండించకుండా, ఇతర పార్లమెంటరీ రాజకీయ పక్షాలు ఈ అబద్ధంలో ఎట్లా భాగం పంచుకున్నాయో చూస్తే ఆశ్చర్యం వేస్తుంది.

పులిచింతల ప్రాజెక్టు వల్ల లాభనష్టాలు, ముంపుకు గురయ్యే గ్రామాల సంఖ్య, నిర్వాసితులయ్యే జనసంఖ్య, నీటిపారుదల అవకాశాలు, విద్యుదుత్పత్తి అవకాశాలు, ప్రాజెక్టు చరిత్ర, ప్రస్తుతం ప్రాజెక్టు స్థలంలో జరుగుతున్న పనులు, వివిధ రాజకీయ పక్షాలకు ప్రాజెక్టుపట్ల ఉన్న అనుకూల వ్యతిరేకతలు, ప్రజల వైఖరి-వంటి అనేక విషయాలలో ప్రభుత్వం పచ్చి అబద్ధాలనో, అర్ధసత్యాలనో, తనకు అనుకూలంగా వక్రీకరించిన సత్యాలనో మాత్రమే వల్లిస్తోంది. మన ప్రతిపక్షాలు కూడ ఎంత దివాళాకోరు రాజకీయాలను అవలంబిస్తున్నాయంటే, ఏ ఒక్క ప్రతి పక్షానికీ ఈ అబద్ధాలను ఖండించే సమాచారం లేదు. సమాచారం సేకరించాలనే చిత్తశుద్ధి లేదు. అసలు ఈ విషయంలో వాస్తవాలపై ఆధారపడిన ప్రజానుకూల వైఖరి తీసుకోవాలనే ఆసక్తిలేదు.

పులిచింతల ప్రాజెక్టు విషయంలో పదమూడు సంవత్సరాలుగానో, ఇంకా అంతకన్న ముందునుంచో జరుగుతున్న వ్యవహారాన్నంతా పక్కనపెట్టినా, ఈ వారం, రెండు వారాలుగా జరుగుతున్న భాగోతంలో విచ్చలవిడిగా వెలువడుతున్న అబద్ధాలనే చూద్దాం.

పులిచింతల ప్రాజెక్టు విషయమై గురువారం నాడు ప్రభుత్వం ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశంలోనే కనీసం మూడు పెద్ద అబద్ధాలు ప్రచారంలోకి వచ్చాయి. మొదటిది, పులిచింతల ప్రాజెక్టు వల్ల కేవలం నల్లగొండ జిల్లాలో ఎనిమిదివేల ఎకరాలు, గుంటూరు జిల్లాలో ఐదువేల ఎకరాలు ప్రైవేటు భూమి ముంపుకు గురవుతుందని ప్రభుత్వం ప్రకటించింది. రెండు, ప్రస్తుతం ప్రాజెక్టు నిర్మాణ పనులు జరగడం లేదని, కేవలం డిజైనింగ్ పనులు మాత్రమే జరిగాయని ప్రభుత్వం చెప్పింది. పులిచింతల ప్రాజెక్టు వల్ల శ్రీశైలం ఎడమ కాలువకు, భీమా ప్రాజెక్టుకు కూడ మేలు జరుగుతుందని ప్రభుత్వం చెప్పింది.

మిగిలిన చిన్న చిన్న అబద్ధాలను వదిలి పెట్టినా ఈ మూడు ప్రధానమైన పెద్ద అబద్ధాలనైనా సాధికారికంగా, సాక్ష్యాధారాలతో ఖండించడం ప్రతిపక్షాలకు సాధ్యం కాలేదు. పులిచింతల ప్రాజెక్టుకు తాము సూత్రరీత్యా వ్యతిరేకం కాదని, అది చేపట్టడానికి తొందర ఎందుకని, మిగతా తెలంగాణ ప్రాజెక్టులు అయిపోయిన తర్వాత పులిచింతల మొదలుపెట్టవచ్చు గదా అని సన్నాయి నొక్కులు నొక్కారే తప్ప, పులిచింతలవద్దు అని ఒక్క ప్రతిపక్షసభ్యుడైనా అనలేకపోయారు. వద్దనడానికి వాళ్లదగ్గర వాదనలేవు. 'ఏదో ఒక సమస్య వచ్చింది, దీన్ని కూడ రాజకీయ లబ్ధికి వాడుకుందాం' అని తప్ప, పులిచింతల ప్రాజెక్టుతో బాధితులైన ప్రజలు ఏం అంటున్నారు, వాళ్ల ప్రయోజనాల రక్షణకు ఏ వాదనలు పెట్టాలి, ఏ సాక్ష్యాధారాలు చూపాలి అనే శ్రద్ధాసక్తులు ప్రతిపక్షాలకు కూడ లేవు.

ఏలినవారు ఉద్దేశ్యపూర్వకంగా ఆడిన మూడు పెద్ద అబద్ధాలలో మొదటిది, ముంపు ప్రాంతానికి సంబంధించినది. కేవలం ప్రైవేటు భూముల విస్తీర్ణం అంకెను మాత్రం ప్రకటించింది, ప్రభుత్వ భూములు ఎన్ని ముంపుకు గురవుతాయో ప్రభుత్వం దాచిపెట్టింది. ఎంతమంది నిర్వాసితులవుతారు? ఎన్ని ఖనిజ నిలువలు మునిగిపోతాయి? ఎంత విస్తీర్ణంలో అడవులు మునిగిపోతాయి? ముంపు ప్రాంతంలో పరిశ్రమలేమన్నా ఉన్నాయా? మొత్తం మీద ఎంతమంది ఉపాధి కోల్పోతారు? వంటి ప్రశ్నలన్నిటినీ ప్రభుత్వం దాటవేసింది. అసలు ఒక ప్రాజెక్టు నిర్మాణ సందర్భంలో లెక్కవేయవలసిన సాంఘిక, ఆర్థిక వ్యయాలను ప్రభుత్వం సక్రమంగా లెక్కవేయనేలేదు. ప్రభుత్వం చేత అట్లా లెక్కవేయించాలని, ఈ ప్రశ్నలన్నిటికీ జవాబులు చెప్పించాలని కూడ ప్రతిపక్షాలు అనుకోలేదు.

మొత్తం మీద పులిచింతల ప్రాజెక్టు నిర్మాణం వల్ల 35 గ్రామాలు ముంపుకు గురవుతాయి. ముప్పైవేల ఎకరాల భూమి మునిగిపోతుంది. ఇందులో గూంటూరు జిల్లాకు చెందిన భూమి పదకొండువేల ఎకరాలుగా నల్లగొండ జిల్లాకు చెందినది పందొమ్మిదివేల ఎకరాలు. మొత్తం ముంపు భూమిలో మూడువేల ఎకరాలు కృష్ణపట్టి అటవీప్రాంతం.

పులిచింతల రిజర్వాయర్ నిర్మాణం జరిగితే కనీసం యాభైవేల మంది ప్రజలు నిర్వాసితులవుతారు. ఈ ప్రాంతంలో ప్రస్తుతం పనిచేస్తున్న పద్దెనిమిది సిమెంటు కర్మాగారాలు మూతపడి ఎనభైవేల మంది ఉపాధికోల్పోతారు.

ఇంత విధ్వంసానికి, బీభత్సానికి కారణమై నిర్మించబడే పులిచింతల ప్రాజెక్టువల్ల లాభాలేమైనా ఉన్నాయా అంటే లేవనే చెప్పాలి. నల్లగొండ, గుంటూరు జిల్లాలో ఇన్ని నష్టాలు కలగజేసే ఈ ప్రాజెక్టు వల్ల కృష్ణాజిల్లాలో కొన్ని ప్రాంతాలకు మూడోపంటకు నీటికి అవకాశం దొరుకుతుంది. కృష్ణా జిల్లాలో నీటిపారుదల వ్యవస్థను స్థిరీకరించడమే పులిచింతల బాలెన్సింగ్ రిజర్వాయర్ ఉద్దేశ్యమని ప్రభుత్వం స్పష్టంగానే చెపుతోంది. ఎవరి వెలుగుల కోసం ఎవరికి చీకట్లు సృష్టిస్తున్నారని, చీకటిలోకి తోయబడ్డవాళ్లు ఎప్పుడో ఒకప్పుడు అడగక తప్పదు.

ఇంతవరకూ దేశ వ్యాప్తంగా నిర్మాణమైన అన్ని భారీ నీటిపారుదల ప్రాజెక్టుల సందర్భంలోనూ నిర్వాసితుల గతి ఏమయి పోయిందో, వాళ్లకు వాగ్దానం చేసిన పునరావాస కార్యక్రమాలు ఎంత అవకతవకలుగా జరిగాయో చూస్తే అది ఒక విషాద చరిత్ర. అందులోనూ భూములు ఉన్న వాళ్లకు, ఆస్తులు ఉన్నవాళ్లకు ఎంతో కొంత నష్టపరిహారం దొరుకుతుంది గాని భూమిలేని నిరుపేదలకు, సాముహిక ఆస్తి భావనలున్న ఆదివాసులకు ఆ నష్ట పరిహారం కూడ అందదు.

ఇప్పుడు ప్రాజెక్టు నిర్మాణ పనులు జరగడం లేదని, కేవలం డిజైనింగ్ పనులే జరుగుతున్నాయని ఏలినవారు మరొకభయంకరమైన అబద్ధం ఆడారు. డిజైనింగ్ పనికి, నిర్మాణ పనికి మధ్య ఉన్న సన్నని సాంకేతికపరమైన తేడాను పక్కన పెట్టినా, ప్రాజెక్టు చరిత్రను ఒక్కసారి పరిశీలిస్తే చాపకింద నీటిలాగ ఆంధ్రపక్షపాతం, తెలంగాణ వ్యతిరేకత ఈ వ్యవహారంలోకి ఎట్లా చొరబడ్డాయో అర్థమవుతుంది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఆలోచనలు ఊపుఅందుకోక ముందే కొన్ని పనులు జరిపి, ఇక ఆ తర్వాత ప్రాజెక్టు నిర్మించక తప్పదని ఒప్పించేందుకే కుట్ర పూరితంగానే పనులు మొదలయ్యాయి.

అసలు పులిచింతల ప్రాజెక్టు ఆలోచన నాగార్జునసాగర్-నందికొండ ప్రాజెక్టుల ఆలోచన కన్న ముందుది. బ్రిటీష్ ప్రభుత్వం అధికార మెకంజీ 1872లోనే పులిచింతల దగ్గర ప్రాజెక్టు కట్టే అవకాశం ఉందని ప్రతిపాదించాడు. ఆ తర్వాత 1908-13 మధ్య బ్రిటీష్ ప్రభుత్వం వివరమైన సర్వేలు జరిపింది. కృష్ణా, గుంటూరు జిల్లాల మెట్ట ప్రాంతాల రైతాంగం 1949 నుంచే ఈ ప్రాజెక్టుకోసం ఆందోళనలు జరుపుతోంది. చివరికి ఇప్పుడు ఖరారైన పులిచింతల బాలెన్సింగ్ రిజర్వాయర్ ఈ వెంట్ట ప్రాంతాల రైతుల ప్రయోజనాలకోసం కూడ కాదు. కేవలం కృష్ణా డెల్టాకు మూడోపంటకు నీరు అందించడానికే. తెలుగు దేశం ప్రభుత్వం 1988 నవంబర్‌లో ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసింది. పదమూడు సంవత్సరాల తర్వాత ఇంకా డిజైనింగ్ పనులు నడుస్తున్నాయని చెప్పడమంత హాస్యాస్పదమైన సంగతి మరొకటుండదు.

ఎందుకంటే, ప్రభుత్వం హడావుడిగా ఈ ప్రాజెక్టుకు అవసరమైన పర్యావరణ మంత్రిత్వశాఖ అనుమతిని, కేంద్రజల సంఘం అనుమతిని ఎప్పుడో సంపాదించింది. రూ.175 కోట్ల వ్యయం అంచనాతో ప్రారంభమైన ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం ఇప్పుడు దాదాపు వెయ్యికోట్లకు పైబడింది. మూడు సంవత్సరాల క్రితం ప్రాజెక్టు వ్యయం రూ.750 కోట్లని అంచనా వేసినప్పుడు అందులో 40 శాతం లబ్ధిదారులైన రైతాంగం భరిస్తే ప్రాజెక్టు వెంటనే నిర్మిస్తానని ప్రభుత్వం ప్రకటించింది. 1998 జూలైలో జరిగిన అఖిలపక్ష సమావేశంలో ఈ ప్రాజెక్టును ఐదు సంవత్సరాలలోపు నిర్మిస్తామని, రైతులు ప్రతి ఏటా రూ. 65 కోట్లు విరాళం ఇవ్వాలని, ఆ విరాళం కూడ ఒకపంట పండించే రైతులు ఎకరాకు బస్తా ధాన్యం చొప్పున ఇవ్వాలని నిర్ణయించారు.

మన ప్రతిపక్ష సభ్యులకు ఈ పాత అఖిలపక్ష సమావేశం సంగతి కూడ గుర్తులేదు. ఇప్పటికి పనేమీ జరగలేదని, ఇప్పుడే డిజైనింగ్ పనులు జరుగుతున్నాయని ఏలినవారు సెలవిస్తే, అఖిలపక్షం నోట్లో వేలు వేసుకుని వింటూ కూచింది.

ఇక మూడో అబద్ధం గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంతమంచిది. కింద ఒక ప్రాజెక్టు కడితే పైన ప్రాజెక్టులో నీళ్లు మిగిలి, అందువల్ల పై ప్రాంతాలయిన తెలంగాణ నీళ్లు దొరుకుతాయట. తాటిచెట్టు ఎందుకు ఎక్కావంటే దూడగడ్డికోసం అన్న వాడికి కూడ ఇంతకన్న ఎక్కువ ఇంగిత జ్ఞానం ఉందనాలి. శ్రీశైలం ఎడమ కాలువ, భీమా ప్రాజెక్టులు సక్రమంగా ఉపయోగపడాలంటే వాటిమీద కేంద్రీకరించాలి గాని, కిందపులిచింతల కడితే పైనవాటికి నీళ్లు వస్తాయనడం విధవా పునర్వివాహాలకోసం బాల్య వివాహాలను సమర్థించిన గిరీశానికి అక్షరాలా నకలు!

(ప్రజాతంత్ర, జూన్ 9, 2001)

అగ్రగామి ఆంధ్రప్రదేశ్


నేడే ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం

ముఖ్య అతిథి : డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి,

వేదిక: ఎన్.టి.ఆర్.స్టేడియం, ఇందిరాపార్క్ దగ్గర, హైదరాబాద్,

తెలుగు మాట్లాడే ప్రజలందరూ ఒక్కటిగా కలిసి ఉండాలనే
మహదాశయంతో ఎందరో మహానుభావుల అమూల్య త్యాగాల ఫలితంగా
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అవతరించింది. ప్రాధాన్యతారంగాలైన
వ్యవసాయ, పారిశ్రామిక, సంక్షేమ రంగాలలోనే కాకుండా
అన్ని రంగాలలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా..
'హరితాంధ్రప్రదేశ్' లక్ష్యంగా.. ప్రగతి మార్గంలో పయనిస్తోంది.

సమగ్రభూమి అభివృద్ధి పథకం పేద రైతులకు ఆశాకిరణం







గౌ॥ శ్రీ. డి. శ్రీనివాస్

"ఇందిర ప్రభ"
సమగ్ర భూమి అభివృద్ధి పథకం

ఆంధ్రప్రదేశ్‌లోని చిన్న మరియు సన్న కారు రైతుల జీవితాల్లో కొత్త వెలుగులు ప్రభవించేందుకు సమగ్ర భూమి అభివృద్ధి పథకం - "ఇందిర ప్రభ"ను రూ. 500కోట్లతో అమలు చేయడం జరుగుతున్నది. దీని ద్వారా చెరువుల్లు కుంటలు, చెరువుల్లు తెగలు, బలహీన వర్గాల రైతులకు కేటాయించిన భూములను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో, మాజీ ప్రధాని స్వర్గీయ శ్రీమతి ఇందిరాగాంధీ స్ఫూర్తితో రాష్ట్రమంతా "ఇందిర ప్రభ" పథకాన్ని ప్రారంభించడమైంది.

ఈ పథకం యొక్క ముఖ్య ఉద్దేశ్యాలు

- నిరుపేదలకు కేటాయించిన బంజరు భూములను సాగులోకి తేవడం.
- RIDF IX మరియు X పథకాల ద్వారా సుమారు 2 లక్షల మంది కుటుంబాలకు ఆహార భద్రతతో పాటు జీవనోపాధులు కల్పించడానికై సుమారు 3లక్షల ఎకరాలలో వ్యవసాయ పంటలు, పండ్లతోటల్ని చేపడతారు.
- పంటల దిగుబడి పెంచుతూ, మార్కెట్ సౌకర్యం కల్పించి, పేద రైతుల్లో ఆత్మవిశ్వాసం, ఆర్థికబలం పెంపొందించడం.

గ్రామీణాభివృద్ధి శాఖ
ఆంధ్రప్రదేశ్



బంజరు భూముల్లో బంగారం పండించు - ప్రభుత్వ చేయూతతో పైచేయి నీదేననిపించు !